ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ : fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 164 పేజీలు: 12 వెల: 6.50

షాబాద్ హత్యల కిరాతకుడు ఆత్మహత్య 2లో

పబ్‌లో అగ్నిప్రమాదం: 27 మంది మృతి 9లో




సోమవారం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, సభకు హాజరైన అభిమానులు, ప్రజలు

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

రెండేళ్లలో ఇరిగేషన్‌కు రూ.24వేల కోట్లు ఖర్చు

పవన్‌ను, కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు

ధవళేశ్వరం బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించిన సిఎం చంద్రబాబు

వచ్చే జూన్ నాటికి గేట్లు బిగింపు పూర్తి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 13 ప్రభాతవార్త:** గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్‌కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి ఆరాతీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని, >>2

# వచ్చే మార్చికి 'పోలవరం' పూర్తి

ఆగస్టు 14న అనకాపల్లికి గోదావరి జలాలు

రెండేళ్లలో 15% పనులు పూర్తి చేశాం: సిఎం చంద్రబాబు

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి, జూలై 13:** పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి రాష్ట్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆగస్టు 14న అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేసి అఖండ హారతి నిర్వహిస్తామని వెల్లడించారు. పోలవరం పనుల పురోగతిని ప్రతి నెల ప్రజలకు వెల్లడిస్తామని చెప్పారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం, మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాధాన్యత సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. సెప్టెంబర్‌లో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు మొత్తం పనుల్లో 89 శాతం పూర్తయ్యాయని సీఎం వెల్లడించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే పూర్తి చేయగా, తమ ప్రభుత్వం రెండేళ్లలోనే 15 శాతం పనులు పూర్తి చేసి రూ.7,100 కోట్ల వ్యయం చేసిందన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టుపై 136 సార్లు సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పనులు ప్రణాళిక ప్రకారమే స్పిల్‌వే, రేడియల్ గేట్లు, కాఫర్ డ్యాం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్1లో 40శాతం, గ్యాప్2లో 30శాతం, గ్యాప్3లో 100శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కుడి కాల్వ ఎర్త్‌వర్క్ పూర్తిగా, ఎడమకాల్వ ఎర్త్‌వర్క్ 99 శాతం పూర్తయిందన్నారు. ఎడమ, కుడి ఇరిగేషన్ టన్నెల్లు 100 శాతం పూర్తయ్యాయని వివరించారు. 7.2 లక్షల ఎకరాలకు కొత్త సాగునీరు పోలవరం పూర్తయితే 7.2 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందుతుందని, 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని సీఎం తెలిపారు. 28.5లక్షల మందికి తాగునీరు, >>2

# గ్రామాలకు కొత్త రూపు

నరసన్నపేట నియోజకవర్గంలో రూ.4.33 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



సోమవారం పోలాకి మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం\నరసన్నపేట,జులై 13 ప్రభాతవార్త:** గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. సోమవారం నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలంలో పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులు బగ్గ రమణ మూర్తితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గొల్లలవలస చెరువు నుంచి డీపీఎన్ రోడ్డు వరకూ కోటి రూపాయలతో నిర్మించిన బీటీ రహదారి, 12.98 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్, దీర్ఘాశి నుండి గొల్లలవలస వరకు 80 లక్షలతో నిర్మించిన బిటి రోడ్డు, కొల్లివలస మబగాం వరకు 1.90 కోట్లతో నిర్మించిన సిసి రోడ్లను, ఖాన్ సాహెబ్ పేట వద్ద మబగాం నుండి కాంచీపేటకు 50 లక్షలతో సిసి రోడ్డు, జలజీవన పథకం కింద కాంచీపేటకు 15 లక్షల రూపాయలతో రక్షిత మంచి నీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. మబగాం కాలనీ 21.10 లక్షలతో జలజీవన మిషన్ కింద రక్షిత మంచి నీటి పథకానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ క్లినిక్ కు సంబంధించి ఆబా కార్డు గూర్చి డిఎంహెచ్ఒను మంత్రి అడుగగా ఆబా కార్డులకు సంబంధించి డిఎంహెచ్ఒ మంత్రికి వివరించారు. ఆసుపత్రికి ఫర్నిచర్ కోసం అడిగి తెలుసుకున్నారు. గొల్లలవలస, దీర్ఘాశి, మబగాం గ్రామాలు రావడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు. నాన్నగారైన స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు ఉన్నప్పటి నుంచి మమ్మల్ని అందరిని ఆదరించి మీ గుండెల్లో పెట్టుకొని మీరందరూ ఎంతో ఆదరణ, ఎంతో ప్రేమ, ఎంతో అభిమానం మాకు ఎల్లప్పుడూ కూడా చూపిస్తున్నందుకు గ్రామస్తులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మాకు కూడా మీ తాలూ కారుణం తీర్చుకోవాలనే >>2

బోటు ప్రమాద మృతదేహాలు

# నేడు అప్పగింత

ఏర్పాట్లు పర్యవేక్షిస్తోన్న మంత్రి కొండపల్లి

**విజయవాడ. జులై 13 ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నాం సముద్ర తీరంలోని ఫు క్వాక్ సముద్రతీరంలో శనివారం జరిగిన ఘోర బోటు ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వియత్నాం నుంచి వస్తోన్న విమానం మంగళవారం ఉదయం 7.20 గంటలకు హైదరాబాద్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుందని మంత్రి తెలిపారు. మంత్రి కొండపల్లి సోమవారం రాత్రి 8గంటల నుంచే ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఏర్పాట్లు పర్యవేక్షి స్తున్నారు. మృతదేహాలను మృతుల స్వస్థలాలకు తరలించేందుకు ఏపీఎన్నార్టీ అధికారులు ప్రత్యేక ఆంబులెన్స్‌లు సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ మనదేశ ఎంబసీతో పాటు వియత్నాం ఎంబసీతో మాట్లాడి మృతదేహాలు త్వరగా ఇండియాకు వచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇక ఏపీ ఎన్నార్టీ అధికారులు మృతుల >>2

# మరో 175 మెడికల్ సీట్లు

పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100, విజయవాడ సిద్దార్థకు 75 సీట్లు కేటాయింపు

4 కాలేజీల్లో అదనంగా 325 సీట్లు

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అదనంగా 505 సీట్లు

ప్రైవేట్‌కు 550 సీట్లు అదనం



**విజయవాడ.జులై13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణలో మరో కీలక ముందడుగు పడింది. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) రాష్ట్రంలోని రెండు ప్రభుత్వ వైద్యకళాశాల(పిడుగురాళ్ల, విజయవాడ)ల్లో 175 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఆమోదం తెలిపింది. వీటితో కలిపి ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా లభించిన సీట్ల సంఖ్య 325కు చేరింది. పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 202627 విద్యా సంవత్సరంలో 100 సీట్లతో ప్రవేశాలు జరిపేందుకు ఎన్ఎంసి అనుమతినిచ్చింది. అదేవిధంగా విజయవాడ ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాలకు అదనంగా 75 సీట్లను ఎన్ఎంసి మంజూరు చేసింది. ఈ మేరకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసి) లెటర్ ఆఫ్ పర్మిషన్లను సోమవారం జారీ చేసింది. ఇప్పటికే కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు 75, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు 25 సీట్ల పెంపునకు ఎన్ఎంసి ఆమోదం తెలిపింది. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 50 అదనపు ప్రవేశాలు జరుగనున్నాయి. దీంతో ఈ ఒక్క విద్యా సంవత్సరంలోనే రాష్ట్రానికి ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా 325 అదనపు ఎంబీబీఎస్ సీట్లు లభించినట్లైంది. 2024-25 నుండి ఇప్పటి వరకు ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 505 సీట్లు అదనంగా లభించాయి. ఎంబీబీయస్ సీట్లు భారీగా పెరగడంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న నీట్ మెరిట్ విద్యార్థులకు ఊరటనిస్తోంది.

**మంత్రి సత్యకుమార్ నిరంతర కృషి:** ఈ ఫలితాల వెనుక రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చేసిన నిరంతర కృషి కీలకంగా నిలిచింది. ఎన్ఎంసి అనుమతులు పెండింగ్‌లో ఉన్న ప్రతి కళాశాల పురోగతిని స్వ యంగా సమీక్షిస్తూ, ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ,ఎన్ఎంసి ఉన్నతాధికారులతో >>2

# గోదావరి 'సంగమం'



పట్టిసీమ నుంచి ఇబ్రహీంపట్నం ,చేరుకున్న గోదావరి జలాలు

డెల్టా రైతాంగం హర్షాతిరేకాలు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** గోదారమ్మ బిలబిలమంటూ పరుగులు దీస్తూ వచ్చి తన సోదరి కృష్ణమ్మను ముద్దాడింది. నల్లనమ్మను ఎర్రనమ్మ కలిసిన దృశ్యం చూపరులకు కనువిందు చేస్తోంది.సాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న డెల్టా రైతాంగానికి ఈ పరిణమం ఆనందన్నా పంచుతుంది.పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి విడుదలైన నీరు పోలవరం కుడి ప్రధాన కాల్వ ద్వారా సుమారు 175 కిలో మీటర్లు నాలుగు రోజుల పాటు ప్రయాణించి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలో కలిసింది. ఖరీఫ్ సీజన్‌లో నెలకు సుమారు 12 టీఎంసీల చొప్పున మొత్తం 48 టీఎంసీల గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటం, సాగునీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుని పంటలను విజయవంతంగా సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానానికి ప్రతీకగా నిలిచిన పట్టిసీమ పథకం మరోసారి తన ప్రాధాన్యాన్ని చాటుకుంటూ, డెల్టా ప్రాంతంలో వ్యవసాయానికి భరోసాగా నిలుస్తోంది. వరుసగా 12వ ఏడాది కూడా పట్టిసీమ ఎత్తిపోతల పథకం కృష్ణా డెల్టాకు వరంగా >>2

# ముగింపు దశకు ఓటర్ల జాబితా సవరణ



సిఇఒ వివేక్ యాదవ్

గడువు పెంచాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసిన ఎపి సిఇఒ

**విజయవాడ, జులై 13, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో జాబితా సవరణ ముగింపు దశకుచేరుకుంది. ఈ క్రమంలో ఓటర్ల గడువు పొడిగించాలని సీఈసీకి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ సీఈవో లేఖ రాసారు. రాష్ట్రంలో పూర్తయిన 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ చనిపోయినట్లుగా 14 లక్షల మందికి పైగా ఓటర్ల గుర్తింపు శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు 12 లక్షలకు పైనే ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) గత నెల రోజుల నుంచి జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అయితే, వివిధ రాజకీయ పార్టీల వినతుల మేరకు ఈ ప్రక్రియ గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో నెల రోజుల నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మొత్తం 4 కోట్ల 16 లక్షల 26 వేల 144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. పంపిణీ చేసిన వాటిలో ఇప్పటివరకు 3 కోట్ల 69 లక్షల 50 వేల 812 మంది ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేశారు. అంటే మొత్తంగా 88 శాతం మంది ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఇంకా 1.67 శాతం ఫారాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సర్వేలో పలు అంశాలు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644లక్షలమంది ఓటర్లు >>2

మాజీ మంత్రి కుమారుడు

# పోలీసులకు లొంగుబాటు

బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి మరణించిన కేసు

**పలాస(శ్రీకాకుళంజిల్లా),జులై 13 ప్రభాత వార్త:** శ్రీకాకుళం జిల్లాలో సంచలనం రేపిన బైక్ ప్రమాదం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ కాశీ బుగ్గ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. న్యాయవాదితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆరవ్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. ఈ నెల 10న జరిగిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం తెలి సిందే. ఈ ప్రమాదంలో అతివేగంగా బైక్ నడిపిన ఆరవ్ కారణమని పోలీసులు గుర్తిం చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడుతున్నారు.

**దానయ్య కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్:** >>2

# ఇక 'షార్ట్' హజ్ యాత్ర



ఆప్షన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి ఫరూక్

**విజయవాడ,జులై13,ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర మక్కా హజ్ యాత్ర లో కుదిరించబడిన రోజులతో "షార్ట్" హజ్ యాత్ర సౌకర్యాన్ని కేంద్ర హజ్ కమిటీ కల్పించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. తక్కువ రోజుల వ్యవధి తో హజ్ యాత్ర పూర్తి చేయాలనుకునే వారు ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా అవకాశాన్ని పొందవచ్చని అమరావతిలో సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్ 2027లో దాదాపు 20 రోజులకు కుదించబడిన ప్రణాళికతో షార్ట్ హజ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నదన్నారు. ఈ ప్యాకేజీలో మదీనాలో 2 లేదా 3 రోజుల బస కూడా చేర్చబడిందన్నారు. ప్రస్తుతం 3545 రోజుల వ్యవధితో హజ్యాత్రకు, 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ యాత్ర ప్యాకేజీ ధరల్లో ఎలాంటి వ్యత్యాసముండదని మంత్రి ఫరూక్ స్పష్టత ఇచ్చారు. 2027 హజ్ యాత్రలో దేశ వ్యాప్తంగా హజ్ కు వెళ్లే వారిలో గరిష్టంగా 10000 మందికి ఈ సౌకర్యం కల్పించేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుందన్నారు. 20 రోజుల వ్యవధితో షార్ట్ హజ్ కోరుకునే వారు తమ హజ్ దరఖాస్తును ఆన్ లైన్ లో సమర్పించేటప్పుడు, అందులో ఇచ్చిన షార్ట్ హజ్ ప్యాకేజీ ఆప్షన్ ను ఎంచుకోవాల్సి ఉంటుందని తెలి పారు. ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా షార్ట్ హజ్ ను పొందుపరిచిన అనంతరం, ఆన్ లైన్ లో దరఖాస్తు సమర్పించిన అనంతరం ప్యాకేజీ మార్చుకోవడానికి అవకాశం ఉండదని మంత్రి తెలిపారు. షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న యాత్రికులను లాటరీ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. హజ్ కు ఎంపికై షార్ట్ హజ్ కు ఎంపిక కాని వారికి ఆటోమేటిక్ గా సాధారణ హజ్ పాకేజ్ (3545 రోజులు) వర్తిస్తుందని తెలిపారు. ఒక కవర్ లోని యాత్రికులందరూ ఈ షార్ట్ హజ్ ఆప్షన్ ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. ఒకే కవర్ లో రెండు ప్యాకేజీలు అనుమతించబడవని పేర్కొన్నారు. కాగా షార్ట్ హాజ్ యాత్ర ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్, కోల్ కతా, అహ్మదాబాద్ నుండి మాత్రమే నిర్వహించ బడుతుందన్నారు. హజ్ 2027 కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఈ నెల 20వ తేదీన ముగుస్తున్నందున, గడువుకు ముందుగానే ఆన్ లైన్ ద్వారా హాజీలు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

14-7pg2exHMNWJQE_14-7pg2exHMNWJQE.qxd 14/Jul/26 12:13 AM Page 1





సోమవారం ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నిమ్మల, దుర్గేష్ అనగాని, ఎమ్మెల్యేలు తదితరులు

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

>> 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుక లంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్య మంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని కనీసం గ్రీజ్ పెట్టిందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని విమర్శించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం:** ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. 201419 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన కాలం దరకు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమైందని, కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**అభివృద్ధి,సంక్షేమమే కూటమి లక్ష్యం:** రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జీవిత శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీలేనిపోరాటం చేస్తున్నారంటూ, మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగానికి పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తాం దన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని వారికి డబ్బిచ్చి ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సు

# గ్రామాలకు కొత్త రూపు

>> ఆలోచనతో గొల్లలవలసకి ప్రాధాన్యత ఇస్తూ, గొల్లలవలస గ్రామం తాలూకా సమస్యల్లో ప్రభుత్వం తాలూకా పాత్ర పూర్తిగా మీ అందరికీ కూడా సహకరించే విధంగా గతంలో 2014-19 లో కూడా చాలా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. తిరిగి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్ళీ గ్రామంలో అభివృద్ధి అనడానికి ఒక ఉదాహరణగా కొన్ని కార్యక్రమాలు జరిగినట్లు చెప్పారు. ఇప్పుడు కూడా మీరు చూసుకుంటే పోలాకి వరకు, డోల వరకు ఉన్నటువంటి రోడ్డు 1 కోటి రూపాయలతో రోడ్డు ఈరోజు మనం ఏర్పాటు చేయడం జరిగింది. 1.20 కోట్లు తోటాడ రోడ్డు కూడా మనం కేటాయించడం జరిగినట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్నటువంటి హెల్త్ వెల్నెస్ సెంటర్ భవనానికి కూడా సుమారు మరొక 13 లక్షలు కేటాయించి బ్రహ్మాండంగా గ్రామంలో ఉన్నటువంటి వ్యక్తులందరికీ కూడా ఆరోగ్యం బాగుండాలనే ఆలోచనతో ఈ భవనాన్ని పూర్తి చేసుకున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ల పెంపిణీ కార్యక్రమం 3000 నుంచి 4000 రూపాయలు. అలాగే తల్లికి వందనం కార్యక్రమం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ 15,000 రూపాయలు ఇచ్చామన్నారు. స్త్రీ శక్తి కింద మహిళలు ఎక్కడికి బస్సు ఎక్కి వెళ్ళాలన్నా ప్రయాణం ఉచితం చేసి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వాళ్ళకి చేశామన్నారు. అన్నదాత సుఖీభవ కింద సంవత్సరానికి 20,000 రూపాయలు రైతన్నల అకౌంట్లలో నేరుగా వేసే కార్యక్రమం చంద్రబాబు నాయుడు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ రెండు సంవత్సరాలు మీరు చూశారు, మళ్ళీ ఊపిరి పోసుకున్నట్టుగా అయిందన్నారు. గృహాలు లేనటువంటి వారు ఎవరైతే ఉన్నారో, వాళ్ళందరికీ కూడా గృహాలు కేటాయించి, ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించి గృహాలు కట్టించే కార్యక్రమం అతి త్వరలోనే కూటమి ప్రభుత్వం చేపట్టబోతుందని స్పష్టం చేశారు. అత్యంత అవసరమున్న నిరుపేదలు ఎవరైతే ఉన్నారో వాళ్లందరికీ గృహాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పెన్షన్లు కూడా అదనంగా ఎవరైతే అర్హులు ఉన్నారో వితంతు పెన్షన్ కావచ్చు, వికలాంగ పెన్షన్ కావచ్చు, ఇవన్నీ కూడా కొత్త పెన్షన్లు ఏవైతే ఉన్నాయో అన్ని సర్వే చేసి సిద్ధంగా ఉన్నాయన్నారు. ముందు తల్లికి వందనం కార్యక్రమం చేయాలనేది చంద్రబాబు నాయుడు ఆలోచనని, అది అయిన వెంటనే కొత్త పెన్షన్లు కూడా ఎవరెవరైతే అర్హులు ఉన్నారో వాళ్లకి కొత్త పెన్షన్లు అతి త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం కూడా చంద్రబాబు నాయుడు చేస్తున్న కార్యక్రమాలు మూడు సిలిండర్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి ఇవన్నీ కూడా నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన కార్యక్రమాలు కూడా చేయడానికి చంద్రబాబు నాయుడు, మన ప్రభుత్వం, పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి మోదీ అందరి సహకారం తీసుకొని మిగిలిన కార్యక్రమాలన్నీ కూడా చేస్తామన్నారు. జల్ జీవన్ మిషన్ అనే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వ వాటాతో ఇంటింటికి కొళాయి కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మీ అందరికీ కూడా మాట ఇచ్చాం. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామన్నారు. ఇంటింటికి కొళాయి కూటమి ప్రభుత్వం తాలూకా హామీ అని, ఆ హామీ ప్రకారం మన నరసన్నపేట నియోజకవర్గంలో కూడా పథకం మంజూరు చేసి, నిధులు కూడా దానికి కేటాయించినట్లు చెప్పారు. పనులు త్వరితగతిన పూర్తి చేసుకొని గ్రామంలో ఇంటింటికి కూడా కొళాయి ఇవ్వాల్సినటువంటి కార్యక్రమం ఇంకా ఉందన్నారు. ఎరువులు ఎక్కడా కూడా ఇబ్బంది లేదని కలెక్టర్ ప్రతి రోజు తెల్లవారి మొట్టమొదట ఈ జిల్లాలో చేసే కార్యక్రమం ఒకటి సాగునీరు సరిగ్గా అందుతుందా, ఎరువులు ఎలాగ ఉన్నాయని ప్రతి రోజు జిల్లా నలుమూలల నుంచి ప్రతి ఒక్క రైతాంగం నుంచి కూడా ఆయన రైతుల నుండి అభిప్రాయం సేకరణ చేస్తున్నట్టు చెప్పారు. మీ మీ గ్రామాల్లో ఎరువుల సమస్యలు ఉంటే చెప్పండి, ఆయన కూడా ఇక్కడున్నారు కాబట్టి పరిశీలన చేసి ఎరువులఎక్కడా కొరత లేకుండా చూసుకునే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వానిదన్నారు. రైతులందరికీ కూడా తెలియజేస్తున్నాం. విత్తనాలు గాని, ఎరువులు గాని, మళ్ళీ రేపు మనమందరం చక్కగా పంట పండించుకొని కొనుగోలు చేసి, మళ్ళీ మీ అందరికీ 48 గంటల్లో రైతు అకౌంట్లలో డబ్బులు వేయించే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వానిదన్నారు.



పోలవరం ప్రాజెక్టును ఏరియల్ సర్వే చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

# వచ్చే మార్చికి 'పోలవరం' పూర్తి

>> పరిశ్రమలకు 23.44 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. జలవిద్యుత్ కేంద్రం ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు.

**నిర్వాసితులకు పూర్తి న్యాయం:** ప్రాజెక్టు కోసం 94,152 ఎకరాల భూమిని సేకరించామని, అక్టోబర్ 2026 నాటికి భూసేకరణ పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు 17,500 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించామని, 2027 మార్చి నాటికి మిగిలిన వారందరికీ పునరావాసం పూర్తి చేస్తామని చెప్పారు. 17,118 ఆర్అండ్ఆర్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ముందుగా అనకాపల్లికి, అనంతరం విశాఖకు గోదావరి జలాలను అందిస్తామని, తర్వాత గోదావరి-నాగావళి నదుల అనుసంధానాన్ని చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**జలధార-జలహారతికి రూ.3,300 కోట్లు:** జలధార-జలహారతి కార్యక్రమాన్ని రూ.3,300 కోట్లతో చేపడుతున్నామని, సర్దుబాటు పనుల కోసం ప్రతిజిల్లా కలెక్టర్‌కు రూ.2 కోట్లు అదనంగా కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని పేర్కొన్న ముఖ్యమంత్రి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టును ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేసి ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష ్యమని స్పష్టం చేశారు.

## గోదావరి 'సంగమం'

>> మారి, దాదాపు 13 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీటి భరోసా కల్పిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గడం, కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించడం రైతులకు ఊరటనిచ్చింది. గత బుధవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీటిని విడుదల చేయగా, ఆ జలాలు నాలుగు రోజుల ప్రయాణం అనంతరం శనివారం రాత్రి పవిత్ర సంగమానికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఇబ్రహింపట్టణం ఫెర్రీ సంగమం వద్ద గోదావరి ఎర్రటి జలాలు, కృష్ణా నదీ నల్లని రంగు జలాలు కలిసిన దృశ్యం చూసేందుకు సందర్శకులు తరలివస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే కృష్ణా డెల్టాకు సాగునీటి విడుదల ప్రారంభమైంది. ప్రస్తుతం పులిచింతల బ్యాలెన్సింగ్ జలాశయం నుంచి కూడా నీటిని విడుదల చేస్తున్నప్పటికీ, అక్కడ కేవలం 32 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇందులో 9 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉండటంతో మిగిలిన నీటినే సాగు అవసరాలకు వినియోగించాల్సి వస్తోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందుబాటులోకి రావడం డెల్టా రైతులకు ఎంతో ఊరటనిస్తోంది. వరుసగా 12 సంవత్సరాలుగా పట్టిసీమ ద్వారా సాగునీరు అందుతుండటంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## 'సుప్రీం'లో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు

**విజయవాడ.జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టు,అనుసంధాన బనచర్ల పథక ప్రాతిపదనపై తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో లోపాలున్నాయంటూ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వానికి తక్షణ నోటీసులు, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం తోసిపుచ్చింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, గోదావరి నీటి వినియోగం, పోలవరంబనకచర్ల అనుసంధానం వంటి అత్యంత కీలకమైన అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ వివాదాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల లింకేజీలపై నెలకొన్న వివాదాలు కొనసాగుతున్న సమయంలో ఈ విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని, అలాగే ఏపీ ప్రభుత్వానికి తక్షణమే నోటీసులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోర్టును అభ్యర్థించింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది.

# షాబాద్ హత్యల కిరాతకుడు ఆత్మహత్య

## గడ్డిమందు తాగి మరణించినట్లు పోలీసులు వెల్లడి

**షాద్‌నగర్/షాబాద్ జులై 13, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన రంగారెడ్డి జిల్లా షాబాద్ "ఆరు హత్యల" కేసు నిందితుడు రాజ్ కుమార్ ఎట్టకేలకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పెంజెర్ల గ్రామంలో రాజ్ కుమార్ మృతదేహం పోలీసులకు లభ్యమైంది. రాజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమందించారు. స్థానికులు రాజ్ కుమార్ మృతదేహం దగ్గర క్రిమిసంహారక మందు (పాయిజన్) బాటిల్‌ను గుర్తించారు. రాజ్ కుమార్ మేనమామ ఊరిలో రాజ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షాబాద్‌లో రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురుని నరహంతకుడు రాజ్‌కుమార్ వరుసగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా.. ఈ మారణహోమాన్ని సృష్టించిన రాజ్ కుమార్ ఆచూకీ కోసం పోలీసులు 14 బృందాలుగా విడిపోయి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు నిందితుడిని పట్టిస్తే రెండు లక్షల రూపాయల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. పోక్సో కేసులో బెయిల్ పొంది యథేచ్ఛగా తిరుగుతున్న రాజ్‌కుమార్ పగబట్టి చేసిన ఈ ఘాతుకం కలకలం రేపింది. రెండు గంటల్లో ఏకంగా ఆరుగురిని హతమార్చడం రాజధాని శివారులోని షాబాద్‌ను కుదిపేసింది. కేసు పెట్టిన బాధిత బాలిక కుటుంబాన్ని, ప్రశ్నించిన తన కుటుంబాన్ని సైతం ఆ ఉన్మాది గొంతులు కోసి హతమార్చడం రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసింది.



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

**స్థానికుల సమాచారంతో..** పెంజర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కొత్తూరు పోలీసులకు 100 డయల్ ద్వారా సమాచారం స్థానికులు అందజేశారు. దీంతో పోలీసుల రంగ ప్రవేశం చేశారు. గ్రామంలో సిల్వర్ చైన్ రియల్ వెంచర్ పక్కన కల్వకోలు పెంటయ్య రాజులకు సంబంధించిన భూమిలో ఓ గోడ పక్కన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు రాత్ కుమార్ పాల్పడినట్లు పోలీసులు కనుగొన్నారు. అతని వద్ద ఓ సెల్ఫోన్ గడ్డి మందు బాటిల్ ను కనుగొన్నట్లు ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం హుటాహుటిన చేరుకోవడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సెల్ఫోన్లో షాబాద్ హత్యలకు ముందు రోజు వీడియోను చిత్రీకరించాడు. ఆ యొక్క దృశ్యాలను అతను మాట్లాడిన వైనాన్ని స్థానిక మీడియా ముందు పోలీసులు ప్రదర్శించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు జరిపిన అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు మీడియాకు తెలిపారు.

**మృతుడు రాజ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు:** ఆ కుటుంబం తనను మోసం చేసిందని వారి కోసం ఎంతో డబ్బు ఖర్చు చేశానని అయినా తనపై పోక్సో కేసు పెట్టారని ఆ వీడియోలో మృతుడు రాజ్ కుమార్ చెప్పడం గమనార్హం. ఆ అమ్మాయిని నమ్మి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసినట్లు వీడియోలో పేర్కొన్నారు. అమ్మాయి కుటుంబానికి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసి అప్పుల పాలయ్యానని చెప్పారు. అమ్మాయి కుటుంబం తనను తీవ్రంగా మోసం చేసిందని, తన బిడ్డలకు కూడా భూమి లేకుండా మొత్తం అమ్మేశానని జీవితంపై విరక్తి పుట్టి వారిని చంపాలనుకున్నా అంటూ రాజ్ కుమార్ తన వాంగ్మూలాన్ని వీడియోలో రికార్డ్ చేశాడు. తనపై ఫోక్సో కేసు పెట్టడంతో విరక్తి చెంది ఆ అమ్మాయి కుటుంబాన్ని చంపినట్లు ఆ వీడియోలోని సారాంశం.

**రాజ్ కుమార్ ఆత్మహత్యతో సంచలనం:** షాబాద్ ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కుమార్ నియోజకవర్గం లోని కొత్తూరు మండలంలో ఆత్మహత్యకు పాల్పడడంతో ఈ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రాజ్ కుమార్ ఈ ప్రాంతంలో నిన్ననే కనిపించినట్టు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పగా ఎవరు నమ్మలేదు. అయితే మృతుడి అమ్మమ్మ స్వగ్రామం మండలంలోని పెంజర్ల గ్రామం కావడంతో అతను ఈ ప్రాంతంలోనే గత రెండు మూడు రోజులుగా తల దాచుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం రాజ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగు చూడడంతో సంచలనం రేకెత్తించింది. పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తో పాటు డిసిపి శిరీష రాఘవేంద్ర, ఏసిపి లక్షీ ్మనారాయణ, జిల్లాకు చెందిన మరికొంతమంది పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతానికి హుటాహుటిన చేరుకున్నారు. పెంజర్ల గ్రామంలో మృతుడు రాజ్ కుమార్ మేనమామలు మాజీ ఉపసర్పంచ్ లుంగారి లక్ష ్మయ్య, గోపాల్, జగన్ లు ఉన్నారు. అయితే ఈ సంఘటన నేపథ్యంలో అతను తన మేనమామల కోసం ఈ గ్రామానికి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో పోక్సో కేసు అయినప్పుడు అతను ఇక్కడే తలదాచుకున్నట్లు కూడా తెలుస్తుంది. రాజ్ కుమార్ మృతదేహం గ్రామాల్లో లభ్యం కావడంతో గ్రామస్తులు కూడా భయాందోళనకు గురయ్యారు.



సోమవారం ముంబయిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శిస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

## డి.సిఎం పవన్‌ను పరామర్శించిన మహారాష్ట్ర సిఎం

**విజయవాడ,జులై13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం ముంబైలోని ప్రముఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆస్పత్రికి వెళ్లి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడ్నవీస్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు ఆత్మీయంగా పలు కీలక విషయాలపై మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. పవన్ కళ్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో అభిమానులు, జనసేన కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు చేస్తున్నారు.



సోమవారం పలాసలో దానయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

# పోలీసులకు లొంగుబాటు

>> పలాసలో దానయ్య కుటుంబాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టీడీపీతరఫున రూ.10లక్షల ఆర్థిక సాయం మంత్రి ప్రకటించారు. బాధితకుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దానయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలాసలో విషాద ఘటనపై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# మరో 175 మెడికల్ సీట్లు

>> పలుమార్లు సంప్రదించి రాష్ట్ర ప్రతిపాదనలకు ఆమోదం వచ్చేలా మంత్రి సమన్వయం చేశారు. అధికారులు గుర్తించిన లోపాలను వెంటనే సరిచేసేలా ప్రత్యేక దృష్టి సారించడంతో వరుసగా ఫలితాలు వస్తున్నాయి. అత్యంత కీలకమైన పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాల విషయంలో సాంకేతిక అంశాలు అడ్డంకిగా మారిన సమయంలో మంత్రి స్వయంగా వ్యవహారాన్ని పర్యవేక్షించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, పరికరాల కల్పనను వేగవంతం చేయడంతో ఎన్ఎంసి 100 ఎంబీబీఎస్ సీట్లతో అనుమతి మంజూరు చేసింది. దీంతో ఈ విద్యా సంవత్సరంలోనే అక్కడ తొలిబ్యాచ్ విద్యార్థులు అడుగుపెట్టనున్నారు. అదనపు ప్రవేశాలతో రాష్ట్రానికి అవసరమైన వైద్యులు అందుబాటులోకొస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2026-27లో సీట్ల పెంపును గమనిస్తే నెల్లూరు25 ,పాడేరు50, కడప 75 విజయవాడ75, పిడుగురాళ్ల 100 మొత్తం325పెరిగాయి. కూటమి ప్రభుత్వ హయాంలో 1055 అదనపు ఎంబిబియస్ సీట్లు. 2024-25 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 505, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 550 అదనపు ఎంబిబియస్ ప్రవేశాలకు అనుమతులు లభించాయి. ఎన్ఎంసి నియమాల మేరకు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అదనంగా 50 శాతం సీట్లు గవర్నమెంట్ కోటాలో (కన్వీనర్ కోటా) 275 సీట్లు విద్యార్థులకు దక్కుతాయి. మొత్తమ్మీద...2024 25 నుండి కూటమి ప్రభుత్వ హయాంలో 1055అదనపు ఎంబిబియస్ సీట్లకు అనుమతులొచ్చాయి. ఈ అదనపు సీట్లతో రాష్ట్రంలో మొత్తం ఎంబిబియస్ సీట్ల లభ్యత 7090కి పెరిగింది. ఇందులో 15 శాతం సీట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో లభించాయి.

# నేడు అప్పగింత

>>న్నారు. వియత్నాం బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు పర్యాటకులు మృతి చెందిన సంగతి తెలిసిందే. మచిలీపట్నం సర్కిల్‌పేటకు చెందిన గెల్లి జయశ్రీ, కడపకు చెందిన శ్రీధర్,సత్యసాయిజిల్లా హిందూపురం నల్లపేటకు చెందిన రవితేజ మృతి చెందారు.

## ఓటర్ల జాబితా సవరణ

>> చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఇది మొత్తం ఓటర్లలో 3.41 శాతంగా ఉంది. అలాగే, ఉపాధి, ఇతర కారణాల వల్ల శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన (షిఫ్ట్ అయిన)ఓటర్లు కూడా భారీగానే ఉన్నారు. ఇలాంటి వారు 12,14,994 లక్షలు ఉన్నట్లు సర్వేలో తేలింది.బీఎల్‌ఓలు ఓటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లినప్పటికీ కొందరు అందుబాటులో లేరు. ఇలా సుమారు 7,26,425 లక్షల (1.75 శాతం) ఓటర్లు దొరకలేదని అధికారులు పేర్కొన్నారు. చనిపోయిన ఓటర్లను పక్కన పెడితే, ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఇంకా 9 శాతానికి పైగా పూర్తి కావాల్సి ఉందని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గడువు ముగుస్తుండటంతో వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. గడువును పెంచాలని కోరుతూ సీఈవోకు వినతిపత్రాలు సమర్పించాయి. దీనికి తోడు కొన్ని పట్టణ (అర్బన్) ప్రాంతాల్లో సర్వే నెమ్మదిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వివిధ జిల్లాల కలెక్టర్లు సైతం గడువు పొడిగింపునకు సూచనలు చేశారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేకంగా లేఖ రాశారు. గడువు పెంచాలని ఆ లేఖలో ఆయన ఈసీని కోరారు.

## వారం - వర్జ్యం

14-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
● అమావాస్య మ.3.16
పునర్వసు రా.12.11
వర్జ్యం : మ.1.31-మ.2.57
దు.ఉ.8.18-ఉ.9.10
2) రా.11.57-రా.12.49
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదేపై చేయిగా వుంటుంది.

**వృషభం:** ఇంటా బయట సమస్యలు ఎదురై అధిగమిస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** ఎవ్వరినీ నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**కర్కాటకం:** హితులు, శ్రేయోభిలాషులు, పెద్దలను కలుసుకొని చర్చలు సాగిస్తారు. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**సింహం:** ఆరాధనలు, యాత్రలు సంభవము. విధినిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు. స్థిరాస్తుల కొనుగోలును వాయిదా వేయడం మంచిది.

**తుల :** విదేశీ వస్తువుల ఆకర్షణ నుండి బయట పడుటకు జాగ్రత్త వహించండి. ఆర్థికంగా మెరుగు పడతారు.

**వృశ్చికం:** స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు పాటించండి. ఒక్కసారిగా అనేక అవకాశాలు మీ ముందుకు వస్తాయి.

**ధనుస్సు:** పెట్టుబడుల విషయంలో మెలకువతో వ్యవహరించండి. ఇంటర్వ్యూలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది. వస్త్రలాభం.

**కుంభం:** ప్రజలతో సంబంధాలు మెరుగు పరుచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. స్వల్ప ధనలాభం కలదు.

**మీనం :** హోమియోపతి వైద్యం పట్ల మక్కువ చూపుతారు. రుచికరమైన ఆహారాన్ని స్వీకరించాలని మనస్సు కోరుకుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

14-7Pg3exHMNWJQEKTCPBGOL_14-7Pg3exHMNWJQEKTCPBGOL.qxd 14/Jul/26 12:06 AM Page 1






# ఎఐ కెమెరాలతో నేరగాళ్లకు చెక్

## చోరుల పాలిటి సింహస్వప్నంగా ఆర్‌టిజిఎస్ సిసిటివి360

- వాహనాల రికవరీనే కాదు క్లిష్టమైన కేసుల్లోనూ
- గుంటూరులో ఒకే ఒక అలెర్టుతో 7 వాహనాల స్వాధీనం
- ఎన్టీఆర్ జిల్లాలో మరికొన్ని వాహనాల గుట్టు విప్పిన సిసిటివిలు
- నాలుగు నెలల్లో 81 వాహనాల రికవరీకి సహకారం
- మిస్సింగ్ కేసుల దర్యాప్తుల్లోనూ ఏఐ ఆధారిత వ్యవస్థ దోహదం

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** వాహన చోరుల పాలిట సింహస్వప్నంగా ఆర్‌టిజిఎస్ సిసిటివి360 మారింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణలు, బహుళ ప్రయోజనాల ఆశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సిసి కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటిని సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం వ్యాప్తంగా ప్రస్తుతం 14,750 సిసి కెమెరాలున్నాయి. వీటిని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారితంగా పనిచేసేలా ఆర్‌టిజిఎస్ సిసిటివి360 అనే వ్యవస్థను రూపొందించారు. ఈ వ్యవస్థ ఇప్పుడు పోలీసులకు కేసుల దర్యాప్తులో అత్యంత సహాయకారిగా, కీలక సాధనంగా మారుతోంది. పలు కేసులు ఛేదించడంలో పోలీసులకు కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తోంది.

**వాహనాల దొంగల ఆటకట్టు:** వాహనాలను చోరీ చేసే దొంగల పాలిట ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ ఇప్పుడు సింహస్వప్నంలా మారుతోంది. రాష్ట్రంలో దొంగలు ఎక్కడ వాహనాలు చోరీలకు పాల్పడినా, ఆ వాహన వివరాల ఆధారంగా చోరీకి గురైన వాహనాలను సిసికెమెరాల ద్వారా ఆర్‌టిజిఎస్ గాలించి, ఆ వాహనాల ఆచూకీ గురించి పోలీసులకు రియల్ టైమ్‌లో సమాచారం చేరవేస్తోంది. దీంతో ఈ కేసులను పరిష్కరించడం పోలీసులకు చాలా సులభంగా మారుతోంది.

**4 నెలల్లో 80 వాహనాల స్వాధీనం:** నాలుగు నెలల్లో 81 వాహనాలు రికవరీకి సహకారించింది. మిస్సింగ్ కేసుల దర్యాప్తుల్లోనూ దోహదపడుతున్న ఏఐ ఆధారిత వ్యవస్థ గురించి పోలీసుశాఖ సమాచార పత్రాన్ని విడుదల చేసింది. ఈ సమాచారాన్ని అనుసరించి ఈ నెల ఒకటో తేదీ బాపట్ల జిల్లా చీరాల. చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం సాగించే తల్లి. తన ఆరునెలల చంటిబిడ్డను పొత్తిళ్లలు పెట్టుకుని ఫుట్‌పాత్ మీద ఓ దుకాణం ముందు నిద్రిస్తోంది. తెల్లవారుజామున ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో ఓ ఆగంతుకుడు ఆమె చంటిబిడ్డను ఎత్తుకెళ్లాడు. ఆమె కన్నీరు మున్నీరైంది. బాపట్ల పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. బిడ్డను ఎత్తుకెళ్లిన నిందితుడ్ని పట్టుకోవడానికి ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం కోరారు. బిడ్డను ఎత్తుకెళ్లిన వ్యక్తి కదలికలను ఏఐ ఆధారిత కెమెరాల ద్వారా జల్లెడపట్టి 24 గంటల్లోపే నిందితుడ్ని పట్టుకునేలా ఆర్‌టిజిఎస్ రియల్ టైమ్ అలెర్టులను పోలీసులకు పంపింది. అపహరణకు గురైన బాబును పోలీసులు తీసుకొచ్చి మళ్లీ ఆ తల్లి ఒడికి చేర్చారు. బిడ్డకోసం తల్లడిల్లిన ఆ తల్లి మళ్లీ పొత్తిళ్లలో తన బిడ్డను చూసి మురిసిపోయింది. ఆనందాశ్రువులు కార్చుతూ పోలీసులకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపింది. గుంటూరు నగరం పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో జులైలో ఒక హోండా యాక్టివా స్కూటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఎంత అన్వేషించినా దొరకలేదు. చివరకు పోలీసులు ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం కోరారు. పోలీసులు అందించిన ఆ వాహనం వివరాల ఆధారంగా మ్యాట్రిక్ సిసి కెమెరాల ద్వారా వాహన కదలికలను అన్వేషించారు. జూన్ 17వ తేదీన ఆ స్కూటర్ గుంటూరులోని ఓ ప్రధాన కూడలి వద్ద తిరుగుతుండగా పోలీసులకు రిలయ్ టైమ్ అలర్టులు పంపారు. వెంటనే పోలీసులు నిందితుడ్ని పట్టుకుని విచారించగా, ఆ స్కూటర్‌తో పాటు మొత్తం ఏడు వాహనాలను చోరీ చేసినట్టు చెప్పడంతో ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సురక్షిత ఏపీ సాధన దిశగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ పనితీరుకు పైరెండు సంఘటనలు ఒక చిన్న ఉదాహరణలు మాత్రమే అని పోలీసుశాఖ పేర్కొంది. ఆర్‌టిజిఎస్ సిసిటివి360 అందించిన ఏఐ ఆధారిత సాంకేతిక సహకారం ద్వారా గత నాలుగు నెలల కాలంలో పోలీసులు 80కి పైగా చోరీకి గురైన వాహనాలను కనుగొని స్వాధీనం చేసుకోగలిగారు. అదృశ్యమైన 73 మంది ఆచూకీని ఈ వ్యవస్థ కనిపెట్టగలిగింది. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 52 మంది నేరస్థుల ఆచూకీ కూడా కనుగొని వారిని పోలీసులు పట్టుకోవడానికి దోహదపడింది.

**ఎన్నో ఉదాహరణలు:** విజయవాడ టు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో తన వాహనం చోరీకి గురైందని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఆ వాహనం ఆచూకీ కోసం ఆర్‌టిజిఎస్ సిసిటివి360 సహకారాన్ని పోలీసులు కోరారు. దీంతో సిసికెమెరాల ద్వారా ఆ వాహన కదలికలపై పోలీసులకు ఆర్‌టిజిఎస్ ఎప్పటికప్పుడు అలర్టులు పంపడంతో ఆ వాహనాన్ని పట్టుకోగలిగారు. కుటుంబ తగాదాల కారణంగా ఆమె భర్తే ఆ వాహనాన్ని అపహరించినట్లు విచారణలో తేలింది. నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మోటారు సైకిలును చిల్లకల్లువద్ద పట్టుకోగలిగారు. ఏ.ఎస్.నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోనూ ఇలాగే చోరీ గురైన వాహనాన్ని ఈ సాంకేతిక సహకారంతో పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు. విస్సన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వాహన చోరీ కేసు సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంది. ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ ద్వారా పోలీసులు ఈ కేసును ఇటీవలే ఇట్టే పరిష్కరించగలిగారు. ఈ పరిధిలోనే చోరీకి గురైన మరో వాహనాన్ని కూడా పోలీసులు ఇట్టే పట్టుకోగలిగారు. మదనపల్లె టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గత ఏప్రిల్ 27న నమోదైన ద్విచక్ర వాహన చోరీ కేసును కూడా అక్కడి పోలీసులు ఆర్‌టిజిఎస్ సిసిటివి360 సాంకేతిక సహకారంతో ఛేదించగలిగారు. మనుషుల అదృశ్యం కేసుల్లోనూ ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. మైలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మహిళ అదృశ్యం కేసు నమోదైంది. ఎంత గాలించినా ఆమె ఆచూకీ తెలీక చాలా కాలంగా ఆ కేసు పెండింగ్‌లో ఉంది. దీంతో పోలీసులు ఈ కేసు పరిష్కారం కోసం ఆర్‌టిజిఎస్ సిసిటివి360 వ్యవస్థ సహకారం కోరారు. ఫేషియల్ రికగ్నిషన్ విశ్లేషణ ద్వారా ఆ మహిళ ఆచూకీని కనుగొని పోలీసులకు అలర్టులు పంపారు. దీంతో పోలీసులు ఆమెను పట్టుకుని ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చి ఈ కేసు పరిష్కరించగలిగారు. అదే రోజు ఎన్.ఆర్.పేటలో ఒక బాలిక అదృశ్యమైందనే కేసు నమోదైంది. అదృశ్యమైన బాలిక ఆ చూకీని అదే రోజు కొన్ని గంటల్లో కనుగొని ఆమెను ఆ కుటుంబ సభ్యులకు అప్పగించడంలో ఈ వ్యవస్థ సహకారం అందించింది. రెడ్డిగూడెంలో కూడా ఇటీవలే అదృశ్యమైన ఓ వ్యక్తి ఆచూకీని ఇలాగే కనుగొనగలిగారు. అదృశ్యమైన వ్యక్తి వాహన కదలికలను కెమెరాల ద్వారా పసిగట్టి ఆయన్ను కనుగొనేలా ఈ వ్యవస్థ దోహదపడింది.



## అందరికీ సంస్కృతం.. అకాడమీ లక్ష్యం

### తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్‌చంద్ర

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** పండితులు మాత్రమే సంస్కృతం అధ్యయనం చేయగలరన్న అపోహను దూరం చెయ్యాలి అన్న లక్ష్యంతో సంస్కృత అకాడమీ పనిచేస్తుంది, అందుకు తగ్గ మార్గనిర్దేశం చేయాల్సిందిగా పద్మేశ్వరంలోని తెలుగు, సంస్కృత అకాడమీలో సోమవారం నిర్వహించిన సంస్కృత మేధావుల సదస్సును ఉద్దేశించి చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర అన్నారు. దేశం భిన్నకులాలు, మతాలుగా విడిపోయిన ఈ సందర్భంలో దేశం మొత్తాన్ని కలిపి ఉంచగలిగే శక్తి సంస్కృత భాషకు ఉందని విల్సన్ అన్నారు. 'అమృతం మధురమైంది. సంస్కృతం అంతకంటే మధురమైంది' అంటూ సంస్కృత వాక్యాన్ని ఉదహరిస్తూ 'అమృతం మధురం సమ్యక్ సంస్కృతం హితదాయకం' అన్నారు. ఈ విశ్వం సంస్కృత భాషతో సామ్యస్థ తమై వుంది అనేది వైదిక వాక్కు అని గుర్తు చేశారు. ప్రాచీనకాలంలో దేశంలో సంస్కృత భాష కేవలం స్వప్నంగా ఉండడమే కాదు అది మన జ్ఞానానికి తల్లిగా ఉంది. కాని ఈ ఆధునికాలంలో ఈ భాష కేవలం ధార్మిక విషయాలకే పరిమితమైనదనే అభిప్రాయం జనాల్లో వుంది అని శరత్ చంద్ర గుర్తుచేశారు. ఈ సందర్భంగా సంస్కృత పండితులు పలు సూచనలు చేశారు. అకాడమీ నేతృత్వంలో సంస్కృత సప్తాహ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సంస్కృత భాష వ్యాప్తి కోసం చిన్న చిన్న పుస్తకాలు వేసి విద్యార్థుల్లోకి తీసుకెళ్ళాలని కోరారు. అందులో నీతి కథలు, జాతీయ భావనలతో కూడినవి ఉండాలి అన్నారు. 'సంస్కృతం.. తెలుగు భాషలు తల్లి.. బిడ్డలు లాంటివి అని ఆచార్య దీక్షితులు అన్నారు. సంస్కృత అకాడమీ యూ ట్యూబ్ ఛానల్ ద్వారా భాష అభివృద్ధికి దోహదం చెయ్యాలి అన్నారు. ఆచార్య దోర్బల ప్రభాకర్ శర్మ మా ట్లాడుతూ ప్రపంచంలో మొదట పుట్టిన భాష సంస్కృతమే అన్నారు. హెబ్రూ భాష కంటే ప్రాచీనమైనదన్నారు. ఆచార్య రమణ శాస్త్రీ మాట్లాడుతూ రాష్ట్రములో ఉపాధ్యాయులకు అన్ డ్యూటీ సౌకర్యం కలిపిస్తే సంస్కృతంలో ఒరియంటేషన్ క్లాసులు నిర్వహిస్తాం అన్నారు. సమావేశంలో ఆచార్యులు పిటిజివి రంగా చార్యులు, డాక్టర్. పాలపర్తి శ్యామలా నంద, డాక్టర్ దివి నరసింహ దీక్షితులు, డాక్టర్ వందన రావు, డాక్టర్ రమణ మూర్తి, ఆచార్య మారుదూరి నరసింహాచార్యులు, పిన్నమనేని భవాని, తిరుపతి సంస్కృత యూనివర్సిటీ ఆచార్యులు నందన్ రావు, డాక్టర్ కనపాల కుమార్, విజి చంద్రన్‌లతో పాటు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరి, డాక్టర్ ఎస్.వి టి.రాజ్యలక్ష్మి, డాక్టర్ గ్లోరీ

## 'ఆయన బాధను బయటకు వ్యక్తం చేయరు'



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కల్యాణ్‌కు ఇటీవల కుడి భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ క్రమంలో ఆయన సతీమణి అన్నా పవన్ కల్యాణ్ కొణిదెల 'ఎక్స్' వేదికగా తన మనస్సులో మాటను పంచుకున్నారు. 'పవన్ తన జీవితంలో శారీరక నొప్పి కంటే తీవ్రమైన ఎన్నో భారాలను మోశారు. ఎంతటి కష్టమైనా ఫిర్యాదు చేయని ఆయన, నొప్పి భరించలేని స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే తన బాధను బయటపెడతారు' అని ఆమె భావోద్వేగంగా తెలిపారు. ముంబైలోని ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పరామర్శించిన ఫొటోను అన్నా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం తన దృష్టంతా పవన్ ఆరోగ్యంపైనే ఉందని తెలిపారు. 'ఇప్పుడు నా పని ఒక్కటే.. ఆయన్ను జాగ్రత్తగా చూసుకోవడం. ఆయన సురక్షితంగా ఉన్నారనే నమ్మకం కల్పించడం. ఒక్కో రోజు ముందుకు సాగుతూ ఆయన పూర్తిగా కోలుకుంటారు' అని ఆమె భావోద్వేగంగా రాశారు. జులై 11న పవన్ కల్యాణ్‌కు ముంబైలోని ఆసుపత్రిలో కుడి భుజానికి ఆర్థ్రోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించారు. రోటేటర్ కఫ్‌లోని సుప్రాస్పినేటస్, ఇన్‌ఫ్రాస్పినేటస్ టెండన్లకు తీవ్ర గాయం కావడంతో పాటు భుజం ఎముకలో ఫ్రాక్చర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్దీవాలా నేతృత్వంలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైందని ఆసుపత్రి ప్రకటించింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యంగా కోలుకుంటు న్నారని, కొంత విశ్రాంతి అనంతరం ప్రత్యేక రిహాబిలిటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వైద్యులు తెలిపారు. సుమారు నాలుగు నెలల్లో భుజం పూర్తిస్థాయిలో కోలుకునే అవకాశం ఉందని ఆరోగ్య బులెటిన్‌లో పేర్కొన్నారు.

## సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

### పాత పెన్షన్ విధానం ఎంచుకునేందుకు మరో చాన్స్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సిపిఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పాత పెన్షన్ విధా నాన్ని (ఓపిఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జిఒ ఎంఎస్ నెం.53ను విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధిం చిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యో గులు సిపిఎస్ నుంచి ఓపిఎస్‌కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, జిఒ జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్‌ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఒకసారి ఓపిఎస్ లేదా సిపిఎస్‌కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువులోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా సిపిఎస్ పరిధిలోనే కొనసాగుతారని జిఒలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జిఒ ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

## భార్యను వేధించిన కేసులో భర్తకు యేడాది జైలు

**చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం భరత్‌నగర్‌కు చెందిన వై.సిమోన్ సుదర్శన్(32)కు చిత్తూరు 3వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. చిత్తూరు భరత్‌నగర్‌లో మౌనిక ప్రియదర్శిని తన భర్త వై.సిమోన్ సుదర్శన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు తనను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు బెదిరిస్తున్నారని 28 నవంబర్ 2020న చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి మహిళా స్టేషన్ ఎస్ఐ నిత్యానందం పిళ్ళై ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. ఈ కేసు పూర్వపరాలను విచారించిన జడ్జి సోమవారం తీర్పు వెలువరించారు. సుదర్శన్‌పై నేరం రుజువైందని, ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా చెల్లించాలని ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు తీర్పు వెలువరించింది. ఎ2 నుండి ఎ8 వరకు వున్న నిందితులను కోర్టు నిర్ధోషులుగా ప్రకటించింది.

## 'సర్' గడువును 3నెలలు పొడిగించాలి

- అర్హులందరిని ఓటర్లుగా నమోదు చేసే వరకు వదిలిపెట్టేది లేదు
- రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వివేక్ యాదవ్‌కు సిపిఐ వినతి

**సచివాలయం, జులై 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం కొనగుతున్న 'సర్' ప్రక్రియ గడువును తక్షణమే మరో మూడు నెలల పాటు పొడిగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించే బాధ్యతను ఎన్నికల కమీషన్ తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వివేక్ యాదవ్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జగదీష్ కలసి క్షేత్రస్థాయిలో అక్రమాలు, ఇబ్బందులపై సుదీర్ఘంగా వివరించి. సవివరమైన వినతి పత్రాన్ని సమర్పించారు.



ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కు విషయంలో కమీషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించకూ డదని, తక్షణమే స్పందించిన నిర్థష్టమైన కాల వ్యవధితో గడువును పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి

- 'సర్' ప్రక్రియ మరింత వేగవంతం
- కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్



'సర్' ప్రక్రియను పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్

**చిత్తూరు, జులై 13 ప్రభాతవార్త:** నిర్ధేశించిన గడువులోపు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సోమవారం చిత్తూరు నగర పరిధిలోని దొడ్డిపల్లి పోలింగ్ స్టేషన్ 14, గాయత్రినగర్ పోలింగ్ స్టేషన్ 132ల్లో 'సర్' ప్రక్రియ ఎలా సాగుతుం దనే విషయంపై బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఇంటింటా సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంను ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘ కార్యదర్శి జిల్లాలో 'సర్' ప్రక్రియ ఎలా జరుగుతున్నది! ఎంత మేరకు పూర్తయ్యింది! పెండింగ్‌లో వున్న దరఖాస్తుల స్థితి! ఎమైనా ఫిర్యాదులు వున్నాయా! తదితర అంశాలపై పరిశీలిస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 97 శాతం ఎస్ఎస్ఆర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం సుమారు 40వేల దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని, వీటిలో కొన్నింటిని సత్వరం పరిష్కరించ గలుగుతామని, మరికొన్నింటిని అవసరమైన ధృవీకరణ అనంతరం నిర్ణయం తీసకుంటామన్నారు. జిల్లాలో ఎవరికైనా 'సర్' దరఖాస్తులకు సంబంధిచి సమస్యలు, సందేహాలు వుంటే బిఎల్‌ఓలను సంప్రదించాలని, మొత్తం ప్రక్రియను పార దర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.
సర్ ప్రక్రియను పారదర్శకంగా, కచ్చిత త్వంగా నిర్వహి స్తున్నామని, 2002 జాబితాలో ఓటు లేకపోయినా, ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డుల్లో ఎదో ఒకటి ఎన్యు మరేషన్ ఫారంతో పాటు బిఎల్‌ఓలకు అందించా లన్నారు. ఈ నెల 21న ముసాయిదా జాబితా ప్రకటిస్తా మని, అందులో పేర్లు లేకపోయినా ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గుర్తింపు కార్డుల్లో ఎదో ఒకటి బిఎల్‌ఓలకు అందజేస్తే తుది ఓటరు జాబితాలో పేరును చేర్చడం జరుగుతుందన్నారు. 'సర్'లో అర్హుల ఓట్లను తొలగించే ప్రసక్తే లేదన్నారు.
ఈ కార్యక్రమంలో అర్డీఓ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఐరాల, చిత్తూరు నగర తహసిల్దారు, బిఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ సాయికృష్ణ మృతి కేసులో అప్రూవర్‌గా సిఐ స్నేహితుడు సురేష్



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీషీటర్ సాయికృష్ణ మృతి కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసులో ప్రైవేటు వ్యక్తి అయిన సురేష్ పాత్రే ప్రధానంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోర్టుకు సమర్పించిన మెమోలో సైతం సిట్ అధికారులు సురేష్‌ను నిందితుడిగా చేర్చారు. అతన్ని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటివరకు అతడిని అధికారికంగా అరెస్టు చేసినట్లు చూపించలేదు. ఇప్పటికే పలు పర్యాయాలు సురేష్‌ను కృష్ణలంకకు పోలీసులు పిలిపించి విచారించారు. సోమవారం కూడా పోలీసులు అతడిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సిట్ అధికారుల విచారణలో సురేష్ అనేక కీలక విషయాలు వెల్లడించినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సురేష్ ఈ కేసులో అప్రూవర్‌గా మారే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాల సమాచారం. సురేష్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సిట్ అధికారులు కృష్ణలంక పిఎస్ సిబ్బందిని విచారిస్తున్నారు. అయితే, తాము విచారించినప్పుడు తమకేమీ తెలియదని కొందరు సిబ్బంది తప్పించుకునే ప్రయత్నం చేసారంటున్నారు. ఆ ఘటన జరిగిన సమయంలో తాము డ్యూటీలో లేమని, బయట ఉన్నామని మరికొందరు చెప్పారు. దీంతో అధికారులు సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. స్టేషన్ సిబ్బంది కాల్ డేటా రికార్డులను (సిడిఆర్) సేకరించి విశ్లేషిస్తున్నారు. అయితే ఈ కేసులో సాయికృష్ణపై థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదని, అయితే గట్టిగా లాఠీతో కొట్టిన సందర్భంలో అతను ఎదురు తిరిగి, ఒక బాలిక విషయంలో సిఐ నాగరాజు బూటు కాలితో అతని మర్మాంగాలపై తన్నారని, దాంతో అతను బిగ్గరగా కేకలు వేస్తుంటే అక్కడ వదిలివెళ్ళారని, తరువాత సాయికృష్ణ చనిపోయాడని కొందరు చెప్పినట్లు సమాచారం. అయితే సిట్ అధికారులు ఈ అంశాన్ని ధ్రువీకరించలేదు. అయితే పోలీసులు అదుపులో ఉన్న సురేష్ సిఐ నాగరాజుకు అత్యంత సన్నిహితుడు అని వారు స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రైవేటు వ్యక్తి అయినప్పటికీ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సురేష్ చెప్పిందే వేదంగా సాగేది. స్టేషన్‌లో అనధికారికంగా పెత్తనం అంతా అతడే చేసేవాడని విచారణలో తేలింది. ఈ సాన్నిహిత్యంతోనే సాయికృష్ణ వ్యవహారంలో సురేష్‌కు అంతా తెలుసని దర్యాప్తులో బయటపడింది. సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి అతడు మృతి చెందడం, ఆ తర్వాత శవాన్ని మాయం చేయడం వరకు ప్రతి అంశంలో సురేష్‌కు ప్రమేయం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## బుచ్చి పోలీస్‌స్టేషన్‌పై వేటు

- సిఐ మాతంగి శ్రీనివాసరావు రేంజి విఆర్‌కి
- ఎస్ఐ సతోష్‌రెడ్డి జిల్లాలో విఆర్‌కి
- 21 మంది కానిస్టేబుల్స్ పై బదలీ వేటు




**బుచ్చి (నెల్లూరు), జులై 13 ప్రభాతవార్త:** జిల్లా చరిత్రలో ఇంత వరకు ఎప్పుడు జరగని విధంగా ఒక పోలీస్‌స్టేషన్ మొత్తంపై వేటు పడిన సంఘటన బుచ్చి పోలీస్‌స్టేషన్‌కి జరిగింది. ఇటీవల వ్యవ సాయాధికారి శ్రీహరి మృతి హత్య కాగా దానిని తప్పుదోవ పట్టించినందుకు పర్యావసనం ఇది. జిల్లా ఎస్పి అజితా వేజండ్ల నిర్ణయాన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. సూపర్ ఎస్పి అంటు ప్రశంసిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీహరి మృతి చెందిన రోజు మినగల్లుకి వెళ్లిన ప్రతి ఒక్కరికి మృతదేహాన్ని చూస్తేనే అర్ధం అవుతుంది ఇది ముమ్మాటికి హత్యేనని కాని కుటుంబ సభ్యులు మౌనం అందర్ని కట్టి పడవేసింది. మౌనం వెనుక ఆంతర్యం అర్ధంకాక అందరి మనస్సులు బరువెక్కాయి. చేతికి గ్లౌజులు వేసుకుని శ్రీహరి బాడిమొత్తాని పరిశీలించిన సిఐకి అర్ధమైనా విచారణ చేపట్ట కుండా గుండెపోటు అంటు మౌనం వహించడంతో కేసు తప్పుదోవ పట్టింది. మృతుడు శ్రీహరి మొదటి భార్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇవ్వడంతో జిల్లా ఎస్పి అజెండ్ల శ్రీకేసుపై దృష్టిపెట్టారు. డిఎస్పి ఘంటా శ్రీనివాస రావుకి కేసును విచారించమని ఆదేశించడంతో అసలు కధ బయట పడింది. సొంత బావమరిదే మరో ఇద్దరితో కలిసి ఇంతటి ఘాతకానికి ఒడి కట్టాడని, ఇది ముమ్మాటికి హత్యేనని విచారణలో తేలడంతో జిల్లా ఎస్పి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐ మాతంగి శ్రీనివాసరావుని రేంజి విఆర్‌కి బదలీ చేశారు. అలాగే ఎస్ఐ సంతోష్‌రెడ్డిని జిల్లాలో విఆర్‌లో ఉంచారు. 21 మంది కానిస్టేబుల్స్‌ని బదలీ చేసి జిల్లా ఎస్పి సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీంతో పోలీస్ శాఖ ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

## కరాటే పోటీల్లో సత్యవేడు విజేతలు 8 మందికి 19 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్




**సత్యవేడు, జులై 13 ప్రభాతవార్త:** గోవా బోసోటర్ పంచాయతీ కమ్యూనిటీ హాలులో 2026 నేషనల్ యూత్ స్పోర్ట్స్ కాంపిటీషన్ ఆధ్వర్యంలో జూలై 11,12 తేదీల్లో జరిగిన కరాటే పోటీల్లో తిరుపతి జిల్లా సత్యవేడుకు చెందిన 8 మంది కరాటే వీరులు 19 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఆంధ్రప్రదేశ్ కరాటే మిషన్ సత్యవేడుకు చెందిన జి.భువనేశ్వర్, తెలంగాణ బాక్సింగ్ కోచ్ కిరణ్ పర్యవేక్షణలో జాతీయ యూత్ స్పోర్ట్స్ కాంపిటీషన్ నిర్వహించారు.కరాటే కాంపిటీషన్‌లో 320 ఈవెంట్లు జరగగా ఆంధ్రప్రదేశ్ 33 బంగారు పతకాలు, ఆరు వెండి పతకాలుసాధించి విజేతలుగా కరాటే వీరులు అదరగొట్టారు. ఈ నేపథ్యంలోనే సత్యవేడుకు చెందిన 8 మంది కరాటే విజేతలు కట్ట, కుమితే విభాగాల్లో పతకాలు సాధించారు. ఈ క్రమంలో అండర్-14 బాలికల విభాగంలో టీం కట్ట విభాగంలో విజేతలుగా లక్షిక, ప్రియ, నాజియా భాను గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అండర్-14 బాలుర టీమ్ కట్ట విభాగంలో విజేతలుగా ఆరిఫ్ బాబ, మోహిత్, రిత్విక్ యాదవ్ పొంకం గోల్డ్ మెడల్ సాధించారు. సీనియర్ కేటగిరి అండర్-17 ఇయర్స్ పవిత్ర వ్యక్తిగతంగా గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అలాగే అండర్-14 బాలుర విభాగం కట్టాలో ఆరిఫ్ బాబా గోల్డ్ మెడల్ మోహిత్ గోల్డ్ మెడల్, రిత్విక్ యాదవ్, సిల్వర్ మెడల్ సాధించగా వీరిని అందరూ అభినందించారు.

## ఎఇఇ నియామకాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు లేదు

### ఎపిట్రాన్స్‌కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పవర్ యుటిలిటీస్‌లో 629కు పైగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) పోస్టుల భర్తీకి సంబంధించి 2026 జూన్ 25న విడుదల చేసిన నియామక నోటిఫికేషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తున్నదని ఎపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పిస్తున్న నేపథ్యంలో, దరఖాస్తుల గడువు పొడిగింపుపై సామాజిక మాధ్యమాలు, ఇతర అనధికారిక వేదికల్లో ప్రచారం లో ఉన్న వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్వసించ వద్దని ఆయన అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. నియామక నోటిఫికేషన్ లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని, దరఖాస్తుల సమర్పణకు 2026 జులై 20 చివరి తేదీగా నిర్ణయించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ గడువులో ఎలాంటి మార్పు ఉండదని, దర ఖాస్తుల స్వీకరణకు అదనపు గడువు ఇవ్వబడదని స్పష్టం చేశారు. చివరి రోజుల్లో సాంకేతిక రద్దీ లేదా ఇతర కారణాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, ఇంకా దరఖాస్తు చేయని అర్హులైన అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించి, దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, నియామక ప్రక్రియ లో భాగంగా నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్ష కూడా నోటిఫికేషన్‌లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే 2026 ఆగస్టు 22 నుంచి ప్రారంభమవుతుందని, పరీక్ష తేదీల్లో కూడా ఎలాంటి మార్పు ఉండదని సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షల షెడ్యూల్‌పై ఎలాంటి సందేహాలకు తావులేకుండా తమ సన్నాహాలను ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కొనసాగించాలని సూచించారు. నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని అధికారిక సమాచారం సంబం ధిత వెబ్‌సైట్ ద్వారానే విడుదల చేయబడుతుందని, అందు వల్ల అభ్యర్థులు అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించా లని ఆయన కోరారు. సామాజిక మాధ్యమాలు లేదా ఇతర అనధికారిక వేదికల ద్వారా ప్రచారంలో ఉన్న తప్పుడు సమా చారం, వదంతులు లేదా నిర్ధారణలేని వార్తలను నమ్మి అయో మయానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ నియామక ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నోటిఫికేషన్‌లో పేర్కొన్న షెడ్యూల్‌కు అనుగుణంగా నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, సూచనలు, నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రవీణ్ చంద్ కోరారు.

14-7pg4_14-7pg4.qxd 13/Jul/26 11:51 PM Page 1



వార్త


ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

న- బెర్ట్రండ్ రస్సెల్

# కరిగిపోతున్న ఖరీఫ్!


తన వ్యవసాయ క్షేత్రంలో విత్తు నాటితే, అది మొలకెత్తి మొక్క ఉనికిని బాహ్య ప్రపంచానికి కనబడేటట్లు పెరుగుతున్న కొద్దీ రైతులో సంతోషం వెల్లివిరుస్తుంది. అది పెరిగే కొద్దీ దాని వైభవం చూస్తూ పొంగిపోతాడు. కానీ ఎల్‌నినో పుణ్యమా అని దేశవ్యాప్త రైతుల్లో అలాంటిదేమీ కనబడుట లేదు. వర్షం వస్తుందోరాదో తెలియని ఆందోళనతో రైతు దిగాలు పడిపోయాడు. ఇతరత్రా గాలివానలు, తుఫాను బీభత్సాలవల్ల కలిగే భయోత్పాతం ఒకలా ఉంటే ఇప్పుడు చూస్తున్న ఎల్‌నినో క్షణక్షణం రైతును కృంగదీస్తోంది. ఓ రెండు,మూడుమాసాల పాటుసూపర్ ఎల్‌నినో పేరిట మరెన్నో కష్టనష్టాలు తెచ్చిపెట్టేలాంటి సంకేతాలే ఉన్నాయి. వర్షాలు కురుస్తాయనుకున్న మృగశిర, ఆరుద్ర కార్తెల్లో తగిన వర్షం పడలేదు. ప్రస్తుతం పునర్వసు కార్తె కూడా శుభసంకేతాలను చూపడం లేదు. ఇదిగో వచ్చేసాయనుకున్న రుతుపవనాలు కూడా బలహీనపడటంతో వ్యవసాయదారుని నెత్తిమీద బండపడినట్లే ఉంది. వస్తాయనుకున్న వర్షాలు రాలేదని సాగు మానాలా,రేపెపుడో వర్షాలు కురుస్తాయిలే అని ధైర్యంతో ముందుకెళ్లాలా అన్న మీమాంసల మధ్య కొందరు రైతులు ఒకడుగు ముందుకే వేయాలనినిర్ణయించారు. కానీ నారు మొలవక కురిసే చినుకును ధ్యానిస్తూ రైతు ఆకాశం కేసి చూస్తున్నాడు. పశ్చిమ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడంతో ఎల్‌నినో ప్రభావం బాగాబలపడుతోంది.ప్రపంచ వాతావరణ సంస్థ తాజా హెచ్చరికల ప్రకారం ఈ జులై నెల నుంచి సెప్టెంబరుల మధ్య ఎల్‌నినో బలీయంగా ప్రభావం చూపిస్తుంది.ఈతరుణంలో వ్యవసాయం,తాగు నీటి వనరులు, ఆర్థిక వ్యవస్థ, ప్రజారోగ్యం, విద్యుత్ వినియోగం వంటి అన్ని రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ముందు ముందు పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు. ప్రస్తుతమైతే ఎల్‌నినో పరిస్థితులు బలపడుతున్నాయనే చెప్పాలి. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో వాతావరణం ఒకేసారివస్తే మంచిదేనని కొందరు శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. కానీ ఒకదానికొకటి ముడిపడని సందర్భాలు అందుకే రైతు దిక్కుతోచక సతమతమవుతున్నాడు. ఎల్‌నినో ఎప్పుడెంత స్థాయిలో ప్రభావం చూపినా నవంబర్ నెలదాక వ్యవసాయం వంటి అన్ని రంగాలపై ఎంతో కొంత ప్రభావం చూపుతుంది. ఏదైనా వ్యవసాయరంగానికి ఎల్‌నినో సవాలే. సాధారణంగా బలహీన వాతావరణ పరిస్థితులు చూడొచ్చు. ప్రధానంగా వరి, పత్తి, పప్పుధాన్యాలు, వర్షాధార పంటలుగా సాగు చేసే రైతులకు దినదినగండంలా ఉంటుంది. ఒకప్పుడు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుందనే అనుకునేవారం. కానీ ఇప్పుడు తీవ్ర ఉష్ణోగ్రతలు, కార్చిచ్చులు,నీటి కొరత ఆరోగ్య సమస్యలు, ఆహార కొరత, వీటన్నిటి కారణంగా విద్యుత్ డిమాండ్ పెరుగుదల వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది.వర్షపాతం ఏమాత్రం తగ్గినా పండే పంటలపై ప్రభావం చూపుతోందన్న గాభరాతో ప్రభుత్వం రైతులకు అనేక అంశాలలో జాగ్రత్తలు పాటించమని చెబుతూనే ఉంది. భారత్‌లో వ్యవసాయధారిత దేశం కనుక రుతుపవనాలపై సాగు ఆధారపడి ఉంటుంది. జలాశయాల్లో నీటి నిల్వలుతగ్గితే సాగునీటి ప్రాజెక్టులపై ఒత్తిడి పెరుగుతుంది.ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. ధరలు పెరగడం,ద్రవ్యోల్బణం అధికమవడం వంటి తీవ్ర పరిణామాలు కలుగుతాయి. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించుకోవడమొక్కటే మనకుశరణ్యం. జాగ్రత్తలు పాటించి ముందుచూపుతో వ్యవహరించాలి. అప్పుడే సంక్షోభాన్ని ఎదుర్కొని నిలబడగలం. తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి చాలారోజులైంది. ఎందరో రైతులు విత్తులు నాటినా మొలకల్లేక నిరాశతో ఎదురుచూస్తున్నాడు. సాగు పనులు లేక వ్యవసాయ కూలీల జీవనోపాధికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. భూగర్భజలాలు అడుగంటి వివిధ పంటలనాట్లు కోసం సిద్ధం చేస్తున్న విత్తనాలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంతో ఎన్నో జిల్లాలలో వ్యవసాయ రంగం కుదేలైపోయింది. గ్రామీణ వ్యవస్థ బాగా దెబ్బతింది. ఈ విషయాలపై భారత్ వాతావరణ సంస్థ 'సెంట్రల్ వాటర్ కమిషన్ తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సొసైటీలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ భారత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలపై కూడా. పెద్ద ప్రమాదం జరుగుతుంది. నైరుతి రుతుపవనాల బలహీనపడడంతో వర్షపాతం లోటు ఏర్పడింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి ప్రధాన పంట.అదీ వ్యవసాధారమే. ఆంధ్రప్రదేశ్, గోదావరి డెల్టాలో వరిసాగు, రాయలసీమలో వర్షాధార పంటలు. ఉత్తరాంధ్రాలో వరి, జీడి, చెరకు, ఉద్యానపంటలు విస్తృతంగా సాగుచేస్తారు. బంగాళాఖాతంలో తుఫానుల ఒత్తిడి పెరిగి భారీ వర్షాలు కురిస్తే అవి కూడా వ్యవసాయాన్ని దెబ్బతీస్తాయి. పంట నష్టాలు రైతును ఇబ్బంది పెడ్తాయి. సాగ కష్టనష్టాలు తప్పవు. తెలంగాణలో ఇప్పటికే 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉంది. జూన్, జులై నెలలో సగటున 22 శాతం వర్షపాతం లోటు ఉంది కొన్ని ప్రాంతాల్లో రెట్టింపులోటు ఉంది.వర్షాలు ఆలస్యమయ్యే కొద్దీ మళ్లీ నాట్లు వేయాలి. దాంతో మళ్లీ వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతాయి. రైతుకు ప్రభుత్వాలు ఎన్ని భరోసాలు కల్పించినా ఎల్‌నినో కల్పించే కష్టాల నుంచి నష్టాల తేరుకోగలడోలేడో. జులైలో ఉపందుకుంటాయనుకున్న వ్యవసాయ పనులు ఎక్కడిక క్కడ నిలిచిపోవడం విచారకరం. ఈ యేడాది ఇలాంటి వాతావరణ పరిస్థితుల రీత్యా గత యేడాది ఖరీఫ్ కన్నా సగం విస్తీర్ణంలోనే వరి సాగు జరిగే అవకాశం ఉంది. తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం తప్ప రైతుకు వేరే గత్యంతరం లేదు.

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు.ఎమర్సన్

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూపోవాలి.



శ్రీ రమణ మహర్షి

# 'పచ్చని' ప్రయాణమే ప్రగతికి మార్గం

*సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ ఈవీలు కేవలం రవాణా సాధనాలుగా కాకుండా, స్మార్ట్ పరికరాలుగా మారుతున్నాయి. వినియోగదారుల ధోరణి కేవలం ఆసక్తి చూపడం నుండి హరిత వాహనాలను నేరుగా కొనుగోలు చేసేస్థిరమైన స్థాయికి మారుతోంది. కాలుష్య రహిత సమాజ స్థాపన,పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమేకాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక కర్తవ్యం. పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో అనివార్యమైన అవసరంగా గుర్తించి, సాంప్రదాయ ఇంధన వాహనాల స్వార్థాన్ని వీడి, పచ్చని ప్రకృతి కోసం విద్యుత్తు వాహనాల వైపు మళ్లడమే నేటి వివేకం. హరిత ప్రయాణమే రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు అసలైన పునాది. మనం ఈ రోజు తీసుకునే ఒక్కో హరిత నిర్ణయం, రేపటి స్వచ్ఛమైన గాలికి ప్రాణ వాయువుగా మారుతుందని విస్మరించరాదు.*

మానవజాతి సాధిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక ప్రగతి ఒకవైపు జీవన ప్రమాణాలను అపారంగా పెంచుతుంటే, మరోవైపు ప్రకృతి సమతుల్యతను ఘోరంగా దెబ్బతీస్తోంది. భూగోళాన్ని పట్టిపీడిస్తున్న తీవ్ర వాతావరణ మార్పులు, శరవేగంగా పెరుగుతున్న కార్బన్ ఉద్గారాల నేపథ్యంలో పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో ఒక అనివార్యమైన అవసరంగా మారింది. కేవలం ఇంధన ధరల భారాన్ని తగ్గించుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలిని, కాలుష్యరహిత పచ్చని వాతావరణాన్ని అందించడానికి విద్యుత్తు వాహనాలవిప్లవం ఒక చారిత్రక చైతన్యంగా నిలిచింది. సాంప్రదాయ పెట్రోలు ద్విచక్ర వాహనాల స్థానాన్ని పర్యావరణ అనుకూల ఈవీలు ఆక్రమిస్తున్న ప్రస్తుత తరుణంలో, తెలుగు రాష్ట్రాలు జాతీయ సగటును మించి ఈ హరిత మార్పుకు విప్లవాత్మకంగా స్వాగతం పలుకుతుండటం అభినందనీయం,సర్వత్రా ఆదర్శనీయం. ప్రస్తుత ఆధునిక కాలంలో నిత్యం పెరుగుతున్న ఇంధన ధరలు ఒకవైపు మధ్యతరగతి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంటే, మరోవైపు వాహనాల పొగ వల్ల నగరాల్లో వాయుకాలుష్యం జీవన ప్రమాణాలను తీవ్రంగా క్షీణింపజేస్తోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకు మహానగరాల రోడ్ల పై కిలోమీటర్ల మేరసాగే వాహనాల రద్దీ, అవి వదిలే విష పూరిత వాయువులు వాతావరణాన్ని నరకప్రాయంగా మారు స్తున్నాయి. ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు కాలు ష్యం కారణంగా నానాటికీ పెరిగిపోతున్నాయి.ఈపర్యావరణ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపించగల ఏకైక ప్రత్యా మ్నాయ మార్గం విద్యుత్తు రవాణా వ్యవస్థ మాత్రమేనని ప్రపంచ పర్యావరణ శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు. ఒకప్పుడు విద్యుత్తు స్కూటర్లను కేవలం ఒక విలాసవంతమైన ఆప్షన్‌గా లేదా సరికొత్త సాంకేతిక ప్రయోగంగా చూసిన వినియోగదారులు, నేడు పర్యావరణ హితాన్ని, సుదీర్ఘకాలంలో లభించే అత్యంత తక్కువ నిర్వహణ వ్యయ ప్రయోజనాలను స్పష్టంగా గుర్తిస్తున్నారు. పెట్రోలు ధరలు లీటరుకు వంద రూపాయలు దాటి సామాన్యుడి ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్న తరుణంలో, ఈవీలు ఒక గొప్పవరంగా మారాయి. కేవలం పెట్రోలు ఖర్చులను ఆదా చేయడమే కాకుండా, శబ్ద కాలుష్యం, పొగ లేని స్వచ్ఛమైన ప్రయాణ అనుభూతిని పొందడానికి ప్రజలు ఈవీల కొనుగోలుపై మక్కువ చూపుతున్నారు. ఇది కేవలం ఒకవాహనం మార్పిడి అనే ఆర్థికపరమైన ఎంపిక మాత్రమే కాదు, పర్యావరణ పరిరక్షణలో తాము కూడా నేరుగా భాగస్వాములం కావాలనే సామాజిక బాధ్యతతో కూడిన గొప్పఅడుగుగా భావించాలి. పర్యావరణ స్పృహతో హరిత రవాణాను అలవర్చుకోవడంలో దేశంలోని మిగతా ప్రాంతాల కంటే ఆంధ్రప్రదేశ్,

వనకల్ల వీరప్ప

తెలంగాణ రాష్ట్రాలు ముందువరుసలో నిలవడం మన తెలుగు ప్రజల ఆలోచనా విధానానికి నిలువెత్తు అద్దం పడుతోంది. 2025-26 ఆర్థిక సంవత్స రపు అధికారిక గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా ద్విచక్ర విద్యుత్తు వాహనాల వ్యాప్తి సగటున 7.8 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో అది 9.3శాతంగాను, తెలంగాణలో ఏకంగా 10.2శాతంగాను నమోదైంది. ఈ గణాంకాలు తెలుగు ప్రజలలో పర్యావరణహిత ఇంధన వనరుల పట్ల పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.కాలుష్య ప్రభావం ఎక్కువగాఉండే హైదరాబాద్, విశాఖపట్నం,విజయవాడ వంటి పెద్ద నగరాల్లోనే కాకుండా, చిన్న పట్టణాల్లో సైతం



ఈవీల వాటా పెరుగుతుండటం అత్యంత సానుకూల పరిణామం. తెలంగాణలోని పెద్ద నగరాలలో ఈవీల వాటా 12శాతానికి చేరగా, రెండో శ్రేణినగరాలలో 11శాతం, చిన్న పట్టణాలలో కూడా 9.2శాతం మార్కెట్ వాటాను సాధించడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఇదే విధమైన పర్యావరణ చైతన్యం ప్రతిబింబిస్తోంది. గడిచిన ఏడాది కాలంలో ఏపీలోని రెండో శ్రేణి నగరాల్లో ఈవీల ఆదరణ 7.5శాతం నుండి 10.2శాతానికి పెరగగా, మూడోశ్రేణి నగరాల్లో 6.2 శాతం నుండి 8.7శాతానికి వృద్ధిచెందింది. ఈ అద్భుతమైన వృద్ధిరేటు పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ,తృతీయశ్రేణి పట్టణ స్థాయికి కూడా శరవేగంగా విస్తరిస్తోందని స్పష్టం చేస్తోంది. పర్యావరణానికి మేలుచేసే వాహనాలు అందరికీ చేరాలంటే, వాటి ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండాలి. పర్యావరణ హితం ఎంత ముఖ్యమైనదైనా, సామాన్యుడికి ఆర్థిక లభ్యత లేనిదే ఏవిప్లవమైనా అర్థాంతరంగా ఆగిపోకతప్పదు. ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ పెట్రోలు స్కూటర్లకు, విద్యుత్తు స్కూటర్లకు మధ్య ఉన్నధరల వ్యత్యాసం క్రమంగా తగ్గుతుండ టం శుభపరిణామం. ఈవీలలో అత్యంత కీలకమైన'బ్యాటరీ' తయారీ ఖర్చులు దేశీయంగా తగ్గడం, విడిభాగాలు స్థానికంగానే లభించడం ఇందుకు ప్రధాన కారణం. భవిష్యత్తులో బ్యాటరీ సాంకేతికత మరింత మెరుగై, స్థానిక ఉత్పత్తి పెరిగితే, పెట్రోలు స్కూటర్లతో సమానమైన ధరలోనే పర్యా వరణ అనుకూల ఈవీలు లభించే రోజులు ఎంతో దూరం లో లేవు. అయితే, స్కూటర్ల విభాగంలో కనిపిస్తున్న ఈ హరిత వేగం 'విద్యుత్తు మోటార్ సైకిళ్ల' (ఇ బైక్స్)విభాగంలో ఇంకా వెనకబడే ఉంది. మార్కెట్లో పెద్ద కంపెనీలు మొదట ఇస్కూటర్లనే అందించడం వల్ల, బైక్ ప్రియులు ఇంకా సాంప్రదాయ ఇంధన వాహనాలపైనే ఆధారపడుతున్నారు. మన దేశంలో, ముఖ్యంగా గ్రామీణ అర్ధ పట్టణ ప్రాంతాలలో బైకుల వినియోగం అత్యధికం. ఎక్కువ మైలేజీ, పటిష్టమైన బాడీ,నమ్మకమైన సాంకేతికతతోకూడిన ఇబైకులు అందుబాటులోకి వస్తే, కాలుష్యకారక బైకుల శకం కూడా ముగిసిపో తుంది. ఈవిషయంలో వాహన తయారీ కంపెనీలు పరిశోధనలను వేగవంతం చేయాల్సి న అవసరం ఎంతైనా ఉంది. హరిత రవాణావైపు ప్రజలు పూర్తిగా మారడానికి మార్కెట్లో కొన్ని సహజమైన అపోహలు, మౌలిక సవాళ్లు అడ్డుపడుతున్నాయి. బ్యాటరీ మన్నిక ఎన్ని రోజులు ఉంటుంది? ఒకే చార్జింగ్‌పై వచ్చే అసలు మైలేజీ ఎం? దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు లభించే చార్జింగ్ మౌలిక వసతులు, రీసేల్ విలువపై వినియోగదారులలో అనేక సందేహాలున్నాయి.పర్యావరణ మార్పును కాంక్షి ంచే కొనుగోలుదారు లకు డీలర్లు,తయారీ సంస్థలుస్పష్టమైన వారంటీలు,బ్యాటరీ సామర్థ్యంపై పూర్తి నమ్మకాన్ని కలిగించాలి. ఏ థర్ ఎనర్జీ వంటి ప్రముఖ సంస్థలు ఈదిశగా వినియోగదారులకు అవ సరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ మార్కెట్లో విశ్వసనీయతను పెంచుతున్నాయి. ప్రభుత్వాలు కూడా చార్జింగ్ స్టేషన్ల గ్రిడ్‌ను దేశవ్యాప్తంగా పెంచడానికిరాయితీలు ఇవ్వాలి. భారత ప్రభుత్వం దేశంలో వాతావరణ కాలుష్యా న్ని తగ్గించేందుకు 2030 నాటికి కొత్త వాహనాల విక్రయాలలో కనీసం 30శాతం వాటాను విద్యుత్తు వాహనాలుగా మార్చాలని ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈ హరిత లక్ష్య సాధన దిశగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు,పటిష్టమైన చార్జింగ్ వ్యవస్థ, సులభమైన సర్వీసింగ్ మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగేకొద్దీ ఈవీలు కేవలం రవాణా సాధనాలుగా కాకుండా, స్మార్ట్ పరికరాలుగా మారుతున్నాయి. వినియోగదారుల ధోరణి కేవలం ఆసక్తి చూపడం నుండి హరిత వాహనాలను నేరు గా కొనుగోలు చేసేస్థిరమైన స్థాయికి మారుతోంది. కాలుష్య రహిత సమాజ స్థాపన,పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభు త్వాల బాధ్యత మాత్రమేకాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక కర్తవ్యం. పర్యావరణానికి మేలు చేసే హరిత రవాణా వైపు అడుగులు వేయడం కాలప్రవాహంలో అనివార్యమైన అవ సరంగా గుర్తించి,సాంప్రదాయ ఇంధన వాహనాల స్వార్థాన్ని వీడి, పచ్చని ప్రకృతి కోసం విద్యుత్తు వాహనాల వైపు మళ్లడమే నేటి వివేకం. హరిత ప్రయాణమే రేపటి తరాల ఉజ్వల

# న్యాయవ్యవస్థపై విశ్వాసమే ప్రజాస్వామ్యానికి పునాది

సుప్రీంకోర్టు ఇచ్చే ప్రతి తీర్పు చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత అనే సూత్రాలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవస్థపై విశ్వాసం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. అదే సమయంలో రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధ న్యాయపరమైన అవకాశాలను వినియోగించడం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగమే. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన న్యాయపరమైన పరిణామాలు కేవలం ఒక పరీక్షకు సంబంధించినవి మాత్రమే కావు. అవి దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ, విద్యా నాణ్యత, ఉపాధ్యాయుల సేవా భద్రత, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా పరిపాలన వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్నాయి. అందువల్ల ఈ అంశాన్ని ఒక ఉద్యోగ వివాదంగా కాకుండా జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యా విధాన అంశంగా పరిశీలించాల్సి న అవసరం ఉంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు, ప్రభుత్వ విద్యావ్యవస్థతో ముడిపడి ఉన్న ఈ అంశంలో రాజ్యాంగం కల్పించిన ప్రతి చట్టబద్ధ అవకాశంపై సమాజానికి అవగాహన కల్పించడం కూడా ఒక ప్రజాస్వామ్య బాధ్యత.విద్యా ప్రమాణాలను పెంపొందించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని నిరంతరం అభివృద్ధి చేయడం కూడా కాలానుగుణ అవసరమే. అయితే అదే సమయంలో టెట్ విధానం అమల్లోకి రాకముందే అప్పటి చట్టాలు, నిబంధనలు, అర్హతల ప్రకారం నియమితులై, అనేక

తరిగోపుల నారాయణస్వామి

సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితిని కూడా ప్రజాస్వామ్య దృష్టితో పరిశీలించాలి. విద్యా సంస్కరణలు ఎంత ముఖ్యమో, వాటి అమలులో న్యాయసముచిత, సమానత్వం, పరిపాలనా సౌలభ్యం,మానవీయ విలువలు కూడా అంతే ముఖ్యమైనవి. క్యూరేటివ్ పిటిషన్ అనేది సాధారణ అప్పీల్ కాదు. సాధారణ రివ్యూ పిటిషన్ కూడా కాదు. అత్యంత అరుదైన పరిస్థితుల్లో, న్యాయం పూర్తిగా జరిగిందా లేదా రాజ్యాంగపరమైన ఏదైనా అసాధారణ అంశం పునఃపరిశీలనకు అర్హమా అనే ప్రశ్నను పరిశీలించేందుకు భారత న్యాయవ్యవస్థ గుర్తించిన చివరి రాజ్యాంగపరమైన అవకాశం. అందువల్ల క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయడం న్యాయవ్యవస్థను వ్యతిరేకించడం కాదు, రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధ మార్గాన్ని గౌరవప్రదంగా వినియోగించడమే. ప్రజాస్వామ్యంలో చట్టం, న్యాయం, మానవీయ విలువలు పరస్పర విరుద్ధమైనవి కావు. అవి ఒకదానికొకటి పూరకాలు. చట్టం రూపొందించే సమయంలో ప్రతిభవిష్యత్ పరిస్థితిని ముందుగానే ఊహించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. విద్యావిధానాలు మారుతాయి. అర్హతలు మారుతాయి. కానీ ఇప్పటికే చట్టబద్ధంగా నియమితులై సేవలందిస్తున్న ఉద్యోగుల పరిస్థితి కూడా ఒక సామాజిక వాస్తవం. అలాంటి సందర్భాల్లో మార్పు కాలం, దశలవారీ అమలు,శిక్షణ, ప్రత్యేక విధానాలు వంటి అంశాలను పరిశీలించడం ప్రజా విధానాల పరిపక్వతకు సంకేతం. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ అంశంలో కూడా చర్చ జరగాల్సింది న్యాయస్థానాన్ని విమర్శించడంకాదు,రాజ్యాంగం కల్పించిన అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై. విద్యా ప్రమాణాలను కాపాడుతూ,సేవలో ఉన్న ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన ఆందోళనలను సమతుల్యంగా పరిష్కరించేమార్గాలను అన్వేషించడంప్రభుత్వం, విధాన రూపకర్తలు,న్యాయ నిపుణులు,విద్యావేత్తల ఉమ్మడి బాధ్యత. అలాంటి సందర్భాల్లో క్యూరేటివ్‌పిటిషన్ వంటి రాజ్యాంగపరమైన అవకాశాలను పరిశీలించడం ప్రజాస్వామ్య బద్ధమైన,చట్టబద్ధమైన చర్యగా పరిగణించవచ్చు. అది ఏ తీర్పును ధిక్కరించడంకాదు, రాజ్యాంగం చూపిన చివరి న్యాయమార్గాన్ని వినియోగించాలనే విజ్ఞప్తిమాత్రమే. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేశిల్పులు. వారి అనుభవాన్ని గౌరవిస్తూ, విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేసే సమతుల్య పరిష్కారాలను అన్వేషించడం భారత ప్రజాస్వామ్య పరిపక్వతకు నిదర్శనం అవుతుంది. భారత విద్యావ్యవస్థ బలోపేతంకావడం,రాజ్యాంగంపై ప్రజలవిశ్వాసం మరింత పెరగడం, చట్టం మానవీయ విలువల మధ్య సమతుల్యత సాధించడం.అదే నిజమైన ప్రజాస్వామ్య విజయం. అదే భారత రాజ్యాంగస్ఫూర్తి. అదే లక్షలాది మంది ఉపాధ్యాయులు,విద్యార్థులు,సమాజం ఆశించే న్యాయం. ●

# ప్రజావాక్కు



## మోడీతో భయమా!

టీవీలకు రాజకీయాలు ఉండరాదు. స్వతంత్రంగా పని చేయాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించాలి.ఆ మధ్య తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని అన్ని ఛానల్స్ ప్రతిరోజు అదేచర్చలు పెట్టి విసుగుపుట్టించాయి.కొన్ని రోజులు గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణం చర్చలు మీద చర్చలు. మరి కొన్నాళ్ళు ప్రతి పక్షం వాళ్ళ అటవీభూములు ఆక్రమణమీద చర్చలు.ఒకవారం నుండి చర్చోపచర్చలు జరుగుతున్నాయి.అయితే అయోధ్య బాల రామాలయంలో హుండీలోకి చేరాల్సి న వేలకోట్ల రూపాయలుదొంగతనం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు హుండీ డబ్బులు లెక్కపెట్టేవారికి జేబు లు లేనీ చొక్కాలు వేసుకరమ్మని ఆదేశించారట.తిరుపతి లోఅక్రమాలు జరిగాయని తెగచర్చలు పెట్టినటీవీ ఛానల్స్ వారు,అయోధ్య రామాలయంలోజరిగినదొంగతనం మీదఎందుకు మౌనం వహిస్తున్నాయి? మోడీ తాట తీస్తాడని భయమా?

*- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా*

## దివ్యాంగుల దైవ దర్శనం ఏర్పాట్లు?

దివ్యాంగులకు వివిధ దేవాలయాలలో దైవదర్శనం కోసం తగిన ఏర్పాట్లు చేయాలి. ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించాలి. దేవాలయాలలో వికలాంగుల దైవదర్శనం కోసం ప్రత్యేకమైన క్యూ ఏర్పాటు చేయాలి. సత్రాలలో ఉచిత సౌకర్యం కల్పించాలి. ఉచిత లడ్డు ఇవ్వాలి. దేవాలయాల వద్ద వికలాంగుల దైవదర్శనం వసతి కొరకు ప్రత్యేకమైన కౌంటర్ ఏర్పాటుచేయాలి.స్వచ్ఛంద సంస్థలు.యువజనసంఘాలు, అధికారులు,ప్రజా ప్రతినిధులు వికలాంగుల దైవదర్శనం కోసం ఆర్థికసహాయం చేయాలి. వికలాంగుల దైవ దర్శనం కోసం ఒక ప్రత్యేకమైన ట్రస్టును ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలి.

*- ఈదునూరి, వెంకటేశ్వర్లు, నెక్కొండ*

## నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది.రాష్ట్ర ముఖ్యమంత్రిమీనమేషాలు లెక్కించకుండా ఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

*-బి. కృష్ణ, హైదరాబాద్*

## పాశ్చాత్య ధోరణులు

భారతదేశ వాతావరణ పరిస్థితులను బట్టి మనది ఉష్ణ మండల దేశంగా పరిగణిస్తారు.మనదేశంలో వివిధ ప్రాంతాలలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉండటం కద్దు. వేసవిలోఅయితేఅసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో పిల్లలు, యువతీ యువకులు, స్త్రీలు, పురుషులు ఉష్ణతాపం తట్టుకోలేకనో లేక పాశ్చాత్య ధోరణిలో చిన్నదుస్తులు ధరించి మండు వేసవిలో యధేచ్ఛగా సంచరిస్తున్నారు. సాధారణంగా సూర్యకిరణాల వేడిమి 30 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ అంతకు మించితే సూర్యకిరణాలలో అల్ట్రా వయొలెట్ కిరణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కిరణాలు చర్మానికి నేరుగా సోకితే చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదంఉంది.పాశ్చాత్యదేశాలలో సూర్యకిరణాల వేడిమి, తీక్షణత 30-32 డిగ్రీల సెల్సియస్‌కు మించదు కాబట్టి అక్కడి ప్రజలు చిన్న దుస్తులు ధరించినా వారికి పెద్దప్రమాదం ఉండదు.ఎటొచ్చీ ఉష్ణమండల దేశమైన భారత్‌లో జాగ్రత్తలు ఎక్కువగా తీసుకోవాలి.

*- కె. వెంకట్, సికింద్రాబాద్*

## కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈకోర్టుకేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడు నాలుగు సంవత్సరాలు గడిచిన కానీ కేసు పరిష్కారం జరగటం లేదు కానీ కేసు బాధితులు మాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి న పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతో యుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెల బడును. కానీ నేటి వరకు కూడా పరిష్కార దిశలు కనుక్కో లేకపోతున్నారు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నా రు. వినియోగదారుల ఫోరంలో జాబ్స్ వెంటేనే భర్తీచేసి కేసులు వేగవంతం చేయాలి.

*- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్*

## వ్యవస్థలలో మార్పులు రావాలి

మానవ సమాజంలో సాంకేతికత పెరుగుతున్న క్రమంలో దానికనుగుణంగా మనం నిరంతరంఅభివృద్ధిచెందుతూ ముందుకు సాగితేనే సమాజంలో నిలదొక్కుకోగలం. కావున సాంకేతికత వినియోగం పెంచుకుని ఆర్థికంగా ఎదగాలి. గ్రామ స్థాయి నుంచే సాంకేతికతను అభివృద్ధిపరచాలి. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాలు, దేశం అభివృద్ధి చెందుతుంది.

*-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా*

# శ్వేతసౌధం మసకబారుతున్న దృశ్యం



సరికొండ రవీంద్రనాథ్

ప్రపంచానికి మకుటాయమానమైన ఆ శ్వేత సౌధం కూలుతున్న దృశ్యం గల్ఫ్‌లో స్పష్టంగా గోచరిస్తోంది. ఇరాన్ యుద్ధంలో అపజయంతోబాటు, గల్ఫ్ నుంచి ఇరవై సైనిక స్థావరాలను ఖాళీ చేయడంతో అమెరికా పతనం ప్రారంభం కాబోతోంది. దాదాపు అర్ధ శతాబ్దంగా పర్షియన్ గల్ఫ్ ప్రాంతం అమెరికా సైనిక వ్యూహానికి కేంద్రంగా ఉంది. బహ్రెయిన్, ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ ఇంకా ఇతర ప్రాంతాలలో ఉన్న అరబ్ దేశాల్లో భారీ అమెరికా స్థావరాలు ఉన్నాయి. చమురు నౌకల రవాణా మార్గాలనునాటి కమ్యూ నిస్టు సోవియట్ యూనియన్ దాడి చేయకుండా రక్షి ంచే నెపంతో అమెరికా సుమారు ఇరవై సైనిక స్థావరాలను గల్ఫ్ ప్రాంతంలో ఏర్పాటు చేసింది. గత ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా ఓటమి అంచులో ఉంది. మూడు రోజుల్లో ఇరాన్‌ను స్వాధీనం చేసుకుం టానని చెప్పిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 110 రోజులైనా ఇరాన్‌ను దారికి తెచ్చుకోలేకపోయాడు. పైగా తన వాచా లత్వంతో నాటో దేశాలను, అరబ్ మిత్ర దేశాలను దూరం చేసుకున్నాడు. అమెరికా ఓటమికి అనేక కారణాలు ఉన్నా యి. అమెరికా శక్తిని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అతిగా ఊహించుకున్నాడు. నాటో, అరబ్ దేశాలు (13)ఇజ్రాయెల్, తను కలిసి దాడి చేస్తే మూడు రోజుల్లో వెనెజులాలాగా ఇరాన్ సాగిలబడి పోతుందని ట్రంప్ కలగన్నాడు. కానీ నాటో మిత్రులుగానీ, అరబ్ దేశాలుగానీ యుద్ధంలో పాల్గొ నకుండా ప్రేక్షక పాత్ర వహించాయి. ఇప్పటికే ఆర్థిక మాం ద్యాలతో ఇబ్బంది పడుతున్న నాటో దేశాలు ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధం వల్ల వచ్చే అవాంచనీయ పరిణామాలను ఎదుర్కొనడానికి సిద్ధంగా లేవు.అందుకే ట్రంప్ వ్యక్తిగతంగా దూషించినా బ్రిటన్, ఫ్రాన్స్ అధ్యక్షులు ఇరాన్ వైపు కన్నెత్తి చూడలేదు. ఇక అరబ్ మిత్ర దేశాల వెన్నుపోటును డోనాల్డ్ ట్రంప్ మాత్రమే కాదు. ప్రపంచంలో రాజకీయ పరిశీలకులు ఎవరూ ఊహించలేకపోయారు. 2025 జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్‌ను కాళ్లబేరా నికి తీసుకురావడంతో అరబ్ దేశాలకు ఇరాన్‌పై నమ్మకం పెరిగింది. మళ్లీ ఫిబ్రవరి 28న అమెరికా యుద్ధం ప్రారం భించేలోపు అరబ్ దేశాలు ఇరాన్ రహస్యంగా కట్టేసాయి. తాజా యుద్ధంలో అమెరికా సైనిక స్థావరాలను తుక్కుకింద కొట్టేసిన ఇరాన్ అరబ్ భూభాగాలపై కనీసం బజూకారాకెట్ లను కూడా ప్రయోగించలేదు. ట్రంప్‌కు తగిలిన మొదటి అతి పెద్ద షాక్ ఇదే. ఇంత కాలం యుద్ధం జరుగుతున్నా అరబ్ దేశాల్లో జనజీవనానికి ఎటువంటి అంతరాయంలేదు. ఇరాన్ దాడిలో



కూలిపోవాల్సి న ఖలీఫా టవర్ వెలుగులు విరజిమ్ముతూనే ఉంది. యుద్ధంలో భారతీయులు సుమారు యాభై మంది చనిపోయారు. కానీ ఒక్క అరబ్ దేశీయుడు కూడా చనిపోలేదు. నాటో నేతలు 'పిరికిపందలు' అంటూ బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేసినా ట్రంప్ సౌదీన యువరాజు సల్మాన్ అబ్దుల్‌ను కూడా బండ బూతులు తిట్టాడు. ఇంగ్లీషులో ఫోర్ లెటర్ వర్డ్ వాడటంతో సల్మాన్ అబ్దుల్‌కు కోపం వచ్చి అమెరికాతో వాణిజ్య లావాదేవీలు రద్దు చేస్తున్నట్టు ప్రకటించాడు. నిన్నటి వరకూ సన్నిహితంగా ఉన్న సౌదీ మూటాముల్లే సర్దుకుని వెళ్లిపొమ్మని అమెరికాకు దారి చూపెడుతోంది. అమెరికా సైనికుల సంఖ్య 13 లక్షలు. కాగా గల్ఫ్ సైనిక స్థావరాల్లో 50 వేలమందిని మోహరించింది. దేశ రక్షణ బడ్జెట్ 800 బిలియన్ డాలర్లలో 60 బిలియన్ డాలర్లు గల్ఫ్‌లో వ్యయం చేస్తోంది. ఆదాయం చెప్పుకోడానికి ఏమీ లేదు. గల్ఫ్ ఆదా చేసిన డబ్బును నౌకాదళ విస్తరణ, సెమీకండక్టర్ పెట్టుబడులు, ఎఐ రక్షణ, సాంకేతికత అభివృద్ధికి కేటాయించవచ్చని నిపుణులు ట్రంప్‌కు హితవు చెబుతున్నారు. అంటే 'మనకు యుద్ధాలు చేయడం రాదు. నోర్మూసుకుని కూర్చో' అని చెప్పడం అన్నమాట. ప్రతిరోజూ రెండు బిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. ఇరాన్ దాడుల్లో ఫిఫ్త్ ఫ్లీట్‌తో సహా రాడార్‌లు అన్నీ ధ్వంసం అయ్యాయి. గల్ఫ్ నుంచి అమెరికా పారిపోతే అంతర్జాతీయంగా తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. గల్ఫ్‌లో చైనా, రష్యాల, భారత్‌ల ప్రభావం పెరుగుతుంది. అమెరికా గుత్తాధిపత్యం పోయి స్వేచ్ఛా వాతావరణం నెలకొంటుంది. విశ్వవ్యాప్తంగా ఈ ప్రభావం ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, ఇతర దేశాలు సొంత రక్షణ వ్యవస్థలను సమకూర్చుకోవాల్సిందే. గల్ఫ్ దేశాలు డాలర్‌ను వదిలి ఇతర కరెన్సీలలో వ్యాపారాలు చేస్తాయి.డాలర్ విలువ తగ్గడం మొదలవుతుంది. పారిశ్రామిక వేత్తలు అమెరికా సెక్యూరిటీలు కొనడం మానేసి అమ్మకం మొదలుపెడతారు. దీనితో డాలర్ మారకం విలువ పడిపోయి అమెరికా అప్పులు రెట్టింపు అవుతాయి. చివరగా ప్రపంచానికే శిఖరాయమానమైన శ్వేతసౌధ రాజకీయ ప్రాభవం మసకబారుతుంది. అమెరికా వదిలి వెళ్లిపోతే అరబ్ దేశాలపైకూడా దాని ప్రభావం ఉంటుంది.ఇది గమనించి సౌదీఅరేబియా విజన్2030 లో భాగంగా చమురుపై వచ్చే ఆదాయానికిబదులుగా టూరిజం, టెక్నాలజీ,లాజిస్టిక్స్, తయారీ పరిశ్రమలపై ఆదాయం పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది. అరబ్ దేశాలకు ముఖ్యంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్‌లకు భద్రత ఉండదు.ఇజ్రాయెల్ ముప్పు ఉంటుంది. ఈ కారణంగా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రారు. వచ్చినా అనేక షరతులు విధిస్తారు. ప్రస్తుతం అన్ని ఒడుదుడుకులను ఎదుర్కొని చైనా మాత్రమేగల్ఫ్ ప్రాంతంలోని పోర్టులు, రిఫైనరీలు,టెలికం, ఇంకా ఇతర మౌలికరం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

6MN 7_6MN 7.qxd 7/14/2026 1:11 AM Page 1



## ఉర్సు మహోత్సవంలో పీఠాధిపతులు ఖాజా, డా.ఖలీల్

నాగ్‌పూర్ తాజ్‌బాబా 104వ ఉర్సు మహోత్సవంలో పరవశించిన అతావుల్లా బాబా భక్తులు

**ఎ కొండూరు, జూలై 13, ప్రభాతవార్త:**



మహారాష్ట్రలోని నాగ్‌పూర్ షరీఫ్‌లో హజరత్ బాబా తాజుద్దీన్ తాజుల్ ఔలియా వారి 104వ ఉర్సు మహోత్సవం ఎపి స్టేట్ ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం భీమవరపు ఎఎంపిటికె దర్గాలో బాబి ఎ బాగ్దాద్‌లో అలుపెరుగని అన్నదాత నజీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా బాబా ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి, పీరీతాదా మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ విజయనగరం హజరత్ ఖాదర్ వలీబాబా దర్గా ముతవల్లి, ధర్మకర్త ఎలైట్ సేవాసంస్థ డాక్టర్ ఖలీల్ బాబు, తాజ్ ఖాదరీబాబుల ఆధ్వర్యంలో నాగ్‌పూర్ షరీఫ్ తాజ్‌బాబా దర్గా అండ్ దర్బార్‌లో అత్యంత వైభవంగా చాదర్ గంధం ఊరేగింపు, గులాబ్ సమర్పించి అత్యంత భక్తిశ్రద్ధలతో బాబా వారి సమాధి వద్ద ప్రత్యేక దువా జరిపారు. ఈ సందర్భంగా భారతదేశం నలుమూలల నుండి ప్రపంచ దేశాలకు చెందిన కులమతవర్గ విచక్షణ లేకుండా విచ్చేసిన భక్తులకు అన్నదానం నిరతాన్నదానం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఇంకా ఇతర రాష్ట్రాల నుండి హజరత్ అతావుల్లా బాబా భక్తులు నాగ్‌పూర్ తాజ్‌బాబా 104వ ఉర్సు మహోత్సవానికి పెద్ద ఎత్తున తరలివెళ్లి తాజ్‌బాబా వారి సేవలో భక్తులు పరవశించి పునీతులయ్యారు.

## విజయోత్సవ సభలో టిడిపి శ్రేణులతో వేదికపై ఎమ్మెల్యే

- తిరువూరులో కూటమి రెండేళ్ల విజయోత్సవ సభ

గ్రాండ్ సక్సెస్‌తో ఎమ్మెల్యే శ్రేణుల్లో ఆనందోత్సాహాలు

**ఎ కొండూరు, జూలై 13, ప్రభాతవార్త:**





ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు దళిత ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విజయవంతంగా రెండేళ్ళ సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తిరువూరు టౌన్‌లో తిరువూరు ఎ కొండూరు గంపలగూడెం విస్సన్నపేట మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తల నడుమ జరిగిన భారీ విజయోత్సవ సభకు వేలాదిగా ప్రజలు మహిళలు తరలిరావడంతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, శ్రేణులు ఆనందడోలికల్లో మునిగి తేలారు. ఈ భారీ విజయోత్సవ సభకు నియోజకవర్గంలోని 4 మండలాలకు చెందిన శ్రేణులు నాయకులు కార్యకర్తలు ఆశించిన స్థాయికంటే భారీగా తరలిరావడం ఎమ్మెల్యే వర్గంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ విజయోత్సవ సభలో ఎపిస్టేట్ మాదిగ ఫెడరేషన్ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, సీనియర్ లీడర్ గడ్డి కృష్ణారెడ్డి, తిరువూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు మేకల రామారావు (జాన్) 4 మండలాలకు చెందిన పార్టీశ్రేణులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ ఆహారంతో బరువు నియంత్రణ

**విజయవాడ, జులై 13, ప్రభాతవార్త :**

కఠినమైన డైట్‌లు, తీవ్రమైన వ్యాయామాల కంటే ఆరోగ్యకరమైన అలవాట్లతో దీర్ఘకాలికంగా బరువును సమర్థంగా నియంత్రించవచ్చని బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్ పేర్కొన్నారు. కాలిఫోర్నియా బాదంపప్పుల ప్రచారంలో భాగంగా 24 రకాల పోషకాలున్న కాలిఫోర్నియా బాదంపప్పులు, పండ్లు, గుడ్లు, పనీర్, శనగలు, తోఫు, తక్కువ కొవ్వు కలిగిన మాంసం వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం బరువు నియంత్రణ, సమగ్రారోగ్యం సమకూరుతాయన్నారు.

## నికోటిన్ ప్రత్యామ్నాయంతో న్యూజిలాండ్లో తగ్గిన ధూమపానం

**విజయవాడ, జులై 13, ప్రభాతవార్త :**

సురక్షితమైన నికోటిన్ ప్రత్యామ్నాయాలతో (నియంత్రిత వేపింగ్ వంటి) ధూమపాన విరమణ న్యూజిలాండ్‌లో ధూమపానం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని ది లాన్సెట్ 2026 అధ్యయనం వెల్లడించింది. 20వ శతాబ్దంలో పురుషుల్లో 40 శాతం, మహిళల్లో మూడింట ఒక వంతుగా ఉన్న ధూమపాన రేటు, 201516 నాటికి 15 శాతానికి తగ్గగా, 201819లో నికోటిన్ ప్రత్యామ్నాయాలను అధికారికంగా ప్రవేశపెట్టడంతో 202223 నాటికి 7 శాతంకు చేరినట్లు అధ్యయనం పేర్కొంది.

## మార్నింగ్ స్టార్ విద్యార్థులకు రీ ఎగ్జామ్ షెడ్యూల్

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై13, ప్రభాతవార్త:**

ఏఎన్‌యు పరిధిలో ఫిరంగిపురంలో ఉన్న మార్నింగ్ స్టార్ కళాశాల విద్యార్థులకు డిగ్రీ రీ-ఎగ్జామ్ తేదీలను ఏసిఇ రెడ్డి ప్రకాశరావు ప్రకటించారు. జూన్ 30, జూలై1న జరగాల్సిన పరీక్షలు జూలై 20న ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనివార్య కారణాలతో మార్నింగ్ స్టార్ కళాశాల విద్యార్థులు ముందుగా ప్రకటించిన తేదీలలో పరీక్షలకు హాజరుకాలేకపోయారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల భవిష్యత్ కోసం పరీక్షను నిర్వహించాలని వర్సిటీకి లేఖరాశారు. వీసి గంగాధరరావు ఆదేశాలతో పరీక్షల తేదీలను నిర్ణయించినట్లు రెడ్డి ప్రకాశరావు వెల్లడించారు.

## ఎల్జీ ఎలక్ట్రానిక్స్ రోబోటిక్స్ బిజినెస్ సెంటర్ ఏర్పాటు

**విజయవాడ, జులై 13, ప్రభాతవార్త :**

రోబోటిక్స్‌ను వాణిజ్యపరంగా విస్తరించేందుకు అవసరమైన కీలక సామర్థ్యాలు ఒకే చోట సమీకరించేలా రోబోటిక్స్ బిజినెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార అభివృద్ధి నుంచి సరఫరా వ్యవస్థ, తయారీ కార్యకలాపాల వరకు అన్నింటినీ సమన్వయం చేయనున్న ఈ కేంద్రంకు ఎల్ జీ ప్రొడక్షన్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో కీలక బాధ్యతలు నిర్వహించిన సాంగ్ సి యోంగ్ దీనికి నాయకత్వం వహించనున్నారన్నారు.

## కియా ఇండియా ప్రాజెక్ట్ బకిల్ అప్ మూడవ దశ ప్రారంభం

**విజయవాడ, జులై 13, ప్రభాతవార్త :**

ది సోషల్ ల్యాబ్ ఫౌండేషన్‌తో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా, తన ప్రతిష్టాత్మక సీ ఎస్ ఆర్ కార్యక్రమం, ప్రాజెక్ట్ బకిల్ అప్ విస్తరణను ప్రకటించినట్లు కియా ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి మార్గదర్శకత్వంలో కుదిరిన ఈ అవగాహన ఒప్పందం ద్వారా రాష్ట్రంలో రహదారి భద్రతా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, సుస్థిర సామాజిక అభివృద్ధిని ప్రోత్సహించడం అంశాలపై చర్చించారన్నారు.

## ప్రముఖ గాయని ఎస్.జానకి చిరస్మరణీయురాలు




గుంటూరు కల్చరల్,జూలై 13,ప్రభాతవార్త : గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు మద్దు వెంకటస్వామి మరియు వారి బృందం నక్షత్రగాయని ఎస్.జానకిని కోల్పోవడం సనీ రంగానికి ఒక తీరని లోటన్నారు.వారి జ్ఞాపకాలను తలచుకుంటూ 2013ఫిబ్రవరి 24న గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహించిన ఎస్.జానకీ కార్యక్రమం అత్యంత అద్భుతంగా కిక్కిరిసిన జనంతో జరిగింది.వారు సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్,అనేక మంది కళాకారులను ఘనంగా సత్కరించారు.పుర ప్రముఖులు సంస్థవారు ఎస్ జానకినీ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం నిర్వహించిన కార్యక్రమం ప్రశంసనీయమన్నారు.11-7-2026న ఎస్.జానకి పరమపదించడం ఒక తీరని లోటుగా భావిస్తూ గుంటూరు జిల్లా సంగీత కళాకారులతో, తమ కుటుంబ సభ్యుల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నట్లు వెంకటస్వామి తెలిపారు.

## హాస్యం ఆరోగ్యదాయిని,ఆనందదాయని అవగాహనలో హాస్యవల్లరి..

గుంటూరు కల్చరల్,జూలై 13,ప్రభాతవార్త : హాస్యం ఒక ఆప్తమిత్రుని వంటిదని అది మనల్ని నవ్విస్తుంది,కవ్విస్తుంది,ఆనంద పరవశుల్ని చేస్తుందని అది మన పరిచయాలను పెంచుతుందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న హాస్యప్రియులు పలువరు మాట్లాడుతూ అన్నారు.సంస్థ కార్యాలయంలో 141వ హాస్యవల్లరి కార్యక్రమం ఉత్సాహంగా,ఉల్లాసంగా సాగింది.కార్యక్రమాన్ని కవి,రచయిత బండికల్లు జమదగ్ని ప్రారంభిస్తూ ఆనందానికి సూచిక,ఆహ్లాదానికి సంకేతం నవ్వు అని



గతంలో నవ్వు నాలుగు విధాల చేటు అనేవారని ఇప్పుడు నవ్వు నలభై విధాల గ్రేటు అంటున్నారన్నారు.ప్రముఖ హాస్యవిషయాల విశ్లేషకులు ఆర్.వి.వేంకటేశ్వర్లు మాట్లాడుతూ నవ్వులేని జీవితం దుర్భర దారిద్ర్యంతో సమానమన్నారు.రచయిత్రి టి.పద్మావతి,హాస్యప్రియులు సిహెచ్ బాలకృష్ణ,కెఎస్ ప్రసాద్ తదితరులు తమ జోక్స్,కామెడీ స్కిట్స్‌తో అలరించారు.కార్యక్రమంలో నవ్వుల జల్లులు,పిసినారులు వర్థిల్లాలి,అఖిల మూర్ఖుల దినోత్సవం అనే రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా అందర్ని కడుపుబ్బ నవ్వించారు.

## పంటల భీమా చేయించుకోండి ధీమాగా ఉండండి

యడ్లపాడు, జులై 13, ప్రభాతవార్త : కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంటనష్టం వలన కలిగే ఆర్థిక ఇబ్బందుల నుండి రైతులను ఆదుకొనుటకు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ 2026 సీజన్ కు అమలు చేస్తున్నది. జూలై15గా నిర్ణయించటం జరిగిందని ఏఓ ఎ హరిప్రసాద్ తెలిపారు.

# అమరావతి వార్త

## సి.ఎం.ఏ ఫౌండేషన్ సి.ఏ ఫౌండేషన్ ఫలితాలలో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య జూలై 11 ప్రభాతవార్త**

సి.ఎం.ఏ ఫౌండేషన్ ఫలితాలలో ప్రముఖ విద్యా సంస్థ మాస్టర్మైండ్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ర్యాంకుల ప్రభంజనాన్ని సృష్టించారు. సి.ఎం.ఏ ఫౌండేషన్ ఫలితాలలో అఖిల భారత స్థాయిలో 10 ర్యాంకులను మాత్రమే ప్రకటించటం జరుగుతుంది. ఈ 10 ర్యాంకులలో 9 ర్యాంకులను మాస్టర్మైండ్స్ విద్యార్థులు కైవసం చేసుకున్నారని మాస్టర్మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ సి.ఏ మట్టుపల్లి మోహన్ పత్రికా విలేకర్ల సమావేశంలో తెలిపారు. మాస్టర్మైండ్స్ 2, 4, 5, 6, 6, 6, 7, 8,10. శ్రీ్ఖ్ఖ్బ సేమ్ మార్క్స్ వచ్చినటువంటి విద్యార్థులకు సేమ్ ర్యాంక్ ఇవ్వటమనేది జరుగుతుంది. ఈ విధంగా అఖిల భారత స్థాయిలో 10 ర్యాంకులలో 9 ర్యాంకులను మాస్టర్మైండ్స్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు.

## నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికుల పాత్ర కీలకం : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,జూలై 13,ప్రభాతవార్త**




నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. సోమవారం తన పర్యటనలో భాగంగా ఆయన మహాత్మాగాంధి రోడ్,బెంజి సర్కిల్,స్క్రూబ్రిడి .జ,రాణీగారితోట,కృష్ణలంక ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వ్యర్థాలతో పోరాడుతూ నగర పరిశుభ్రత కోసం అంకితభావంతో పారిశుద్ధ కార్మికులు పనిచేస్తున్నారని కొనియాడారు. విధుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా,పనిముట్లు సక్రమంగా పనిచేయకపోయినా ఎటువంటి సంకోచం లేకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమమైన పనిముట్లు,భద్రతా పరికరాలు,ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కార్పొరేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రధాన రహదారులు,కూడళ్ళు,కాలనీల్లో ప్రతి రోజూ నిర్ణీత సమయానికి పారిశుధ్య పనులు నిర్వహించాలని,చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి శాస్త్రీయ పద్ధతిలో తరలించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువలు,డ్రైన్లలో చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని,ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించేందుకు పారిశుధ్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ నగరపాలక సంస్థకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం రాణీగారితోట లోని అన్నా క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. క్యాంటీన్‌లో భోజనం నాణ్యత,పరిశుభ్రత,ఆహార పంపిణీ విధానం,తాగునీటి సౌకర్యం,వంటశాల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నా క్యాంటీన్ల నోడల్ అధికారులు ప్రతి రోజు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి,ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కొండవీటి కళా పరిషత్ అర్గనైజింగ్ సెక్రటకీ మృతి

యడ్లపాడు, జులై 13, ప్రభాతవార్త : కొండవీటి కళా పరిషత్ అర్గనైజింగ్ సెక్రటరీ మలినేని సీతారామాంజనేయులు(60) ఆదివారం రాత్రి హైదరాబాద్లో అనారోగ్యంతో కన్నుమూశారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి నాటిక పోటీల ఏర్పాట్లను ఆయన చురుగ్గా పర్యవేక్షించేవారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం లింగారావుపాలెం తరలించి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు నాటక రంగ దర్శకులు, నటులు, పరిషత్ నిర్వాహకులు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు గుదె పాండురంగారావు, గంగోత్రి సాయి, కందిమళ్ల సాంబశివరావు, అలోకం పెద్దబ్బయ్య, జరుగుల శంకరరావు, ముత్తవరపు పద్మారావు, పోపూరి నాగేశ్వరరావు, కొండవీటి కళా పరిషత్ నిర్వాహకులు కట్టా శ్రీహరి, మండెపూడి శ్రీనివాసరావు, తోకల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



## పదో తరగతి విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

యడ్లపాడు, జులై 13, ప్రభాతవార్త : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎడ్లపాడులో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తుల (యూనిఫాంల) పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నీటి సంఘం అధ్యక్షులు పోపూరి రాఘవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.గ్రామ పెద్ద పోపూరి రత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 19 ఫిర్యాదులు

**విజయవాడ కార్పొరేషన్,జూలై 13,ప్రభాతవార్త**

సోమవారం కమాండ్ కంట్రోల్ రూంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని ఆయన శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కల్గించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.పురమిత్ర యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాన్నారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్ళించడం కాకుండా,సంబంధిత అధికారులు స్వయంగా స్పందిచి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 19 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు-9,రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా,పబ్లిక్ హెల్త్-2, ఇంజనీరింగ్-5, పిఓయుసిడి-2,రెవిన్యూ-1 ఫిర్యాదులు కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారుల స్వయంగా పరిశీలించి,ప్రజలకు స్పష్టమైన,శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా,సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్లు ఏ.రవీంద్రరావు,డాక్టర్ డి.చంద్రశేఖర్,కె.శకుంత,ఛీఫ్ సిటీ ప్లానర్ సంజయ్‌రత్నకుమార్,చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి,డిప్యూటీ కమీషనర్(రెవిన్యూ)సృజన,పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్,కె.దుష్యంత,అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యన్నారాయణ,ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.హరీష్,బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## మొదటిరోజు ఘనంగా ఓంకారేశ్వరి తిరుణాల మహోత్సవాలు

**అమరావతి, ప్రభాతవార్త**

లింగాపురం గ్రామంలో వెలసిన వరాలు ఇచ్చే అమ్మ ఓంకారేశ్వరి తిరుణాల మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమంలో పాల్గొని పొంగళ్ళు సమర్పించారు.అంతేకాకుండా కూచిపూడి నృత్య ప్రదర్శన, రామాంజనేయ సీను తదితర కార్యక్రమాలు ఓంకారేశ్వర పీఠాధిపతి తోట సీతారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిఠాధిపతులు సీతారామయ్య మాట్లాడుతూనేటి నుండి అమ్మవారి ఊరేగింపు సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రారంభం అవుతుందని మరియు కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ రెండో రోజు కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓంకారేశ్వరి తిరుణాల మహోత్సవాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ఈనెల 15వ తేదీ గర్భగుడి ప్రవేశం మరియు భక్తులందరితో అభిషేకం చేయబడుతుందని తెలిపారు. మొదటిరోజు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పీఠాధిపతులు సీతారామయ్య స్వయంగా భక్తులకు ఆహారం తన చేతులతో వడ్డించారు. ఈ కార్యక్రమంలో బలుసుపాడు సీనియర్ నాయకులు బచ్చు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ క్యాంపులను సద్వినియోగించుకోవాలి

కొల్లిపర,జూలై 12 ప్రభాతవార్త: మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి నేహ అన్నారు.సోమవారం మండల పరిధిలోని కొల్లిపరలో వైద్యాధికారులు సంచార చికిత్స కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నేహ మాట్లాడుతూ గర్భిణీలు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ కళ్యాణి,ఎఎన్ఎం అనిత,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కలసికట్టుగా పనిచేద్దాం...గ్రామాలను అభివృద్ధి చేద్దాం

కొల్లిపర,జూలై 12 ప్రభాతవార్త: ప్రజా ప్రతినిధులు..అధికారులు అందరూ కలసికట్టుగా పనిచేసుకుంటూ...గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి శాఖల వారీగా సమీక్ష జరిపారు.పలు సమస్యలను ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నిర్ణీత సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు.ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ మాట్లాడుతూ సర్ ప్రక్రియ నిర్ణీత సమయంలో పూర్తి చేయటానికి అధికారులు కృషి చేయాలన్నారు.అంతేగాకుండా గ్రామాల్లో జరుగనున్న భూసర్వే కు రైతులు సహకరించాలన్నారు.సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు,పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,ఈవోపిఆర్‌డి భార్గవ్,మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖాధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## మరో ఉద్దానంలా కిడ్నీ మరణాలతో ఎ కొండూరు మండలం

- వెస్ట్ మాధవరంలో కిడ్నీ రోగి నాగలక్ష్మి మృతి

**ఎ కొండూరు, జులై 13, ప్రభాతవార్త :**



ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో మూత్రపిండాల వ్యాధి సోకి గత 15సంవత్సరాల పైగా వందలాది మంది కిడ్నీ రోగులతో మరణమృదంగం మోగిస్తూ శ్రీకాకుళం జిల్లా మరో ఉద్దానంలా మారుతున్నా గత పాలకులుగాని ప్రస్తుత కూటమి పాలకులు గాని ఈ వ్యాధి శాశ్వత నివారణకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని కిడ్నీ ప్రభావిత గిరిజన లంబాడా తండా గ్రామాల ప్రజలు ఆక్షేపించారు. ఈ వ్యాధి వల్ల మండలంలో వెస్ట్ మాధవరం గ్రామానికి చెందిన కుక్కల నాగలక్ష్మి గత 10 సంవత్సరాలుగా చికిత్సపొందుతూ 50శెంట్ల భూమిని సైతం అమ్ముకుని వైద్యం పొందినా ప్రాణాలు దక్కలేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ మండలంలో కిడ్నీ వ్యాధి మహమ్మారి వల్ల ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న వైనాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.50కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా కృష్ణా శుద్ధి జలాలు అందిస్తున్నా ప్రాణాలు ఏ మాత్రం నిలవడం లేదని బాధిత దళిత గిరిజన ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ మండలంలో కిడ్నీ ఆసుపత్రి, కిడ్నీ డాక్టర్ రోగులకు అంబులెన్స్ సౌకర్యం పౌష్టికాహారం సరిపడ మందులు అందుబాటులోకి తేవాలని పలువురు కిడ్నీ బాధితులు కిడ్నీ ప్రభావిత తండా గ్రామాల ప్రజలు సిఎం చంద్రబాబుకు డిసిఎం పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్రమంత్రి నారాలోకేష్ బాబుకు రెండు చేతులు జోడించి బాధితులు వేడుకుంటున్నారు.

## స్వాధీనపరచుకున్న ట్రాక్టర్లతో పోలీసులు

అక్రమ ఇసుక రవాణా డ్రైవర్లు అరెస్ట్ ట్రాక్టర్లు స్వాధీనం

**తిరువూరు, జులై 13, ప్రభాతవార్త :**

తిరువూరు పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. కె.రాజుకి అందిన విశ్వసనీయ సమాచారంతో కొకిలంపాడు గ్రామ శివారులోని కట్టలేరు కాలువ డ్యామ్ వద్ద పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తెలంగాణ రాష్ట్రంలోని సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. దాడి సందర్భంగా టిజి04టి2187 నంబరు గల ట్రాక్టర్‌ను నడుపుతున్న మర్లకుంట గ్రామం కల్లూరు మండలం ఖమ్మం జిల్లాకు చెందిన జొన్నలగడ్డ వీరస్వామి (42)ను మరియు ఎపి16ఎఫ్‌జి2752 నంబరు గల ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎల్.ఎస్. బంజర్ గ్రామం పెనుబల్లి మండలం ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్.కె.మహబూబ్ అలీ(55)ను అదుపులోకి తీసుకుని విచారించగా ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇసుకను ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రంలోని సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నట్లు అంగీకరించారు. పోలీసుల పరిశీలనలో రెండు ట్రాక్టర్ల ట్రాలీలలో పూర్తిగా ఇసుక లోడ్ చేసి ఉండటం ఇసుక రవాణాకు అవసరమైన ఎటువంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకపోవడం నిర్ధారణ కావడంతో, ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేసి, రెండు ట్రాక్టర్లు మరియు ఇసుకను స్వాధీనం చేసుకుని సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టడం జరిగింది. ఆ క్రమంలోప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా నిల్వ లేదా విక్రయం చేయడం చట్టరీత్యా నేరం. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించగలరని తిరువూరు పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. కె.రాజు విజ్ఞప్తి చేశారు.





# సింగరాయకొండలో మంత్రుల పర్యటన

- రూ.68 లక్షలతో నిర్మించిన ఎస్టి కాలనీ సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రులు ఎస్. సవిత, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి
- ఎస్టీ కాలనీ తాగునీటి పైప్‌లైన్‌కు శంకుస్థాపన

బీసీ గురుకుల పాఠశాలకు స్థల పరిశీలన రూ.45 కోట్లు మంజూరు

వరాహ లక్ష్మీ నరసింహస్వామి దర్శనం





**సింగరాయకొండ, జూలై 13, ప్రభాతవార్త**

పాత సింగరాయకొండలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సోమవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.68 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రులు, రూ.12 లక్షలతో ఎస్టీ కాలనీలో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రతిపాదిత బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల స్థలాన్ని పరిశీలించారు. అంతకుముందు పాత సింగరాయకొండలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారిని మంత్రులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం కమిటీ సభ్యులు, అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గంలో సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన సింగరాయకొండ బీసీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి మళ్లీ రూ.45 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సింగరాయకొండ బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు చేసి, తొలి విడతగా రూ.20 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. నాణ్యమైన విద్య అందించేందుకు గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఏపీ జి.బి డైరెక్టర్ వేల్పుల సింగయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్‌ను త్వరగా పూర్తి చేయాలి



**తాళ్లూరు,జూలై 13, ప్రభాతవార్త**

మండలంలో జరుగుతున్నఎన్యుమరేషన్(సర్) ప్రక్రియను 14 (నేడు ) తేదిలోగా పూర్తి చేయాలని తహసీల్దార్ బచ్చుల వెంకట రమణారావు బీఎల్ వోలను ఆదేశించారు. మండలంలోని బొద్దికూరపాడు లో జరుగుతున్న ఎన్యుమరేషన్ ను సోమవారం అయన పరిశీలించారు. ఓటర్లు ఇచ్చిన పత్రాలను అయన పరిశీలించారు. ప్రతిఒక్కరూ గడువులోగా ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని, ఇప్పటివరకు ఎన్ని పూర్తిచేశారు, ఎంత పూర్తిచేయాలని బీ ఎల్ వో లను ప్రశ్నించారు. సర్‌కు కాల పరిమితి ఒక రోజు మాత్రమే ఉన్నందున ఫారాల స్వీకరణలో జాప్యం చేయరాదని తెలిపారు.గ్రామంలో లేనివారు, మరణించిన వారి ఓట్లను తప్పనిసరిగా తొలగించాలని ఆదేశించారు. పార్టీలకు అతీతంగా బీఎల్ వోలు ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని తహసీల్దార్ ఆదేశించారు.కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, కంప్యూటర్ ఆపరేటర్ చందు,బీఎల్ వోలు పాల్గొన్నారు.

# లోవోల్టేజీ సమస్య లేకుండా చేయాలి



**తాళ్లూరు,జూలై 13,ప్రభాత వార్త**

గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యలేకుండా చూడటంతో పాటు వ్యవసాయ, గృహ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించాలని దర్శి డివిజన్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం తాళ్లూరు లోని సబ్ స్టేషన్ లో లైన్ మెన్లు,జూనియర్ లైన్ మెన్ల తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ప్రతిరోజు గ్రామాలను సందర్శించి విద్యుత్ వినియోగ దారుల సమస్యలను తెలుసుకోవాలన్నారు. నిరక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. మండలంలో పెండింగ్ బకాయిలను స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూళ్లు చేయాలన్నారు. సమావేశంలో ఏఈ ఎం. రామకృష్ణారెడ్డి, లైన్ ఇన్ స్పెక్టర్ వీవీఎస్ కాంతారావు,లైన్ మెన్ రామా నాయక్,జూనియర్ లైన్ మెన్లు,సిబ్బంది బిజ్జం జనార్దన్ రెడ్డి,పసుపులేటి మణికంఠ,తదితరులు పాల్గొన్నారు.


# మధుమేహం కోసం ప్రత్యేక చికిత్సా ప్రణాళిక




**ఒంగోలు కల్చరల్,జూలై 13,ప్రభాతవార్త**

కేరళ ఆయుర్వేద హాస్పిటల్లో మధుమేహం (డయాబెటిస్) మరియు దాని వల్ల వచ్చే సమస్యలను నియంత్రించేందుకు ప్రత్యేక చికిత్సా ప్రణాళికను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేరళకు చెందిన డా. మనోజ్ ఎస్. పనిక్కర్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయనను సంప్రదించడానికి 9398069742 మొదట నాడీ పరీక్ష (Nadi Pariksha) ద్వారా మీ ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో ఉన్న లోపాలను గుర్తిస్తారు. అనంతరం తక్కువ మందులతో పాటు సరైన ఆహారం మరియు జీవనశైలి మార్పులను సూచిస్తారు. యోగ, ఆయుర్వేదం, సమతుల్య ఆహారాన్ని సమన్వయం చేసిన ప్రత్యేక చికిత్సా విధానం ద్వారా అనేక మంది తమ మధుమేహాన్ని తక్కువ సమయంలోనే నియంత్రణలోకి తెచ్చుకున్నారని ఆసుపత్రి పేర్కొంటోంది. అదనంగా, అర్హత కలిగిన డైటీషియన్ నుంచి ప్రతిరోజూ ఆహార సలహాలు కూడా అందుబాటులో ఉంటాయి.

# యారవ వెంకటరెడ్డి భౌతికకాయానికి దద్దాల నివాళి



**హనుమంతునిపాడు, జులై 13, ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ కిచ్చంపల్లికి చెందిన పార్టీ గ్రామ రైతు విభాగం సెక్రటరీ యారవ వెంకటరెడ్డి అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న కనిగిరి నియోజక వర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం ఉదయం మండల పార్టీ శ్రేణులతో కలిసి వెంకటరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. యారవ వెంకటరెడ్డి పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయం బలరామిరెడ్డి, యక్కంటి శ్రీనివాసులురెడ్డి, వేసుపోగు గురు ప్రసాద్, కస్తాల బాలాజీ, గుంటక రమణారెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, గొబ్బిళ్ళ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ కొండారెడ్డి, వణుకూరి రామిరెడ్డి, కోలా గురవయ్య, తిరుపతయ్య, ఇట్టెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పొదిలి బ్రహ్మంగారి గుడి స్థలం ఆక్రమించారని పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు

- గుడికి భక్తులు పోయే దారి లేదు



**పొదిలి, జులై 13, ప్రభాతవార్త**

పొదిలి పట్టణంలోని శివాలయం వద్ద ఉన్న బ్రహ్మంగారి గుడి స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించారని పీజీఆర్‌ఎస్‌లో మార్కాపురం జిల్లా కలెక్టర్‌కు పొదిలికి చెందిన ఆకుపాటి లక్ష్మణ అనే భక్తుడు సోమవారం పీజీఆర్‌ఎస్ లో ఫిర్యాదు చేశారు. భక్తులు స్వామివారి దర్శనం చేసుకునేందుకు కూడా వీలు లేకుండా ఆక్రమించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక అధికారులకు పలు సార్లు ఫిర్యాదులు చేసిన ఎవ్వరు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కాళ్లు పట్టుకుంటామన్న కనికరించడం లేదని దాదాపు 15 కోట్ల రూపాయల విలువైన ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి బ్రహ్మంగారి గుడికి సంబంధించిన కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని భూ కబ్జాదారుల నుండి విడిపించాలని ఆయన కోరారు.

# కూటమి పాలనలో ఆక్వా రంగం సంక్షోభం : పీటా నాగమోహన్‌కృష్ణ



**రేపల్లె, జూలై 13, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం అసమర్థత కారణంగా ఆక్వా రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ తీవ్రంగా విమర్శించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతుల కష్టాలను తెలుసుకుని అండగా నిలిచేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 15వ తేదీ భీమవరంలో పర్యటిస్తారని తెలిపారు. రేపల్లె తీర ప్రాంతంలోని ఆక్వా రైతులు భీమవరంకు తరలిరావాలని ఆయన కోరారు. కోస్టల్ కారిడార్‌లో ఆక్వా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రేపల్లె నియోజకవర్గంలో 40 వేల ఎకరాలలో ఆక్వా సాగవుతుంటే లక్ష మంది ఉపాధి పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేనందున ఆర్థిక సంక్షోభం పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత వైకాపా పాలనలో జగన్మోహన్‌రెడ్డి రూ.450 కోట్లతో ఆక్వా పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే నేటి కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయడంలేదన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆక్వా రైతుల సంక్షేమాన్ని నెరవేరుస్తామని ఆయన స్పష్టం చేశారు. హార్బర్ అభివృద్ధి పనులను నిలిపివేశారని ఆయన ఆరోపించారు. అభివృద్ధిపై మంత్రి దృష్టి కేంద్రీకరించకపోవడం శోచనీయమన్నారు. రేపల్లె నియోజకవర్గం అభివృద్ధి జగన్ పాలనలోనే జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఆక్వా రైతులకు జగన్ మద్దతు ప్రకటించారని తెలిపారు. ఆక్వా రంగంలో వినియోగించే ఫీడ్‌కు సంబంధించి టన్నుకు రూ.20 వేలు పెరిగిందని చెప్పారు. విద్యుత్ సబ్సిడి ఇవ్వడం లేదన్నారు. దళారీ వ్యవస్థదే అగ్రభాగమైందన్నారు. రేపల్లె నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత పెరిగిందన్నారు. కూటమి పాలకుల పనితీరు ఎలా ఉందంటే వారిలో వారు పరామర్శలతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు. మత్స్యకారులు బోటులో వెళ్ళి మృతి చెందితే వారిని పరామర్శించే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదన్నారు. విపత్తు జరిగితే వెంటనే స్పందించే వాడినే నాయకుడు అని అంటారని తెలిపారు. అటువంటి నాయకుడుగా జగన్మోహన్‌రెడ్డిని చూశారంటే కుల, మత, రాజకీయ పార్టీలక తీతంగా సమస్యలను పరిష్కరించడమేనని ఆయన చెప్పారు. జగన్ పాలనా విధానం ప్రజలకు తెలుసునన్నారు. ఎటువంటి పథకాలైనా ఇంటి వద్దకే చేరేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. జగన్ పాలనలో రెండేళ్ళు కోవిడ్ పరిస్థితుల పట్ల ప్రజలకు ఏ విధంగా మేలు జరిగిందో గుర్తు చేసుకోవాలన్నారు. అదే కూటమి పాలనలో కోవిడ్ పరిస్థితులు తలెత్తితే ప్రజల ప్రాణాలకే రక్షణ ఉండదనేది వాస్తవమన్నారు. విశాఖపట్నం, భీమవరంలలో జగన్ పర్యటనలో భారీగా ప్రజలు హాజరుకానున్నారని శేషు చెప్పారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం వందలకోట్ల రూపాయలతో శంకుస్థాపనలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. కూటమి పార్టీలు బూడిదపార్టీల మాదిరిగా తయారయ్యాయన్నారు. సమస్యల వినతి పత్రాలు అందజేయాలంటే మహిళలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర ్పడిందన్నారు. జగన్ పాలనలో వాలంటరీ వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందాయని ఆయన వివరించారు. ప్రజలను గాలికొదిలి వాటాలు వేసుకొంటున్నారని ఆయన ఆరోపించారు. కూటమి పాలకులు జగన్‌పై బురదజల్లే కుటిల ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజధానిలో ఫ్లైఓవర్, మెడికల్ కళాశాలల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినజగన్ ఎటువంటి భూకబ్జాకు పాల్పడలేదని ఆయన పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల విధివిధానాలకు జగన్మోహన్‌రెడ్డి మాత్రమే మార్గదర్శకుడని తెలిపారు. బ్రిటీష్ ప్రభుత్వం తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే భూ సర్వే కార్యక్రమాలను నిర్వహించారని చెప్పారు. దళారీ వ్యవస్థ పారిపోయిందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దళారీ వ్యవస్థ రంగప్రవేశం చేసిందని శేషు వివరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, కరేటి శేషగిరిరావు, చిమటా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేక్షకులను కట్టిపడేసిన కథక్ నృత్య ప్రదర్శన

- సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంస్థ




**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త**

ప్రతిమాసం వాణీ దరహాసం సాహిత్య సాంస్కృతిక సంస్థ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. అందులో భాగంగా భువన విజయ కార్యక్రమాలు, అష్టావధాన కార్యక్రమాలు, భారతీయ నృత్యరీతుల ప్రదర్శన, పలు ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తూ అడుగంటిపోతున్న కళలకు ఊతమిస్తూ ముందుకు సాగుతుండడం అభినందించదగ్గ విషయం. హైదరాబాద్‌కు చెందిన పార్కో స్కూల్ ఆఫ్ పర్ఫామింగ్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కథక్ నృత్య ప్రదర్శన ఆహుతులను కట్టిపడేసింది. స్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సాయి జీవన ఆధ్వర్యంలో కిషన్, పి. రితిక, టి. సర్గ ప్రదర్శించి ప్రదర్శనలు ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మన భారతీయ సంస్కృతిలో ప్రతి శుభకార్యం శ్రీ మహాగణాధిపతి స్మరణతోనే ప్రారంభమవుతుంది. విఘ్నాలు తొలగించి బుద్ధి, విజయాన్ని ప్రసాదించే వినాయకుని ఆశీస్సులను కోరుకొంటూ చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకొంది. విఘ్నేశ్వరుని అనుగ్రహం తర్వాత విద్య, జ్ఞానంలకు ఆది దేవత అయిన శ్రీ సరస్వతీ దేవిని స్తుతిస్తూ చేసిన నృత్య ప్రదర్శన సరస్వతీదేవి ప్రత్యక్షమైనట్లు అనిపించింది. ఆది పరాశక్తి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం ధరించిన దివ్య రూపాలను ప్రదర్శనలో దర్శింపచేశారు. లతామంగేష్కర్ మధురమైన గానంలో స్వరపరచబడిన శ్రీరాముని దివ్య గుణాలతో పాటు శబరి భక్తిని, రామసేతు, రావణ సంహారం తదితర ఘట్టాలను కథక్ నృత్య ప్రదర్శనలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింపచేశారు. బృందావనంలో వసంత రుతువు ఆనందం, రాధాకృష్ణుల మధుర లీలలు నృత్యంలో దర్శింపచేసి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు. శ్రీకృష్ణుని కాళీయ సర్పమును నిగ్రహించిన దివ్య ఘట్టాన్ని భావపూర్వకంగా ప్రదర్శించారు. కథక్ యొక్క స్వచ్ఛమైన నృత్య సౌందర్యాన్ని ప్రదర్శించారు. పరమశివుని మహిమ, భక్తి, తాండవ వైభవాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకర్షించారు. కళ అనేది కేవలం ఒక ప్రదర్శన కాదు. మన సంస్కృతి, సంప్రదాయ విలువలను తరువాత తరాలకు చేరవేసే ఒక పవిత్రమైన మార్గమని డాక్టర్ సాయి జీవన చెప్పారు. అనంతరం కళాకారులను సంస్థ పక్షాన దుశ్శాలువా, బొకే, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు కొలను మంగనాథరావు, అధ్యక్షుడు నాగలింగం హరిహరపంత్, ముఖ్య సలహాదారు పివిఎస్ఎస్‌వి ప్రసాద్, కన్వీనర్ ఎం.కృష్ణకిషోర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్‌లో సందడి చేసిన శ్రీనివాస మంగాపురం సినిమా యూనిట్



**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త**

చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సోమవారం సినీ సందడితో కళకళలాడింది. ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకు రానున్న శ్రీనివాస మంగాపురం హీరో జయకృష్ణ ఘట్టమనేని, హీరోయిన్ రషా తడాని యూనివర్సిటీని సందర్శించి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. హీరో జయకృష్ణ ఘట్టమనేని మాట్లాడుతూ తన తొలి చిత్రం శ్రీనివాస మంగాపురం ద్వారా ప్రేక్షకుల ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో కనిపిస్తున్న ఉత్సాహం తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నారు. సినిమా రంగంలో అవకాశాల కంటే ప్రతిభ, కష్టపడి పనిచేసే తత్వమే విజయానికి మూలమన్నారు. సినీ ప్రయాణం, చిత్రీకరణ అనుభవాలు, నటనలో ఎదురైన సవాళ్ళు, క్రమశిక్షణ, అంకితభావం గురించి విద్యార్థులతో పంచుకున్నారు. ఏ రంగంలోనైనా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో శ్రమిస్తే విజయాన్ని సాధించవచ్చన్నారు. హీరోయిన్ రషా తడాని మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకుల ప్రేమాభిమానాలు తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో తన తొలి చిత్రం కావడం ఎంతో ప్రత్యేకమని, విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థులతో గడిపిన సమయం మరపురానిదన్నారు. దర్శకుడు అజయ్‌భూపతి తెరకెక్కిస్తున్న శ్రీనివాస మంగాపురం చిత్రంలో జయకృష్ణ ఘట్టమనేని హీరోగా, బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రషా తడాని హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమవుతున్నారన్నారు. ప్రముఖ నిర్మాత సి. అశ్వినీదత్ సమర్పణలో జెమిని కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జివి ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్నారన్నారు. చందమామ కథలు పిక్చర్స్, వైజయంతి మూవీస్ బ్యానర్లపై రూపొందిన ఈ చిత్రానికి జయకృష్ణ గుమ్మడి ఛాయాగ్రహం, మాధవ్ కుమార్ గుల్లపల్లి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. మోహన్‌బాబు, నరేష్, బ్రహ్మాజీ, షామ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లు, ప్రచారచిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. అనంతరం హీరో, హీరోయిన్‌లు విద్యార్థులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

# సంఘీయులు మరిన్ని అవార్డులు పొందాలి

- పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షులు, జివి.రామకృష్ణ




**తెనాలి మున్సిపాలిటీ జులై13(ప్రభాతవార్త)**

పద్మశాలి సంఘాలు వివిధ రంగాలలో ఉన్నత శిఖరాలు అధిరోహించడంతోపాటు మరెన్నో అవార్డులు పొందాలని పద్మశాలీయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జివి.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని సంఘ కార్యాలయంలో, ఆదివారం పద్మశాలిఎంప్లాయిస్ వెల్ఫేర్ అస్సోసియేషన్, తెనాలి. పట్టణశాఖ ఆధ్వర్యంలో . వెలగా వెంకటప్పయ్య స్మారక అవార్డు గ్రహీత తెనాలి మానవత సంస్థకు నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కటకం వెంకట ప్రసాద్ ,జూన్ నెలలో ఉద్యోగ విరమణ చేసిన పట్టెం శ్రీలక్ష్మి, మాచర్ల లీలా శ్రీనివాస్ మూర్తి,ఆకురాతి హరి వర ప్రసాద్ తదితరులకు సన్మాన కార్యక్రమము ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెనాలి పట్టణ పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరువీధుల నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జివి. శివరామకృష్ణ మరో అతిధి మాచర్ల నాగేశ్వరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జివి. శివరామకృష్ణ మాట్లాడుతూ, ఓంకార్ ప్రసాద్ చిన్ననాటి నుండి ఎన్నో కష్టాలను ఇబ్బందులను తట్టుకొని నేడు సమాజంలో ఒక గుర్తింపు స్థానం ఓంకార్ గ్రాఫిక్స్ పొందటం, మరియు మానవతా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అవార్డులతో పాటు అందరి మన్ననలను పొందడం జరిగిందని ఈ విధంగా ఇంకా ఎన్నో అవార్డులు పొందుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొవాలని అభినందించారూ. 30 సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతోమంది విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించి వారి ఉన్నతికి తోడ్పడిన పట్టెం శ్రీలక్ష్మి, మాచర్ల లీలా శ్రీనివాస్ మూర్తి, ఆకురాతి హరి వరప్రసాద్ వీరి సేవలు విద్యా వ్యవస్థలో మరువలేవని అన్నారు. తెనాలి పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట సుబ్బారావు సన్మాన గ్రహీతలకు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ ఉపాధ్యక్షులు అందె బాలచంద్రమోళి , కౌతరపు శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శి పడవల శివయ్య ,, జి.సుబ్బారావు, ఎం.వి.ప్రసాద్, అవ్వారు అనురాధ , కందుల శ్రీనివాసరావు, కె. నాగమల్లేశ్వరరావు, డి నాగేశ్వరరావు, టి.యల్.మోహన్, ఆరికాటి బాలసుబ్రమణ్యం, జె శ్రీనివాసరావు, మాచర్ల వరప్రసాద్, కె. నారాయణరావు ,కె.రామచంద్రరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. సన్మాన గ్రహీత అయిన కటకం వెంకటప్రసాద్ మాట్లాడుతూ, సన్మానం పొందటం చాలా ఆనందంగా ఉందని, సన్మానం పొందటం ద్వారా ఇంకా బాధ్యతలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతల యొక్క కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

# బిజెపి కార్యాలయంలో జనతా వారిది కార్యక్రమం



**మంగళగిరి, జూలై 13, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సోమవారం జనతా వారది కార్యక్రమం నిర్వహించారు. జనతా వారదీ కార్యక్రమం ప్రజల యొక్క సమస్యలకు అధికారుల వద్ద నుంచి పరిష్కారం కొరకు భారతీయ జనతా పార్టీ వారధి లాగా పని చేస్తుందని ప్రజలందరూ జనతా వారధి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు నలుగురు మహిళలు తమకు ఇల్లు లేదా ఇంటి స్థలానికి కొరకు అర్జీ రాగా ఎం టి ఎం సి కమిషనర్ ఆలిం భాషాకి అర్జీ అందించడం జరిగింది . ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పిల్లి నాగేశ్వరరావు, పట్టణ కోశాధికారి సంగేపు రామ మల్లేశ్వరరావు, ఓబులేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

gnt 7:gnt 7.qxd 7/14/2026 1:43 AM Page 1



## అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి అనగాని




**రేపల్లె, జూలై 13, ప్రభాతవార్త**
వైకాపా మూకల కిరాతకత్వానికి బాల్యంలోనే బలైన వెనుకబడిన తరగతులకు చెందిన అమర్నాథ్ గౌడ్ ఉదంతం అందరి గుండెలను పిండివేసిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.సోమవారం రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాధితుని కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.అమర్నాథ్ గౌడ్ సోదరి హేమశ్రీ ఉన్నత చదువుల బాధ్యతను పూర్తిగా తాను తీసుకుంటానని ప్రకటించారు.అమర్నాథ్ గౌడ్ లేని బాధను భర్తీ చేయలేకపోయినా అతడి సోదరి భవిష్యత్‌కు ఎటువంటి లోటు లేకుండా చూస్తామని చెప్పారు.అమర్నాథ్ గౌడ్ సోదరి హేమశ్రీ బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ ల్యాప్‌టాప్‌ను పంపిణీ చేశారు.

## జై భావదేవ....జైజై భావదేవ నినాదంతో మార్మోగిన దేవాలయం

### - భక్తిశ్రద్ధలతో స్వామివారికి శాంతి కళ్యాణం
### - పెద్ద ఎత్తున హాజరైన భక్తులు



**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త**
జై భావదేవ...జైజై భావదేవ...జై భావదేవ...జైజై భావదేవ అనే భక్తుల నినాదంతో పట్టణంలోని అత్యంత మహిమాన్వితమైన శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి దేవాలయం మార్మోగిపోయింది.భక్తుల కోరిన కోర్కెలను తీర్చే స్వామిగా పేరుగాంచడంతో భక్తులు మొక్కుకొని ఆ మొక్కులు తీరితే స్వామివారి కళ్యాణాలు, ఊంజల్ సేవలు నిర్వహిస్తుంటారు . అందులో భాగంగా డొక్కు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు సోమవారం స్వామివారికి శాంతి కళ్యాణం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా తెప్పించిన వివిధ రకాల గజమాలలతో అలంకరణ చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని మామిడాకుల తోరణాలు,అరటి పిలకలతో పండుగ వాతావరణం ఉట్టిపడేలా అలంకరించారు. యాజ్ఞీకస్వామి ఎన్ఎస్‌కెఆర్ భట్టాచార్యులు (రాంబాబు) నేతృత్వంలో అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణ తదితర అర్చకస్వాములు కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కళ్యాణార్ధం, సకాలంలో వర్షాలు కురియాలని, పుష్కలంగా పంటలు పండాలని, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో తులతూగాలని అర్చకస్వాములు ఆశీర్వచనం చేశారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్ధప్రసాద వినయోగం జరిగింది.భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డొక్కు నవీన్, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి : మంత్రి



**రేపల్లె, జూలై 13, ప్రభాతవార్త**
ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.సోమవారం రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన మాట్లాడుతూ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు.ప్రజా దర్బార్ కార్యక్రమాల వలన ఆశించిన ఫలితాలు లభిస్తున్నాయని అనగాని వెల్లడించారు.కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ప్రజలకు పూర్తి జవాబుదారీగా వ్యవహరిస్తూ ప్రజల మేలు కోరే మంచి ప్రభుత్వమని ఆయన కితాబిచ్చారు.ద్వితీయ శ్రేణి స్థాయి కలిగిన రేపల్లె పురపాలకసంఘానికి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ స్థాయి కల్పించిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను రేపల్లె చైతన్య వేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.రేపల్లె మండలంలోని బడేకాల్వ పరిధిలో 357 ఎకరాలలో బంజరు,పోరంబోకు భూములకు చెందిన తమకు ప్రభుత్వం ఎరువులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ఎం.రామకృష్ణ,రేపల్లె నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కొలసాని రాము,మున్సిపల్ కమీషనర్ కాకర్ల సాంబశివరావు,ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిమాసం వాణీదరహాసం నూతన కార్యవర్గం ఎన్నిక

### - అధ్యక్షుడిగా నాగలింగం హరిహరపంత్

**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త**
ప్రతిమాసం వాణీదరహాసం సాహిత్య సాంస్కృతిక సంస్థ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక బ్రాహ్మణ బజారులోని శ్రీ గాయత్రీ మందిరం-శంకరమఠంలో జరిగింది.ఈ సంస్థ ఏర్పాటై ఏడు మాసాలు అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సంస్థ గౌరవాధ్యక్షుడిగా కొలను మంగనాధరావు, అధ్యక్షుడిగా నాగలింగం హరిహరపంత్, ఉపాధ్యక్షుడిగా సూరా రామారావు, ప్రధాన కార్యదర్శిగా సూరినేని ఆంజనేయులునాయుడు, సంయుక్త కార్యదర్శులుగా బయ్యా ఉదయభాస్కర్, సీఎస్ఆర్కే శర్మ, కోశాధికారిగా ఆముదాలపల్లి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా జానపాటి ప్రసాద్, దేశిరాజు బాలగంగాధరతిలక్, చింతపల్లి రామకృష్ణ, చీమకుర్తి నాగభూషణరావు(అచ్చియ్య), సీతామహాలక్ష్మి, మన్నవ అనసూయాదేవి, పరాశరం శేషకుమారి, వై.పార్వతి, పులిజాల సాంబశివరావు, కోన నరసింహారావు, షేక్ బాజిసాహెబ్, కన్వీనర్‌గా ఎం.కృష్ణకిషోర్, ముఖ్య సలహాదారుగా పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్(ఆడిటర్) ఏకగ్రీవంగా ఎన్నికయా ్యరు. నూతన కార్యవర్గ అధ్యక్షుడు నాగలింగం హరిహరపంత్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో మా బాధ్యత మరింత పెరిగినట్లుగా భావిస్తున్నామన్నారు. ఏ ఉద్దేశంతో అయితే ఈ సంస్థ స్థాపించబడిందో అందుకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ప్రతి నెలా సాహిత్య, సాంస్కృతిక, ఇతర తెలుగు భాషా ప్రక్రియలను నిర్వహించే విధంగా చూస్తామన్నారు. సంస్థ సభ్యులు, ప్రజలు, భాషాభిమానులు, కళాకారులు, స్వర్ణపురి పెద్దలందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. నూతన కార్యవర్గ సభ్యులను పట్టణ ప్రముఖులు, పుర ప్రజలు, వివిధ సంఘాల నాయకులు అభినందించారు.




# తృటిలో తప్పిన బస్సు ప్రమాదం



**రేపల్లె, జూలై 13, ప్రభాతవార్త**
రేపల్లె నుండి విజయవాడ వెళ్ళే పల్లెవెలుగు ఆర్టీసీ బసు ్స సోమవారం పెనుమూడి వద్ద అదుపుతప్పి పంటకాల్వలోకి దూసుకుపోయింది. బస్సులోని 15 మంది ప్రయాణీకులు సురక్షితంగా బయటపడ్డారు.మంచినీటిని చేతి పంపు నుండి సేకరించుకునేందుకు డ్రైవర్ బస్సును పక్కకు నిలిపిన సమసయంలో ఆ ప్రాంతం పల్లంగా ఉండటంతో బస్సు జారుతూ కాల్వలోకి వెళ్ళిపోయింది.

## ఎస్ఐఆర్‌లో అవకతవకలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలి

### - పిజిఆర్ఎస్‌లో అర్జీ అందజేసిన వైకాపా నాయకులు



**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నట్లు మా వద్ద సమాచారం ఉందని, అందుకు బాధ్యులయిన అధికారులపై సమగ్ర విచారణ చేయించి సర్ ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా సాగేవిధంగా చూడాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో అర్జీని అందజేశారు. పట్టణంలో 175వ నెంబరు నుండి 229వకు పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. అదేవిధంగా గ్రామాల్లో 146నుండి 174వరకు, 230నుండి 264వరకు పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు చెప్పారు. ఈ బూత్‌లకు సంబంధించి ఇటీవల కాలంలో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. అందులో మొదటిది అందుబాటులో లేని,నివాసము లేనటువంటి(అన్‌ట్రేస్డ్)ఓటర్లను పూర్తిస్థాయిలో పరిశీలించకుండా నిబంధనలకు విరుద్ధంగా వాటిని ఆన్‌లైన్ చేయుడంలో కొంత మంది బిఎల్వోలు స్థానిక అధికారుల ఒత్తిడి మేరకు వారికి ఇచ్చిన టార్గెట్ అధిగమించేందుకు బిఎల్వోలతో బలవంతంగా సంతకాల సేకరణ జరుగుతున్న వ్యవహారముపై చర్యలు తీసుకొని సదరు ప్రక్రియను నిలిపివేయాలన్నారు. రెండవది భారత ఎన్నికల సంఘం వారి గణన ఫారమును సంబంధిత అధికారులు ప్రతి ఇంటికి తిరిగి ఓటర్లకు అందజేసి, సదరు దరఖాస్తును పూరించడముతో పాటుగా ఓటరు యొక్క ఫోటోను అతికించి వారి యొక్క ఆధార్ జతపరచి తిరిగి సమర్పించిన ధరఖాస్తులను మాత్రమే ఆన్‌లైన్ చేయాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధముగా సంబంధిత చిరునామాలో నివసించని వారి యొక్క దరఖాస్తులను, సక్రమముగా పూరించకుండా, ఫోటోను అతికించకుండా ఇచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అర్జీ అందజేసినవారిలో వైకాపా పట్టణ, మండలాధ్యక్షులు షేక్ నాజర్, చింతలపూడి మురళీకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దక్కుమళ్ళ రవి, పట్టణ బూత్ కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి వాసు తదితరులున్నారు.

# పిజిఆర్ఎస్‌కు 14 అర్జీలు

**రేపల్లె, జూలై 13, ప్రభాతవార్త**
పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు సంబంధించి 14 అర్జీలను అందజేశారు.నిజాంపట్నం,రేపల్లె,వేమూరు,చెరుకుపల్లి మండలాల్లోని ప్రజలు అర్జీలు సమర్పించారు.

## హైర్ బస్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా




**రేపల్లె, జూలై 13, ప్రభాతవార్త**
పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని హైర్ బస్ డ్రైవర్ల వేతనాలను పెంచాలని సోమవారం రేపల్లె ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేశారు.ఈ సందర్భంగా రేపల్లె డిపో మదర్ థెరిస్సా హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ చీరాల,రేపల్లె,బాపట్ల డిపోల పరిధిలోని హైర్ బస్సుల డ్రైవర్లకు జీతాల పెంపుదల చేయాలని,పిఎఫ్,ఇఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో రేపల్లె డిపో కమిటీ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు,డ్రైవర్లు రాజు,వెంకటేశ్వరరావు, సు బ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోలుకోవాలని పూజలు



**పొన్నూరు, జూలై 13,ప్రభాతవార్త**
జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణమైన ఆరోగ్యంతో చికిత్స చేయించుకొని త్వరగా ప్రజల మధ్యకు రావాలని కోరుతూ శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. సోమవారం, చతుర్దశి, అమావాస్య, ఆరుద్ర నక్షత్రం, మహాశివరాత్రి అన్నీ కలిసిన అరుదైన రోజున పంచామృతాలతో శివునికి అభిషేకాలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని రాష్ట్ర ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి కోటా శ్రీనివాసరావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి వల్లంశెట్టి శ్రీధర్, జిల్లా కార్యదర్శి మాదాసు అప్పారావు, పట్టణ ఉపాధ్యక్షుడు యరసాని నాగభూషణం, సభ్యులు సురేష్‌కుమార్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆరాధన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాత శ్రీ

### - అవ్వ గారి మఠంలో 82 వ ఆరాధన మహోత్సవాలు



**పెదనందిపాడు జూలై 13 (ప్రభాతవార్త)**
పెదనందిపాడు మండలంలోని అబ్బినేని గుంట పాలెం లోగల నిమ్మల అవధూత అవ్వగారి మఠంలో. సోమవారం అవ్వ 82వ ఆరాధన మహోత్సవాలు మాతాజీ పోలూరి నాగమ్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గోరిజవోలు గుంట పాలెం. రావిపాడు. గోగులమూడి. ఏబి పాలెం గ్రామాలకు చెందిన భక్త భజన బృందాలు నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం విజయవంతమైనది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు. పద్మావతి.పున్నమరాజు. మాధవరావు.యల్లారెడ్డి. వెంకటేశ్వరరావు. సూర్యనారాయణ తదితరులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో, వెరికోస్ రోగులకు ఉచిత వైద్యశిబిరం



**తెనాలి జులై13(ప్రభాతవార్త)**
రోటరీ క్లబ్ తెనాలి వైకుంటపురం మరియు ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సుశ్రుత ఫౌండేషన్ మరియు ఏషియన్ వాషిక్యులర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో, ఆదివారం ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరం బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా గల ఈ కన్వెన్షన్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారుగా 100 పైగా వెరికోస్ సమస్యలు ఉన్నవారు టెస్టులు చేయించుకున్నారు. ఈ టెస్ట్ సుమారుగా 5000/ రూపాయలు అది ఉచితముగా చేయబడింది. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు గుమ్మడి సరోజ్ బాబు(ప్రసాద్) కార్యదర్శి కొల్లి రాజేంద్రప్రసాద్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఈదర వెంకట పూర్ణ చంద్, ఏషియన్ హాస్పిటల్ డాక్టర్అనుష, డాక్టర్ స్వాతి, కోఆర్డినేటర్ సిల్పుంజి మధు, కార్యదర్శి ఈదర శ్రీనివాసరావు,ట్రెజరర్ జాస్తి నరేంద్ర, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బత్తుల వెంకటేశ్వరరావు (బుజ్జి) ఇమిడియట్ ఫాస్ట్ ప్రెసిడెంట్ నల్లూరి వెంకటేశ్వరరావు, డిస్టిక్ క్యాబినెట్ కన్నిగంటి మురళీకృష్ణ, సెక్రటరీ ఎలెక్ట్ మల్లాది అర్జున్ , ఉన్నవ సూర్యనారాయణ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల ధర్నా, పోస్టర్ ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు



**తెనాలి మున్సిపాలిటీ జులై13(ప్రభాతవార్త)**
దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలంటూ, సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యగుల ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు ."చలో విజయవాడ జులై15సీఎండీ,ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా"పోస్టర్ విడుదల యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ మరియు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చినరావూరు 33/11 కేవీ సుబస్టేషన్ వద్ద పోస్టర్ విడుదల చేశారు. యూనియన్ నాయకులు దాసరి వెంకటేశ్వర రావు,ఎస్. నాగరాజు,షేక్ మహబూబ్, ఎం.శ్రీనివాసరావు,బి.వెంకటేశ్వరరావు ,పి.ఫణి కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంను వుద్దేశించి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కే.బాబు ప్రసాద్ మాట్లాడుతూ,జులై 15,వ తేదీన విద్యుత్ ఉద్యోగుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో,దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న తమ డిమాండ్ల సాధనకు ఏపీసీపీ డీసీల్,సీఎండీ కార్యాలయం విజయవాడలో ధర్నా చేయుటకు నిర్ణయించారు అని చెప్పారు.పలుమార్లు తమ కోర్కెలు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు అని చెప్పారు.వారి నుంచి యెటువంటి స్పందన లేనందున సీఎండీ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు.తమ డిమాండ్లలో మొదటిది థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలని, ప్రైవేటీకరణ విధానాలు విరమించుకోవాలని విద్యుత్ సుబ్స్టేషన్‌లలో పనిచేస్తున్న ఆపరేటర్ లను రెగ్యులర్ చేయాలని, పెర్మనెంట్ కార్మికులకు పే కమిషన్ వేయాలని, వారి బకాయి డిఏ లు చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, కంప్యూటర్ ఆపరేటర్ లకు, బిల్ కలెక్టర్ లకు మీటర్ రీడర్ లకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని అర్హులైన వారికి ప్రమోషన్ లు కల్పించాలని, ఇన్సూరెన్సు మొత్తం ను పెంచాలని కోరుతూ ధర్నా చేపట్టనున్నారని ,తెలియజేశారు.

# మున్సిపల్ కార్యాలయానికి 3 అర్జీలు



**తెనాలి మున్సిపాలిటీ జులై13(ప్రభాతవార్త)**
రాష్ట్రప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (గ్రీవెన్స్) మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు.ప్రధానంగా ఇంజనీరింగ్ సెక్షన్ కు సంబంధించి,జెట్టి శివ శంకర మల్లికార్జునరావు మున్సిపల్ కుళాయి నీరు రావటం లేదని వచ్చిన ఆర్జీ,రాయపాటి శ్రీనివాసరావు మార్కింగ్ చేసిన పని,అదే విధంగా రెవెన్యూ సెక్షన్ కు సంబంధించి,కొడాలి పాములమ్మ తన ఇంటి పన్ను రశీదు నందు డోర్ నెం. సరి చేయుటకు తెలియజేసిన ఆర్జీ.ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఆయుర్వేద వైద్యశిబిరం



**తెనాలి మున్సిపాలిటీ జులై13(ప్రభాతవార్త)**
పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ఆయుష్ శాఖ ఆయుర్వేద వైద్యులు విచ్చేసి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంగం జాగర్లమూడి తూములూరు ఆయుర్వేద వైద్యశాలల వైద్యులు డాక్టర్. జి .హిమబిందు డాక్టర్ ఆర్.అర్చన సిబ్బంది విచ్చేసి రోగులను పరీక్షించి ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పురపాలక సంఘ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు తదితరులు సందర్శించి ఆయుర్వేద మందులను గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ అర్చన లు మాట్లాడుతూ,మనదేశంలో ఆయుర్వేద వైద్యం పురాతన కాలం నుండి కొనసాగుతుందని అన్నారు. ఈ రోజు 113 మది నీ పరీక్షించి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆయుర్వేద మందులతో సైడ్ ఎఫెక్ట్స్ లేకపోవడంతో పాటు మంచి ఫలితాలను ఇస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది కె ఎస్ అరుణ కృష్ణ, బి.రమాదేవి, టి. ఆనంద్ కుమార్, కె. మురళి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

14 -7Pg9th cheli_14 -7Pg9th cheli.qxd 14/Jul/26 12:41 AM Page 1



# అన్నీ షేరింగ్‌కు కుదరవు



ఆపాదమస్తకం అందంగా మెరిసిపోవాలని అందరికీ ఉంటుంది. అందుకోసం మేకప్‌ను కూడా ఆశ్రయిస్తూ ఉంటాం. ఈ క్రమంలో కొందరు మేకప్ ఉత్పత్తులు అందులో ఉపయోగించే బ్రష్‌లను సైతం ఇతరులతో పంచు కొంటూ ఉంటారు. మీరూ అంతేనా? అయితే జాగ్రత్త! అలా చేయడం వల్ల చర్మానికి హాని కలిగే అవకాశాలు చాలానే ఉన్నాయంటున్నారు నిపుణులు. మరి, సౌందర్య సంరక్షణలో భాగంగా ఏయే ఉత్పత్తులను ఇతరులతో పంచుకోకూడదో తెలుసుకుందామా.. స్నేహితులు లేదా బంధువుల్లో ఎవరివైనా లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్/ మేకప్ బ్రష్.. ఇలా ఏది కనిపించకపోయినా వెంటనే పక్కనున్న వాళ్లు ఇదిగో.. నాది తీసుకో అంటూ అందించడం లేదంటే మనమే వాళ్లను అడగడం సర్వసాధారణమే. అయితే ఆ క్షణానికి అందంగా కనిపించడానికి అది ఉపయోగపడినా ముందు ముందు మాత్రం సౌందర్యపరంగా చాలా నష్టాలే ఎదుర్కోవాల్సి రావచ్చు. అందుకే సౌందర్య సంరక్షణలో భాగంగా కొన్ని ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.

మేకప్ వేసుకోవడానికి ఉపయోగించే బ్రష్‌లను కూడా ఇతరులతో పంచుకోకూడదు. ఇతరులు వాటిని ఉపయోగించినప్పుడు వారి చర్మం మీద ఉండే బ్యాక్టీరియా, క్రిములు వంటివి మేకప్ ఉత్పత్తుల్లోకే కాదు. వాటిని తిరిగి మనం ఉపయోగించినప్పుడు మన చర్మం మీదకు కూడా చేరతాయి. కాబట్టి మేకప్ వేసుకోవ డానికి ఉపయోగించే బ్రష్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతరులతో పంచు కోకుండా ఉండడం మంచిది. లిక్విడ్ ఫౌండేషన్, లిక్విడ్ ఐ లైనర్, క్రీమ్ రూపంలో ఉండే ఉత్పత్తులు, నెయిల్‌పాలిష్, హెయిర్ బ్రష్‌లు, క్లెన్సింగ్‌కి ఉపయోగించే స్పాంజ్‌లు మేకప్ వేసుకోవడానికి వాడే పఫ్‌లు, ఐ లాష్ కర్లర్, ట్వీజర్స్, ప్లక్కర్స్, లిప్‌బామ్, స్నానానికి ఉపయోగించే ఉత్పత్తులు, సాధనాలు.. మొదలై నవన్నీ ఇతరులతో పంచుకోకుండా ఉండడం మంచిది.

**పౌడర్ రూపంలో ఉంటే...** మేకప్‌లో ఉపయోగించే ఫౌండేషన్, ఐ షాడో.. వంటివి కొన్ని పౌడర్ రూపంలో కూడా ఉంటాయి. అయితే వీటిని ఒకరి కంటే ఎక్కువమంది చేతితో తాకినా లేదా బ్రష్‌తో అప్లై చేసుకున్నా అందులో బ్యాక్టీరియా చేరే అవకాశాలు ఎక్కువ. ఫలితంగా మొటిమలు రావడం, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు దరిచేరడం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి పౌడర్ రూపంలో ఉన్న ఉత్పత్తులను ఇతరులతో అస్సలు పంచుకోకూడదు.

**లిప్‌స్టిక్/లిప్‌గ్లాస్:..** చాలామంది రంగు బాగుందనో లేక మంచి లుక్ ఇస్తుందనో ఇతరుల లిప్‌స్టిక్/ లిప్‌గ్లాస్ ఉపయోగిస్తూఉంటారు. అయితే ఇతరులవి మనం ఉపయోగించడం వల్ల వాటిపై ఉన్న బ్యాక్టీరియా మన అధరాల పైకి చేరే అవకాశాలు లేకపోలేవు. అలాగే మన అధరాలపై ఉన్న తేమలో ఉండే బ్యాక్టీరియా కూడా వాటికి తోడై పెదాలకు హాని కలిగించవచ్చు. కాబట్టి ఇవి కూడా ఎవరివి వారూ ఉపయోగించుకోవడం శ్రేయస్కరం.

**కళ్ల సంబంధిత ఉత్పత్తులు...** ఐ షాడో, మస్కారా, ఐ లైనర్.. వంటి ఐ మేకప్ ఉత్పత్తులను చాలా జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇతరుల ఐ మేకప్ ఉత్పత్తులు ఉపయోగించేటప్పుడు వారికి ఏమైనా కళ్ల సంబంధిత ఇన్ఫెక్షన్లు ఉంటే అవి మనకు కూడా వచ్చే అవకాశాలు లేకపోలేవు. అలాగే ఆ ఉత్పత్తుల్లోని బ్యాక్టీరియా వల్ల కళ్లు ఎర్రబడడం, నీళ్లు కారడం, మండడం..వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి.

**మూతలు ఉండేవి..** కొన్ని రకాల క్రీమ్‌లు, పౌడర్లు మూతలు ఉండే చిన్న చిన్న సీసాల్లో లభ్యమవుతుంటాయి. వీటిని కూడా ఇతరులతో పంచుకోకూడదు. అలా షేర్ చేసుకోవడం వల్ల వారు ఉపయోగించి నప్పుడు వారి చేతుల్లో ఉండే హాని కారక బ్యాక్టీరియా ఈ ఉత్పత్తుల్లోకి చేరుతుంది. అవి మనం వాడడం వల్ల మన చర్మానికి కూడా నష్టం వాటిల్లుతుంది.

**చిట్కా**

రాత్రిపూట దిండుమీద తులసి ఆకులు ఉంచుకొని పడుకుంటే తలలో పేలు మాయమవుతాయి.

# ఇహపరాలు

ఇహపరాలకు సంబంధించిన విషయాలను ప్రస్తావించింది సుపర్ణసూక్తం. సుపర్ణం అంటే రెండు రెక్కలున్న ప్రాణి. కొమ్మపైనున్న రెండు పక్షుల్లో ఒకటి రావిపళ్లు తింటోంది. రెండోది చూస్తోంది. ఒకటి కర్మఫలం అనుభవించే జీవాత్మ. రెండోది కర్మకు తగ్గ ఫలాన్ని నిర్ణయించే పరమాత్మ. సుపర్ణ శబ్దం సూర్యుడికి, గరుతమంతుడికి, జీవాత్మకు సమానం. కర్మసాక్షి అయిన సూర్యుడికి పగలూ రాత్రి.. గరుత్మాంతుడికి శక్తి, భక్తి.. జీవుడికి ప్రాణం. జ్ఞానం రెక్కలతో సమానం. మనిషిలో సూర్యుడిద్వారా ప్రాణశక్తి, గరుడుడికి ద్వారా సూక్ష్మ బుద్ధి ప్రవేశించి జీవాత్మను జీవుడిగా మార్చాయి. అతడిలోని చైతన్యం కర్మలకు పురిగొలిపి కర్మఫలాలను తినిపిస్తుంది. అందుకే అతడు రాగ ద్వేషాలకూ, కష్ట సుఖాలకూ ఆహారమౌతాడు. మనిషి భోక్తాసుపర్ణుడు. స్వార్థం రెక్క విప్పితే సుడిగుండం, త్యాగం రెక్క విప్పితే మోక్షగుండం. సూర్యుడు ఆత్మకారకుడు. పగలంతా లోకాలను వెలిగించి, రాత్రి పడమటి సముద్రంలో తల దాచుకుంటాడు. రెక్కలార్చి గగన విహారం చేసే ఎర్రని పక్షి, నీటిని పీల్చుకుని, వర్షం కురిపిస్తుంది తృప్తినిస్తుంది. జీవరాశిని రక్షిస్తుంది– అని రుగ్వేదం సూర్యుణ్ణి వర్ణిస్తుంది. గరుత్మంతుడు తల్లి దాస్యం తప్పించడానికి స్వర్గాన్ని జయించి అమృతం తెచ్చాడు. పని పూర్తయిన వెంటనే తిరిగెళ్లి అమృతకలశాన్ని ఇంద్రుడికే సమర్పించాడు. ఇహపరాల నడుమ జీవనం సాగిస్తూ కష్టసుఖాలు చవిచూస్తూ వైరాగ్యంతో జీవన్ముక్తిని పొందడమే జీవిత పరమార్థం. నిష్కామకర్మ మార్గమే గమ్యానికి గమకం.

# నాభిలో నూనె వేస్తే..



నాభి భాగంలో రాత్రి సమయంలో నూనె రాసి మర్దన చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. సంప్రదాయ భారతదేశంలో ఈ పద్ధతిని చిన్నారి పుట్టినప్పటినుంచి మన అమ్మలు, అమ్మమ్మలు అనుసరించారు. దీనికి కొబ్బరి, బాదం, అవనూనెలను ఉపయోగించ వచ్చు.

★ రోజూ స్నానం చేసేటప్పుడు నాభిలో కొద్దిగా నూనె వేసి కాసేపాగి శుభ్రం చేయాలి. ఇంకా అల్లం, ఆవ నూనెల మిశ్రమాన్ని నాభి భాగంలో వేసి చుట్టూ ఉండే ప్రాంతాన్ని మర్దన చేయడం వల్ల కడుపునొప్పి, ఉబ్బరం, వికారం తగ్గుతాయి. ★. రాత్రి నిద్రించే ముందు నాభి భాగంలో రెండు చుక్కలు ఏదైనా నూనెను వేయడం వల్ల నెమ్మదిగా పిగ్మెంటేషన్ సమస్య తగ్గుతుంది. ★ మారుతున్న జీవనశైలీ, ఆమారపు అలవాట్లూ అనేక అనారోగ్యానికి దారితీస్తున్నాయి. వాటిలో ఒకటి చిన్న వయసులో కాళ్లనొప్పులు రావడం. కానీ ఈ బెల్లీ బటన్ ఆయిలింగ్ ద్వారా వీటిని నయం చేయవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి.

# నీలి మేఘాల సన్నిధి! సుస్వరాల పెన్నిధి !



పాటలోనే కాదు ఆమె మాటలోనూ తడబాటు ఉండదు. గమకాల గతి తప్పకుండా తన స్వరాన్ని కోకిల స్థాయికి ఎలా తీసుకెళ్లగలరో తనకు దక్కని అవార్డు కోసం ఆమె అంతే స్థాయిలో ప్రతిస్పందించగలరు. పాతికేళ్లనాడే నా ఆశ.. అడియాసల మేళవింపులో తన తొలిస్వరాన్ని చిత్రసీమకు పరిచయం చేసారు. 2013లో కేంద్ర ప్రభుత్వం సుస్వరాల జానకిగా పేరు పడిన నేపథ్యగాయని శిష్టా జానకికి పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆ అవార్డు తనకే వస్తోందంటే ఎగిరిగంతేయని, ఆనందడోళికల్లో ఊగిసలాడని 'సెలబ్రిటీ' ఎవరూ ఉండరు. కానీ జానకి మాత్రం అరవై ఏళ్ల గానామృత సేవ అనంతరం వచ్చిన పురస్కారం ఒక పురస్కారమే కాదన్న భావనతో దానిని తిరస్కరించారు. దక్షిణాది కళాకారులకు సరైన సమయంలో గుర్తింపు రాలేదని వాపోతూ దానిని తిరస్కరించడమంటే ఆమెలోని నిబద్ధతను మెచ్చుకోవాల్సిందే. అది దేశ మూడో అత్యున్నత పౌరపురస్కారం. ఇలాంటి గౌరవాన్ని తృణీకరించడమంటే జానకిని మనోధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. నేను ఈ వయసులో ఇంతగా రాణించాక 'భారత రత్న'కు అర్హురాలిని కాగా 'పద్మభూషణ్' ఇప్పుడా? అని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నేరుగానే ప్రశ్నించారు. మరోచోట పుట్టి ఉంటేనా అంటూ నర్మగర్భంగా ఎత్తిపొడిచారు కూడా. అదీ ఎంతో ధీమాగా. నవ్వుతో పాడి నవ్వతగా అలరించి నవ్వునే నవ్వించగల ఆమె 'సిరిమల్లె పువ్వల్లె నవ్వు' అంటూ నవ్వ మధురిమలు పండించారు. పసిపాప స్వరం నుంచి పండుముదుసలి స్వరం వరకు ఆమె పలికించిన రాగాలు స్వర రాగాలాపనలో అలవోకగా ఆమె పాడిన తీరు ఎంత ఆనందోత్తేజాలతో వీనుల విందుగా ప్రేక్షకులను అందించాయి. ప్రచారార్భాటాలకుగానీ, కీర్తికండూతికి గానీ ఆమె ఆమడ దూరంలో ఉన్నారు. తన స్వరం మారకముందే గౌరవంగా గానయాత్ర నుంచి తప్పుకోవాలని ఆమె అభిలషించారు. స్వర వైవిధ్యతతో సంగీత ప్రియుల్ని ఆకట్టు కున్నందువల్లే ఎంతో కాలం గాయనిగా నిలదొక్కున్నారావిడ. నుదుటిన నిండైన బొట్టుతో ఆమె ఎంతో గౌరవప్రదమైన రూపు రేఖావిలాసాలతో ఆకట్టుకునేవారు. తనకు పద్మభూషణ్ ఇస్తానన్నా ఎంతో తేలికగా తృణీకరించారంటే తన ఆత్మ గౌరవం ఎంతటిదో నిరూపించుకున్న ఆమె. దక్షిణాది గాత్రధారులు త్యాగయ్య, అన్నమయ్యలవంటి అసమాన ప్రతిభ కలిగిన వారు, గీతం ఏదైనా ఎలాంటిదైనా తన పద, స్వరలాలిత్యంతో శ్రోతలకు అభిమాన గాయనిగా మారారు. అందుకే ఆమె దక్షిణాది గానకోకిల'గా నీలిమేఘాలను దాటి అనంత వాయువుల్లోకి నిష్క్రమించారు.

సినిమా పాటల్లో నవ్వాల్సివస్తే జానకి అంత అందంగా నవ్వే గాయని మరొకరు లేరేమో. ఏదో నవ్వడం కోసం నవ్వడం వేరు. అలవోకగా నవ్వడం వేరు. కొన్ని పాటల్లో ఆమె నవ్వు మాత్రమే ఉండేది. పాట ఎవరు పాడినా ఆమె పాటకున్న గిరాకీ అలాంటిది. 'అభిలాష' చిత్రంలో 'యురేకా సకామికా! 'జ్యోతి' సినిమాలోని 'సిరిమల్లె పువ్వల్లె నవ్వు 'పాటలో ఆమె నవ్వు ఆ చిత్రాలకు వరహాలు కురిపించాయి. ఈ స్వరధుని గురించి ఒక్క మాట చెప్పుకోవాలి. హీరోలకు, హీరోయిన్‌లకు అభిమానిస్తూ విగ్రహాలు, గుడులు నిర్మించ వారుంటారు. గానీ ఓ స్వర మాధురి జానకి అంత్యక్రియలకు స్థలమిచ్చి ఆమె స్మారకార్థం ఒక భవ్య జ్ఞానమందిరంను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఓ కళాభిమాని. ఆమె అంత్యక్రియలు కూడా ఎంతో వైభవంగా జరుగుతున్నాయంటే ఆమె స్వరం జనం గుండెల్లో గూడుకట్టుకుని ఉందో అర్థమౌతుంది.

# మసాలా స్వీట్ కార్న్ వడ



**కావలసినవి:** స్వీట్ కార్న్ : కప్పు పెనర పిండి కప్పు, బియ్యపిండి పావుకప్పు, ఉల్లి ముక్కలు పావు కప్పు, క్యాప్సికమ్ ముక్కలు పావు కప్పు, కొత్తిమీర తురుము 2 టేబుల్‌స్పూన్లు, వెల్లుల్లి ముద్ద పావుటీస్పూను, కారం టీస్పూను, పసుపు పావుటీస్పూను, నిమ్మరసం టీస్పూను, ఉప్పు తగినంత, చాట్ మసాలా, టీస్పూను, నూనె వేయించడానికి సరిపడా.

**తయారుచేసూ విధానం :** స్వీట్‌కార్న్ కచ్చాపచ్చాగా రుబ్బాలి. అందులోనే మిగిలిన అన్ని దినుసులూ వేసి కలపాలి. ఇప్పుడు మిశ్రమాన్ని కొంచెం కొంచెంగా తీసుకుని వడల్లా వత్తి కాగిన నూనెలో వేయించి ఆపై చాట్‌మసాలా చల్లి గ్రీన్ చట్నీతో అందిస్తే సరి.

## తెర

# 'రణబాలి' స్టిల్ షేర్ చేసిన రష్మిక



'రణబాలి' స్టిల్ షేర్ చేసిన రష్మిక మందన్న 'రణబాలి' చిత్రాన్ని తెరపై చూసేందుకు ఆత్రుతగా వెయిట్ చేస్తున్నానంటూ రష్మిక ఇన్ స్టా పోస్ట్‌విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై రణబాలి సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రణబాలి సినిమా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్ కు అన్ని సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి.ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది మూవీ. తాజాగా ఈ సినిమా సెట్స్ నుంచి ఓ ఇంట్రెస్టింగ్ స్టిల్ షేర్ చేశారు హీరోయిన్ రశ్మిక మందన్న. రణబాలి సినిమాలో విజయ్ నటిస్తున్న ఇంటెన్స్ సీన్ స్టిల్ తో ఆమె చేసిన ఇన్ స్టా పోస్ట్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ ఇన్ స్టా పోస్ట్ లో రశ్మిక స్పందిస్తూ ఈ స్టిల్ ఇప్పుడే మీతో షేర్ చేసుకోవచ్చో లేదో తెలియదు. గతంలో ఎన్నోసార్లు చెప్పినట్లు ఈ పోస్ట్ ను కూడా తొలగించమని వారు నన్ను అడగరని భావిస్తున్నా. కానీ రణబాలి టీమ్ మాత్రం ఒక అద్భుతాన్ని క్రియేట్ చేస్తున్నారు. ఆ ప్రపంచాన్ని తెరపై చూసేందుకు ఆత్రుతగా వేచి చూస్తున్నా. అని అన్నారు. రణబాలి చిత్రంలో రష్మిక జయమ్మ అనే పాత్రలో రణబాలికి

# 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్ లాంచ్



ఫహాద్ ఫాజిల్ హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్స్ పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మించిన చిత్రం డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను సోమవారం నాడు రిలీజ్ చేశారు. ఎస్.ఎస్ కార్తికేయ మాట్లాడుతూ.. .. ఫహాద్ ఫాజిల్‌తో సినిమా నిర్మిస్తుండటం ఆనందంగా ఉంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' టీజర్ చూసే ఉంటారు. అందరికీ నచ్చే ఉంటుంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మనసుకు హత్తుకునే చిత్రం. ఇకపై నుంచి రాబోయే కంటెంట్‌ని చూస్తే ఆ విషయం మీకే అర్థం అవుతుందినిర్మాత శోభు యార్లగడ్డ మాట్లాడుతూ.. .. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' అంటూ ఫహాద్ ఫాజిల్ గారితో సినిమా చేయడం మాకెంతో ఎగ్జైటింగ్‌గా ఉంది. చాలా రోజుల తర్వాత మళ్లీ ఓ మూవీని ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నాం. మా మూవీ టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నాను. అందరూ చూసి ఎంజాయ్ చేసేలా మా చిత్రం ఉంటుంది. ఆడియో బైట్ ద్వారా ఫహాద్ ఫాజిల్ మాట్లాడుతూ.. .. తెలుగులో ఒక స్ట్రెయిట్ సినిమా చేయాలని నేను ఎప్పటి నుంచో అనుకుంటూ ఉన్నాను. ఒక మంచి స్క్రిప్ట్ కోసం వెయిట్ చేస్తూ ఉన్నాను. శశాంక్ చెప్పిన కథ నాకు ఎంతో నచ్చింది. ఇలాంటి మంచి ఫ్యాంటసీ డ్రామా ఎలిమెంట్స్ ఉన్న సినిమా చేయడం ఆనందంగా ఉంది అని అన్నారు. దర్శకుడు శశాంక్ యేలేటి మాట్లాడుతూ.. .. డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ కాన్సెప్ట్ కొత్తగా ఉంటుంది. ప్రేక్షకుల్ని ఎంటర్టైన్ చేసేలా మా సినిమా ఉంటుంది. సంగీత దర్శకుడు కాల భైరవ మాట్లాడుతూ.. ..డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ షూటింగ్ టైంలో మేం ఎక్కడా ట్రబుల్ అవ్వలేదు. ఇదొక మ్యాజికల్ వరల్డ్. మా టీజర్ ఎంత బాగుంటుందో.. సినిమా కూడా అంతే స్థాయిలో బాగుంటుంది. .చైల్డ్ ఆర్టిస్ట్ సారా మాట్లాడుతూ.. .డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ చిత్రంలో నేను దివ్య అనే పాత్రను పోషించాను. శశాంక్ గారు అద్భుతమైన దర్శకులు. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన శోభు సార్, ప్రసాద్ సార్, కార్తికేయ సర్‌లకు థాంక్స్. ఫహాద్‌తో వర్క్ చేయడం ఆనందంగా ఉంది.

# 'లెనిన్' విజయం ఆనందాన్ని ఇచ్చింది : భాగ్యశ్రీ బోర్సే



**'లెనిన్' విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?**

ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ సినిమా గురించి, నా నటన గురించి ఎంతో మంచి మెసేజ్‌లు పంపుతున్నారు. ఈ విజయం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది.

**ఈ సినిమా విషయంలో మీరు చాలా ఎమోషనల్ అయ్యారు. మీకు ఇందులో అంతగా నచ్చిన అంశం ఏమిటి?**

ప్రతి సినిమాను ఎంతో ఇష్టంతోనే చేస్తాం. ప్రతి సినిమా మాకు ప్రత్యేకమే.'లెనిన్' విషయంలో ఒక మంచి కథ దొరికింది. మేమంతా ఈ సినిమాను బలంగా నమ్మాం. మా నమ్మకం నిజం కావడంతో ఈ విజయం మరింత భావోద్వేగంగా అనిపించింది.

**హైదరాబాద్ మీకు ఎందుకు అంత ప్రత్యేకం?**

తెలుగు సినిమా నాకు నటిగా అవకాశం ఇచ్చింది. నా తొలి సినిమా ప్రయాణం హైదరాబాద్ నుంచే ప్రారంభమైంది. తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ప్రేమగా ఆదరించారు. తెలుగు అమ్మాయిలాగే నన్ను చూసుకుంటున్నారు. అందుకే హైదరాబాద్, తెలుగు సినిమా పరిశ్రమ నాకు ఎంతో ప్రత్యేకం. ఈ అనుబంధం జీవితాంతం కొనసాగాలని కోరుకుంటున్నాను.

**ఈ సినిమా చూసిన తర్వాత మీ అమ్మానాన్నల స్పందన ఎలా ఉంది?**

అమ్మగారు నాకు ఫోన్ చేశారు. తనకు సినిమా చాలా నచ్చింది. నా నటన కూడా ఎంతో బాగా అనిపించిందన్నారు. అయితే నా పాత్ర ముగింపు చూసి ఒక తల్లిగా చాలా ఎమోషనల్ అయ్యారు.

**అఖిల్ తో వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?**

ఇది లెనిన్‌భారతి ప్రేమకథ. అందుకే మా ఇద్దరి పాత్రలు తెరపై చాలా సహజంగా కనిపించేలా ప్రతి సన్నివేశంపై ఎంతో శ్రద్ధ పెట్టి పనిచేశాం. అఖిల్ చాలా అద్భుతమైన డ్యాన్సర్, పెర్ఫార్మర్. ఈ సినిమాలో ఆయన నటన అద్భుతం.

**నాగార్జున మీకు ఏమైనా సలహాలు ఇచ్చారా?**

మొదటి నుంచే నాగార్జున గారికి ఈ సినిమాపై పూర్తి నమ్మకం ఉంది. ఆయన ప్రోత్సాహం ఎప్పుడూ మా వెంటే ఉంది.

# 'రూ.100 కోట్ల క్లబ్‌లోకి మా ఇంటి బంగారం'



. రీసెంట్‌గా సమంత ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ ఫ్యామిలీ డ్రామా"మా ఇంటి బంగారం' రిలీజై సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద అధికారికంగా రూ.100 కోట్ల మార్క్‌ను దాటి.. భారతీయ సినిమా చరిత్రలోనే రూపొందిన మహిళా ప్రధాన చిత్రాల్లో అతిపెద్ద కమర్షియల్ విజయాల్లో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలపరచుకుంది. ఈ చిత్రం తన బడ్జెట్‌పై 300 శాతం పైగా రికవరీ సాధించడం విశేషం. మా ఇంటి బంగారం చిత్రానికి రాజ్ కె నిడిమోరు ఆలోచన ప్రధాన బలం. ఆయన డైరెక్టర్ బీవీ నందిని రెడ్డితో కలిసి ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. రాజ్, సమంత, హిమాంక్ రెడ్డి దువ్వూరు కలిసి స్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా 2026 జూన్ 19న తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదలైంది. తమిళంలో ఎంగళ్ తంగం పేరుతో రిలీజైంది. గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి, ఆనంద్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు.ఈ చిత్రం ఓ సెన్సేషన్ క్రియేట్ చేసింది. అరుదైన రీతిలో అన్ని వయస్సుల మహిళలు, ప్రేక్షకులు థియేటర్లకు తరలివచ్చి ఈ సినిమాను బ్లాక్ బస్టర్ చేశారు. సమంత నటనతో పాటు, పర్ఫెక్ట్‌గా సెట్ అయిన నటీనటుల, సాంకేతిక నిపుణుల పనితీరుపై ఆడియెన్స్ ప్రశంసలు కురిపించారు. ఇది మాకు కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు!" అని సమంత అన్నారు."మా ఇంటి బంగారం సినిమా ద్వారా భాషతో సంబంధం లేకుండా, పూర్తిగా మహిళా ప్రధానంగా నడిచే కథలను ప్రేక్షకులు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారని మరోసారి ప్రూవ్ అయ్యింది" మా ఇంటి బంగారం సినిమా ఇక్కడే కాకుండా ఓవర్సీస్‌లోనూ సక్సెస్‌ఫుల్‌గా థియేట్రికల్ రన్‌ను కొనసాగిస్తోంది.

# 'ఇడుపు కాయితం' డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో రిలీజ్




ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా "ఇడుపు కాయితం" సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా లాంఛనంగా పూజా కార్యక్రమాలు జరుపుకుంది."ఇడుపు కాయితం" సినిమా టైటిల్ నేపథ్యంగా సాగిన చర్చ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టైటిల్ తోనే ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. అతి తక్కువ టైమ్ లో మరే చిత్రానికీ లేనంతగా ఈ సినిమా వార్తల్లో నిలిచింది. దీంతో ప్రేక్షకుల దృష్టిని ఈ సినిమా బాగా ఆకర్షిస్తోంది. సినిమా పూజా కార్యక్రమాల సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. "ఇడుపు కాయితం" త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనుంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో దర్శక నిర్మాతలు షేర్ చేసుకోనున్నారు.

# 'శ్రీనివాస మంగాపురం' ట్రైలర్ లాంచ్



అశ్విని దత్ సమర్పణలో, పి. కిరణ్ చందమామ కథలు బ్యానర్ నిర్మాణంలో జై కృష్ణ ఘట్టమనేని, రాషా తడాని, అజయ్ భూపతి 'శ్రీనివాస మంగాపురం' లవ్, ఇంటెన్స్ ఎమోషన్స్, పవర్ ఫుల్ యాక్షన్ థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని శ్రీనివాస మంగాపురం చిత్రంతో హీరోగా ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు. ప్రముఖ దర్శకుడు అజయ్ భూపతి ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడాని ఈ చిత్రంతో కథా నాయికగా తెలుగు చిత్ర సీమలోకి అరంగేట్రం చేస్తోంది. సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నారు. శ్రీనివాస మంగాపురం ట్రైలర్ ప్రేమ, యాక్షన్, భావోద్వే గాలతో ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంపై ట్రైలర్ మరింత ఆసక్తిని పెంచింది. విజయవాడలో గ్రాండ్‌గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో జై కృష్ణ మాట్లాడుతూ...మా తాతగారు సూపర్ స్టార్ కృష్ణ లేకపోతే నేను ఈ రోజు ఇక్కడ ఉండేవాడిని కాదు. ఆయన నాకు దేవుడితో సమానం. అలాగే మా బాబాయ్ మహేష్ బాబు కూడా నాకు ఎంతో సపోర్ట్ చేశారు. థాంక్ యూ బాబాయ్. హీరోయిన్ రాషా తడానీ మాట్లాడుతూ... . తెలుగు సినిమా లో తొలిసారి నటించడం చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు అజయ్ భూపతి గారికి, నిర్మాత కిరణ్‌కి ధన్యవాదాలు. నా కో స్టార్ జై కృష్ణ ఎంతో సహకరించారు. దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ... . జై కృష్ణను చూస్తే తొలి సినిమా చేస్తున్న హీరోలా అనిపించడు. 'శ్రీనివాస మంగాపురం' ట్రైలర్‌ను విజయవాడలో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ఘట్టమనేని ఆది శేషగిరిరావు మాట్లాడుతూ... కృష్ణకి, మహేష్ బాబుకి విజయవాడలో ఎంత అభిమానం ఉందో అందరికీ తెలుసు. మా కుటుంబానికి అప్సర థియేటర్‌తో ఐదు దశాబ్దాల అనుబంధం ఉంది.

# పబ్‌లో అగ్నిప్రమాదం: 27 మంది మృతి

## 22 మంది పరిస్థితి ఆందోళనకరం

**బ్యాంకాక్,జులై 13:** థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం దేశాన్ని విషాదంలో ముంచెత్తింది. నగరంలోని ఒక ప్రముఖ పబ్‌లో సంభవించిన ఈ ప్రమాదంలో కనీసం 27 మంది మరణించగా, మరో 63 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు బ్యాంకాక్ గవర్నర్ వెల్లడించారు. అధికారుల సమాచారం ప్రకారం, నగర ఉత్తర భాగంలోని పబ్ లో అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు భవనం మొత్తం వ్యాపించడంతో అక్కడ ఉన్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలను కాపాడుకునేందుకు పలువురు బయటకు పరుగులు తీయగా, మరి కొందరు భవనం లోపలే చిక్కుకుపోయారు. ఘటన స్థలాన్ని సందర్శించిన థాయ్ ప్రధానమంత్రి అనుటిన్ చార్న్‌విరాకుల్ మృతుల సంఖ్యను ధృవీకరించారు. ఆయన మాట్లాడుతూ, 'ఇప్పటివరకు 27 మంది మరణించారు. గాయపడిన చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది' అని తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలలో పబ్ ప్రధాన ద్వారం నుంచి భారీగా మంటలు



ఎగిసిపడుతున్న దృశ్యాలు కనిపించాయి. అదే సమయంలో లోపల ఉన్న ప్రజలు ప్రాణరక్షణ కోసం పరుగులు తీస్తూ బయటకు వస్తున్న దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం, చాటుచాక్ జిల్లాలోని రోంగ్ బీర్ నా లాట్ ఫ్రావో అనే పబ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మొదట కాలిన గాయాలతో ఉన్న ఒక వ్యక్తిని రక్షించినప్పటికీ, అనంతరం భవనం లోపల అనేక మంది చిక్కుకుపోయినట్లు గుర్తించారు. మంటల నుంచి తప్పించుకోవడానికి పలువురు పబ్‌లోని మరుగుదొడ్లలో దాక్కున్నారని సమాచారం. దట్టమైన పొగ, వేగంగా వ్యాపించిన మంటల కారణంగా వారు బయటకు రాలేకపోయారు. మృతులలో అధికశాతం మంది టాయిలెట్ ప్రాంతంలోనే లభించినట్లు అధికారులు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అనేక అగ్నిమాపక బృందాలు వాటర్ కెనాన్ల సహాయంతో సుమారు 30 నిమిషాలపాటు శ్రమించి మంటలను అదుపు లోకి తెచ్చాయి. ప్రమాదం అనంతరం విడుదలైన చిత్రాలలో పబ్ లోపలి భాగం పూర్తిగా కాలిపోయి బూడిదగా మారినట్లు కనిపించింది. కాలిపోయిన బల్లలు, కుర్చీలు, శిథిలాల మధ్య సహాయక బృందాలు గంటల తరబడి సహాయక చర్యలు నిర్వహించాయి. ఈ ఘటనతో థాయ్ లాండ్‌లోని పబ్‌ల భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది. పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ప్రస్తుతం ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మంటలు ఇంత వేగంగా ఎందుకు వ్యాపించాయనే అంశంతో పాటు, పబ్‌లో తగిన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే విషయాలను కూడా పరిశీలిస్తున్నారు.

# రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు సుప్రీం నోటీసు

## 'సిట్' నివేదిక అందివ్వాలని యుపి ప్రభుత్వానికి ఆదేశాలు

### విచారణ జులై 20కి వాయిదా

**న్యూఢిల్లీ, జులై 13:** రామ మందిర విరాళాల దుర్వినియోగం కేసుపై కొనసాగుతున్న దర్యాప్తుకు సంబంధించి స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే, ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)కి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ల వాదనలను కోరింది. కేంద్ర, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాల తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వారికి అధికారికంగా జ్యుడీషియల్ నోటీసు జారీ చేయవద్దని చేసిన అభ్యర్థనతో భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌నేతృత్వంలోని ముగ్గురున్యాయ మూర్తుల ధర్మాసనం ఏకీభవించింది. కేవలం ట్రస్ట్‌కు మాత్రమే అధికారిక జ్యుడీషియల్ నోటీసు జారీ చేయడానికి కోర్టు పరిమితమైంది.

**నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించాలి:** తాను ఇప్పటికే కోర్టు గదిలో ఉన్నానని, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని మెహతా తెలిపారు. కేసు దర్యాప్తుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును సీల్డ్ కవర్‌లో సమర్పిస్తానని న్యాయాధికారి ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటుచేసిందని, అరెస్టులతో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోందని ఆయన అన్నారు. దీనికి అంగీకరిస్తూ, సిట్ కూర్పువివరాలు స్టేటస్‌రిపోర్టులో ఉండాలని, తదుపరి విచారణ తేదీ అయిన జులై20నదానిని దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

# తమిళనాడులో గోవధ నిషేధం కేసు

## మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ, జులై 13:** 1976 నాటి ప్రభుత్వ ఉత్తర్వును అమలు చేయడం ద్వారా తమిళనాడులో గోవధపై రాష్ట్రవ్యాప్త నిషేధాన్ని తక్షణమే అమలు చేయాలని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలును సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం, తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన 'స్పెషల్ లీవ్ పిటిషన్' పై నోటీసులు జారీ చేయడంతో పాటు హైకోర్టు తీర్పు అమలుపై స్టే విధించింది. విచారణ సందర్భంగా, ఆ తీర్పు అమలును నిలిపివేసే మధ్యంతర ఉత్తర్వును జారీ చేయడానికి ముందు, సదరు తీర్పులో "సవరణ" అవసరమని జస్టిస్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. బక్రీద్ పండుగ సమయంలో లేదా మరే ఇతర రోజునైనా రాష్ట్రంలో ఎక్కడా ఆవు లేదా దూడను వధించకుండా చూడాలని ప్రధాన కార్యదర్శిని, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను ఆదేశిస్తూ మద్రాస్ హైకోర్టు మే 27న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమిళనాడులో పశువుల వధకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల పరిధిని మించి హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో వాదించింది.

# దేశవ్యాప్తంగా గోవధ నిరోధక చట్టం అమలు చేయాలి

## సుప్రీంకోర్టులో పిల్.. విచారణకు నిరాకరణ

**న్యూఢిల్లీ, జులై 13:** గోవధ నిరోధక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా వధశాలలను నియంత్రించాలని ఆదేశాలు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుప్రీంకోర్టు సోమవారం ఉపసంహరించుకున్నట్లుగా కొట్టివేసింది. ఇప్పటికే ఉన్న ఏదైనా కోర్టు ఉత్తర్వును ఉల్లంఘించిన పక్షంలో, ధిక్కారచర్యలను ప్రారంభించడమే సరైన పరిష్కారమని పేర్కొంది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది. "ఏదైనా ఉత్తర్వును ఉల్లంఘించినట్లయితే, ధిక్కార పిటిషన్ దాఖలు చేయండి" అని జస్టిస్ మెహతా నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్టేట్ ఆఫ్ గుజరాత్ వర్సెస్ మీర్జాపూర్ మోతీ ఖురేషీ కస్సాబ్ జమాత్ (2005) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గోవధ వ్యతిరేక చట్టాలను అమలు చేయాలని కేంద్రాన్ని, అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను (యుటిలను) ఆదేశిస్తూ మాండమస్ రిట్ జారీ చేయాలని ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) కోరింది. అంతేకాకుండా, వధశాలల నియంత్రణకు మార్గదర్శకాలను జారీ చేయాలని, ప్రస్తుతం ఉన్న వధ వ్యతిరేక చట్టాలను ఉల్లంఘించే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని కూడా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది బరున్ కుమార్ సిన్హా ఈ పిటిషన్ దాఖలు చేశారు.

# భార్య విసిరిన మొబైల్ తలకు తగిలి భర్త మృతి

**భువనేశ్వర్/బలాంగీర్:** ఒడిశాలోని బలాంగిర్ జిల్లాలో కుటుంబ కలహం విషాదాంతానికి దారితీసింది. దంపతుల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చగా, భార్య ఆగ్రహంతో మొబైల్ ఫోన్‌ను భర్తపై విసిరినట్లు తెలుస్తోంది. ఆ ఫోన్ తలకు బలంగా తగలడంతో అతడు తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు వెంటనే బలాంగీర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి (డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్) తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించగా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని భావించి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే అతని ఆరోగ్య పరిస్థితి విషమించగా మరోసారి అత్యవసర చికిత్స కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ అతని ప్రాణాలను కాపాడలేకపోయారు. చివరకు అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఇరాన్ హిట్‌లిస్ట్‌లో 13 మంది విదేశీ నేతలు

## ప్రతీకార నప్రతిజ్ఞ చేసిన సుప్రీం లీడర్



**టెహ్రాన్,జులై 13:** ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల అధినేతలే లక్ష్యంగా ఒక హిట్‌లిస్ట్‌ను హమ్‌షహ్రీ అనే పత్రిక విడుదల చేసింది. రాజధాని టెహ్రాన్ అధికార వర్గాల ఆధ్వర్యంలో నడిచే హమ్‌షహ్రీ అనే వార్తాపత్రిక 13 మంది విదేశీ నేతల ఫొటోలతో కూడిన ఒక ఇన్ఫోగ్రాఫిక్‌ను నిన్న రాత్రి ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం మొదటి రోజున అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన తర్వాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మొజ్తబా ఖమేనీ ప్రతీకార ప్రతిజ్ఞ చేశారు. ప్రతీకారం తీర్చుకోవడం మా జాతి సంకల్పం. అది కచ్చితంగా నెరవేరుతుంది. జాబితాలో పేర్లున్న ఈ నేరస్థులు మంచం మీదే ప్రశాంతంగా చనిపోవాలన్న కోరికను తమతో పాటే సమాధిలోకి తీసుకువెళతారని తన తండ్రి అంత్యక్రియల తర్వాత మొజ్తబా హెచ్చరించారు. అయితే, ఆయన తన సందేశంలో ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. హమ్‌షహ్రీ పత్రిక విడుదల చేసిన జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల పేర్లు ఉన్నాయి. వీరితో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే, పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో ఈ జాబితా కనిపించకపోవడం గమనార్హం. ఇది కేవలం పత్రిక ప్రచురించిన జాబితానే తప్ప, ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది కాదని తెలుస్తోంది. యుద్ధ సమయంలో తమ భూభాగంపై జరిగిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని, అమెరికా సైనిక విమానాలకు తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చి ఆ నేరంలో పాలుపంచుకున్నాయని

# అక్టోబరు 27న ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఎన్నికలు

**టెల్ అవీవ్,జులై 13:** ఇజ్రాయెల్‌లో తదుపరి సార్వత్రిక ఎన్నికలు 2026 అక్టోబర్ 27న నిర్వహించనున్నట్లు ఆ దేశ పార్లమెంట్‌నెస్సెట్ అధికారికంగా ప్రకటించింది. చట్టప్రకారం నిర్ణయించిన గడువు మేరకు ఈ ఎన్నికలు జరగనున్నాయని, ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం పూర్తవుతున్నందున పార్లమెంట్‌ను ముందుగానే రద్దు చేసే అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో ముందస్తు ఎన్నికలపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. ఇజ్రాయెల్ రాజకీయ చరిత్రలో ఈ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గత దాదాపు 40 ఏళ్లలో వివాదాల కారణంగా వాయిదా పడకుండా, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. అలాగే ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం గత 50 ఏళ్లలో పూర్తి నాలుగేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తొలి ప్రభుత్వంగా నిలవనుంది. ఈ ఏడాది మే నెలలో పార్లమెంట్‌ను రద్దుచేసి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన వచ్చినప్పటికీ, అది ఆమోదంపొందకపోవడంతో ప్రభుత్వం తనపూర్తి పదవీకాలాన్ని కొనసాగించింది. 2023 అక్టోబర్‌లో హమాస్ దాడి అనంతరం గాజా, లెబనాన్, ఇరాన్‌లతో జరిగిన యుద్ధాల నేపథ్యంలో జరగనున్న తొలిసార్వత్రిక ఎన్నికలు కావడంతో, ఈ ఎన్నికలను ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నాయకత్వంపై జరిగే ప్రజాభిప్రాయ సేకరణగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'నేను గాంధీజీని కాను..మళ్లీ చంపేస్తా'

## దోషిగా తేలిన వ్యక్తి కేరళ కోర్టులో వ్యాఖ్యలు

**ప్యాలక్కాడ్, జులై 13:** "మీరు కావాలంటే నన్ను ఉరితీయండి, నాకేమీ అభ్యంతరం లేదు. అవసరమైతే నేను మరికొందరిని కూడా అంతం చేస్తాను. నేను గాంధీజీని కాను" అని జంట హత్యల కేసులో దోషిగా తేలిన చెంతమర ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం పాలక్కాడ్ అదనపు సెషన్స్ కోర్టు అతన్ని దోషిగా నిర్ధారించిన కొద్దిసేపటికే అతను ఈ వ్యాఖ్యలు చేశాడు. శిక్షను ఖరారు చేసే ముందు ఏమైనా చెప్పదలచుకున్నారా అని న్యాయమూర్తి అడిగినప్పుడు, ఆ హంతకుడిలో ఎలాంటి పశ్చాత్తాపం గానీ, విచారం గానీ కనిపించలేదు. దానికి బదులుగా, అతను తన చర్యలను సమర్థించుకున్నాడు. "నేను అనుభవించిన పరిస్థితులను మీరూ ఎదుర్కొని ఉంటే, బహుశా మీరు కూడా నేను చేసిన పనే చేసేవారు" అని కోర్టుతో చెప్పి, "మీకు సరైనదనిపించిన శిక్షను విధించండి" అని అన్నాడు. ఈ కేసులో బుధవారం శిక్షను ఖరారు చేయనున్నారు. కేరళలో జరిగిన అత్యంత దారుణమైన ప్రతీకార హత్యల కేసుల్లో ఒకదాని విచారణ ఈ తీర్పుతో ముగిసింది. పాలక్కాడ్ జిల్లాలోని పోతుండిలో జనవరి 27, 2025న సుధా కరన్, అతని 75 ఏళ్ల తల్లి లక్ష్మిని హత్య చేసినట్లు చెంతమరపై అభియోగాలు నమోదయ్యాయి. తన వివాహ బంధం విచ్ఛిన్నం కావడానికి కారణమని భావించి, 2019లో తన పొరుగింటి మహిళ సజితను నరికి చంపడంతో మొదలైన పగకు ఈ హత్య లు పరాకాష్టగా నిలిచాయి. ఆ కేసులో దోషిగా తేలి రెండుసార్లు జీవిత ఖైదు శిక్ష పడినప్పటికీ,



అతను 2022లో బెయిల్‌పై విడుదలయ్యాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, చెంతమర బెయిల్ షరతులను ఉల్లంఘించి, మరింత ప్రతీకారం తీర్చుకునేందుకు రహస్యంగా పోతుండికి తిరిగి వచ్చాడు. ముందుగానే సమకూర్చుకున్న కొడవలితో, ఇంటి బయట ఉన్న సుధాకరన్‌ను నరికి చంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొడుకు ఆర్తనాదాలు విని బయటకు వచ్చిన లక్ష్మిపై కూడా అతను దాడి చేశాడు. హత్యల తర్వాత చెంతమర సమీపంలోని మట్టాయి అడవిలోకి పారిపోయాడు, అక్కడ రెండు రోజుల పాటు సాగిన ముమ్మర గాలింపు తర్వాత పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. ఈ జంట హత్యలు ఒక పెద్దకుట్రలో భాగం మాత్రమేనని దర్యాప్తు అధికా రులు తర్వాత వెల్లడించారు. అతని 'హిట్ లిస్ట్'లో విడిపోయిన భార్య, కుమార్తె, పోలీస్ అధికారి అయిన అల్లుడు, బావమరిది, స్థానికంగా ఉన్న మరో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీసులు ఆరోపించారు. విచారణ సమ యంలో 132మంది సాక్షులలో నలుగురు ఫిరాయించిన ప్పటికీ, ఫోరెన్సిక్, శాస్త్రీయ ఆధారాలతో కూడిన ప్రాసిక్యూషన్ 480పేజీల ఛార్జిషీట్ నిర్ణయాత్మకంగా నిలిచింది. కోర్టు వెలుపల, సుధాకరన్ కుటుంబం తాము ఇంకా భయంతోనే బతుకుతున్నా మని, కేరళను దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ నేరానికి మరణశిక్ష కంటే తక్కువ ఏదీ న్యాయం చేకూర్చదని చెబుతూ, మరణశిక్ష విధిం చాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది.

# మన్మోహన్‌సింగ్ ఆత్మహత్య చేసుకుంటానన్నారు

## మాజీ సిఇసి ఎస్‌వై ఖురేషి పుస్తకంలో ప్రస్తావన

**న్యూఢిల్లీ,జులై 13:** మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఎస్‌వై ఖురేషీ తన కొత్త పుస్తకం "నేను నాభారత్..100 తీపిగుర్తులు" పేరిట రాసిన పుస్తకంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు సంబంధించి ఓ ఆసక్తికర సంఘటనను వెల్లడించారు. 2012 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘంపై కొందరు కేంద్ర మంత్రులు చేసిన వ్యాఖ్యలపై తాను తీవ్ర ఆందోళన వ్యక్తం చేశానని, ఆ విషయం తెలుసుకున్న మన్మోహన్ సింగ్ తనను అత్యవసరంగా కలవాలని కోరినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను 4.5 శాతం నుంచి 9 శాతానికి పెంచుతామని అప్పటి కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్ యూపీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో ఉన్న సమయంలో కొత్త హామీలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. నాలుగు రోజుల



పాటు ఇరుపార్టీల వాదనలు విన్న ఎన్నికల సంఘం ఖుర్షీద్‌ను తప్పుబడు తూ కఠిన చర్యలు తీసుకుంది. అనంతరం కొందరు కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘం అహంకారంగా వ్యవహరి స్తోందంటూ వ్యాఖ్యలు చేశారని ఖురేషీ తెలిపారు. ఎన్నికల సంఘంపై మంత్రుల వ్యాఖ్యలు సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఖురేషీ అప్పటి ప్రధానమంత్రి మీడియా సలహాదారు హరీష్ ఖరేకు వివ రించారు. మరుసటి రోజే ప్రధానమంత్రి కార్యా లయం నుంచి ఫోన్ రావడంతో సాయంత్రం మన్మోహన్ సింగ్‌ను ఆయన కలిశారు. ఆ సందర్భంగా మన్మోహన్ సింగ్ తీవ్ర ఆవేదనతో హరీశ్ చెప్పింది నిజమైతే మీరు అలా అనుకుంటే నేను ఆత్మ హత్య చేసుకుంటా అని చెప్పారని ఖురేషీ తన పుస్తకంలో పేర్కొ న్నారు. ఆ వ్యాఖ్యలు తన గురించికాదని, కొందరు మంత్రుల ప్రవర్తన గురించేనని వివరిం చగా నాకు ఈ విషయం అసలు తెలియదు. తెలిసి ఉంటే వారిని తీవ్రంగా మందలించేవాణ్ని. ఇకపై ఏ సమస్య ఉన్నా నేరుగా నాకు ఫోన్ చేయండి అని మన్మోహన్ సింగ్ చెప్పినట్లు వెల్లడించారు.

# పింఛన్ కోసం వెళితే బ్యాంకు ఖాతాలో రూ.1500 కోట్లు

**ముజఫరాపూర్,జులై 13:** వృద్ధాప్య పింఛను, దివ్యాంగ పింఛను తీసుకునేందుకు బ్యాంకు కేంద్రానికి వెళ్లిన తండ్రీకొడుకులు తమ ఖాతాల్లో కనిపించిన భారీ మొత్తంచూసి అవాక్కయ్యారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సక్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని థాటియా సిహో గ్రామానికి చెందిన కామేశ్వర్ మిశ్రా తన వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు గ్రామంలోని సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) కేంద్రానికి వెళ్లారు. ఆయనతో పాటు దివ్యాంగ పింఛను పొందుతున్న కుమారుడు కూడా ఉన్నాడు. పింఛను నగదు తీసుకున్న అనంతరం ఇద్దరూ తమ బ్యాంకు ఖాతాల్లో మిగిలిన బ్యాలెన్స్‌ను పరిశీలించగా, అక్కడ కనిపించిన మొత్తం వారిని అవాక్కయ్యేలా చేసింది. బ్యాంకు ఖాతా వివరాల ప్రకారం, కామేశ్వర్ మిశ్రా ఖాతాలో సుమారు రూ.759 కోట్లకు పైగా బ్యాలెన్స్ కనిపించింది. ఇదే తరహాలో ఆయన కుమారుడి ఖాతాలో కూడా దాదాపు అంతే మొత్తం నమోదై రూ.1,500 కోట్లకు పైగా బ్యాలెన్స్ కనిపించింది. ప్రస్తుతం ఈ ఘటనకు గల అసలు కారణం తెలియరాలేదు. బ్యాంకింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపం లేదా సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా ఈ భారీ మొత్తం ఖాతాల్లో కనిపించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.



# జైషే మహిళా ఉగ్రవాద నెట్‌వర్క్ భగ్నం

## నిఘా వర్గాలు ఛేదించిన భారీ కుట్ర

**న్యూఢిల్లీ,జులై 13:** పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జేఇఎం) ఉగ్రవాద సంస్థ, భారత్‌లో విధ్వంసం సృష్టించేందుకు సరికొత్త, అత్యంత ప్రమాదకరమైన పన్నాగం పన్నింది. ప్రేమ, పెళ్లి పేరుతో భారతీయ మహిళలను వలలో వేసి, వారిని పాకిస్థాన్‌కు తరలించి, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకోవాలని చూస్తోంది. ఈ కుట్రను భారత నిఘా వర్గాలు (ఐబీ) ఛేదించాయి. జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలో గతేడాది అక్టోబర్‌లో ఏర్పాటైన జమాత్‌ఉల్‌మోమినాత్ అనే మహిళా విభాగం ఈ కుట్రకు కేంద్రంగా పనిచేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఐబీ అధికారుల కథనం ప్రకారం ఈ ఉగ్రముఠాలోని యువకులు భారతీయ మహిళలతో సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుంటున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలో నివసించే మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సుమారు ఆరు నెలల పాటు వారితో ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ, ప్రేమ నటిస్తూ నమ్మకం పెంచుతారు. తాము నిజమైన ప్రేమలో ఉన్నామని, పెళ్లి చేసుకుని మంచి జీవితం ఇస్తామని నమ్మిస్తారు. ఈ సమయంలో గూఢచర్యానికి సంబంధించిన సున్నితమైన ప్రశ్నలు ఏవీ అడగకుండా జాగ్రత్తపడతారు. పూర్తిగా వారిని నమ్మించి, పెళ్లికి ఒప్పించిన తర్వాత పాకిస్థాన్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తారు. పాకిస్థాన్‌కు చేరాక, వారిని ఉగ్రవాద భావజాలంతో నింపి, గూఢచారులుగా మార్చి తిరిగి భారత్‌కు పంపేందుకు ప్లాన్ చేస్తున్నారు. గతంలో ఇలాంటి కార్యకలాపాలు జమ్మూకశ్మీర్‌కే పరిమితం కాగా, ఇప్పుడు ఉగ్రవాదులు తమ దృష్టిని రాజస్థాన్‌పైకి మార్చారు. పాకిస్థాన్‌తో రాజస్థాన్‌కు 1,070 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉండటమే దీనికి ప్రధాన కారణం. శ్రీ గంగానగర్ నుంచి బార్మర్ వరకు విస్తరించిన ఈ సరిహద్దు ప్రాంతాల్లోని యువతుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఐఎస్ఐ మద్దతు ఉన్న ఉగ్రవాదులు నిశితంగా పరిశీలిస్తున్నారు.



# ఎసి కోచ్‌లలో చోరీల ద్వారా రూ.104.51 కోట్ల నష్టం: ఐఆర్‌సిటిసి

**న్యూఢిల్లీ,జులై 13:** భారతీయ రైల్వే లోని రైళ్ల ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు అందించే బెడ్‌రోల్ సామగ్రి భారీ స్థాయిలో చోరీకి గురవుతోంది. కొవిడ్ అనంతరం 2022 జనవరి నుంచి 2026 మే వరకు నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా టవళ్లు, దిండ్లు, దుప్పట్లు వంటి కనీసం 1.27 కోట్ల వస్తువులు మాయమైనట్లు ఆర్‌టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. సమాచార హక్కు దరఖాస్తుకు 69 రైల్వే డివిజన్లలో 54 డివిజన్లు స్పందించగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రజా ఆస్తులపట్ల నిరక్ష్య ధోరణిని ఇది ప్రతిబింబిస్తోందని విమర్శలు వస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో టవల్‌లు, దిండ్లు, దుప్పట్ల వంటి వస్తువుల చోరీ కారణంగా బెడ్‌రోల్ కాంట్రాక్టర్లకు సుమారు రూ.104.51 కోట్ల నష్టం వాటిల్లింది. 2022తో పోలిస్తే 2025 నాటికి ఇలాంటి దొంగతనాలు 56 శాతం పెరిగినట్లు వెల్లడైంది. ఈ సమస్యను రైల్వే అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారని, దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రయాణికులు అత్యధికంగా చోరీ చేసిన వస్తువుల్లో ఫేస్ టవల్ మొదటి స్థానంలో నిలిచింది. నాలుగేళ్లలో 46.54 లక్షల ఫేస్ టవల్స్ మాయమయ్యాయి. వాటి తర్వాత 41.13 లక్షల బెడ్‌షీట్లు, 23.59 లక్షల పిల్లో కవర్లు, 12.95 లక్షల దుప్పట్లు చోరీకి గురయ్యాయి. మరోవైపు బ్యాగులో సులభంగా పెట్టుకోలేని కారణంగా దిండ్లు అత్యల్పంగా చోరీకి గురయ్యాయి.

రైల్వే డివిజన్ల వారీగా చూస్తే బికనేర్ డివిజన్‌లో అత్యధికంగా 25.76 లక్షల వస్తువులు చోరీకి గురయ్యాయి. తర్వాత రాంచీ (9.31 లక్షలు), ఢిల్లీ (8.21 లక్షలు), ముంబై (8.17 లక్షలు), జోధ్‌పూర్ (8.09 లక్షలు), అహ్మదాబాద్ (6.94 లక్షలు) డివిజన్‌లు ఉన్నాయి. పంపిణీ బాధ్యత నిర్వహించే ఏజెన్సీలే ఈ వస్తువుల లెక్కలు చూసుకోవాల్సి ఉంటుందని, కొరత ఏర్పడితే ఆర్థిక భారం కూడా వారిపైనే పడుతుందని రైల్వే ప్రతినిధి తెలిపారు.


# సంక్షిప్త వార్తలు

## ఉక్రెయిన్ ప్రధాని యులియా రాజీనామా



**కీవ్, జులై 13:** ఉక్రెయిన్ ప్రధాని యులియా స్విరిడెంకో రాజీనామా చేశారు. ఉక్రెయిన్ మంత్రి మండలిలో ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ భారీ మార్పులు చేశారు. దీంతో ఆమె తప్పుకున్నారు. అధ్య క్షుడు జెలెన్‌స్కీ తనకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు ఆమె చెప్పారు. గతంలో ఉక్రెయిన్ ఆర్థిక మంత్రిగా స్విరిడెంకో చేశారు. అయితే 2005 జులైలో ఆమెకు ప్రధాని బాధ్యతలు అప్పగించారు. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజ ఒప్పందంలో కీలక పాత్ర పోషించినట్లు ఆమెపై గతంలో ఉక్రె యిన్ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. సంక్లిష్ట సమయంలో ఉక్రెయిన్‌కు నాయకత్వం వహిం చడం గౌరవంగా భావిస్తున్నట్లు స్విరిడెంకో తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.

## డ్రాగన్ విస్తరణ వాదం అక్రమమే: 14 దేశాల ప్రకటన



**మనీలా, జులై 13:** వివాదాస్పద దక్షిణ చైనా సముద్రప్రాంతంలో చైనా ప్రాదేశిక విస్తరణ యత్నాలు అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని అమెరికా, బ్రిటన్, మరో 12 దేశాలు పేర్కొన్నాయి. చైనా వ్యవహరిస్తున్న తీరు ప్రాంతీయ సుస్థిరతకు విఘాతం కలిగిస్తోందని తెలిపాయి. బీజింగ్ చర్యలను సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సముద్ర చట్ట ఒప్పందం ప్రకారం ద హేగ్‌లో ఏర్పాటైన వివాద పరిష్కార న్యాయస్థానం (ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్) 2016 జులై 12న వెలువరించిన తీర్పును ఆ ప్రకటన గుర్తు చేసింది. గుర్తించిన చైనా ప్రాదేశిక ప్రాంతాలకు వెలుపల, దక్షిణ చైనా సముద్ర జలాల్లోని వనరులపై చైనాకు ఎలాంటి హక్కులు లేవని పదేళ్ల నాటి ఆ తీర్పు పేర్కొంది.

## రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలపై విపక్షాల దుమారం




**న్యూఢిల్లీ,జులై 13:** యోగా గురువు బాబా రాందేవ్ చేసిన 'హిందూ రాష్ట్రం' వ్యాఖ్యలు దేశవ్యా ప్తంగా రాజకీయ, మతపరమైన చర్చలకు దారితీశాయి. భారతీయులందరి పూర్వీకులు ఒక్కరేనని, అందువల్ల హిందూ రాష్ట్రం అనే భావనపట్ల మైనారిటీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. రాందేవ్ వ్యాఖ్యలపై విపక్ష నేతలు, మత పెద్దల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న బాబా రాందేవ్, 2009లో తాను ఇస్లామిక్ దేవ్‌బంద్‌ను సందర్శించిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు.

## మానససరోవర్ యాత్రలో యమద్వార్ కీలకఘట్టం



**డెహ్రాడూన్,జులై 13:** ప్రపంచంలో అత్యంత పవిత్రమైన తీర్థయాత్రల్లో కైలాస మానససరోవర యాత్రలో తొలి ఆధ్యాత్మిక ఘట్టంగా నిలిచేది యమద్వారం. టిబెట్‌లోని నగారి ప్రాంతంలో, దర్చెన్‌కు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో 4,750 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రదేశం కైలాస యాత్ర ప్రారంభ బిందువుగా భావిస్తారు. పాప విముక్తికి సంకేతం యమద్వారం అంటే యమ ధర్మరాజు ద్వారం అనిఅర్థం. ఈ ద్వారంలోనుంచి వెళ్లడం వల్ల భౌతిక బంధాలను విడిచిపెట్టి ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టినట్లుగా భావిస్తారు.

## ఎర్రకోట పేలుళ్ల కేసు మృతుల అంత్యక్రియలకు ఢిల్లీ కోర్టు అనుమతి



**న్యూఢిల్లీ, జులై 13:** గత నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారుబాంబు పేలుడులో మరణిం చిన 11 మందికి సంబంధించిన అవశేషాలను దహనం చేయడానికి నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ (ఎన్ఐఎ)కి ఢిల్లీకోర్టు సోమవారం అనుమతినిచ్చింది. ఆత్మాహుతి దాడిలో మరణించిన, పేలుడు పదార్థాలతో నిండిన కారు డ్రైవర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధించిన శరీర భాగాలను కూడా దహనం చేయడానికి ప్రత్యేక న్యాయమూర్తి పితాంబర్‌దత్ అనుమతించారు. బాధితుల మతప రమైన విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని, వారి శరీర భాగాలను పూర్తి గౌరవంతో దహనం చేయాలని కోర్టు పేర్కొంది.

## విమాన చార్జీల దోపిడీపై సుప్రీం సీరియస్

**న్యూఢిల్లీ, జులై 13:** విమాన టిక్కెట్ల ధరలలో ఏకపక్ష, మితిమీరిన హెచ్చుతగ్గులను అరికట్టేందుకు చర్యలు కోరుతూ దాఖలైనపిటిషన్‌పై విచారణ జరుపుతూ, ఛార్జీలను నియంత్రించడానికి రూపొందించిన నిబంధనల ప్రతిని తమ ముందు ఉంచాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాన్ని జారీ చేసింది.

# 30 రోజులకు పైగా జైల్లో ఉంటే వారి పదవులు రద్దు కావడం మంచిదే

## 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఎపి ప్రభుత్వం సంపూర్ణ మద్దతు

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులల స్థాయి, ఇతర ఉన్నత ప్రజాప్రతినిధుల పదవులు ఉండి తీవ్ర నేరాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టు అయి నెల రోజులకు మించి జైల్లో ఉన్న వారి పదవులు ఆటోమేటిక్‌గా రద్దయ్యేలా ప్రతిపాదించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఎపి సమాచార, పౌరసంబంధాల శాఖ, సిఎంఒ ప్రభుత్వ నిర్ణయాన్ని ఉటంకిస్తూ సమాచారపత్రాన్ని విడుదల చేశాయి. ఈ బిల్లు ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు అవినీతిని అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యగా నిలుస్తుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో ప్రవేశపెట్టిన ఈ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ సంయుక్త కమిటీ ముందు రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాలను అధికారికంగా వెల్లడించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు అత్యున్నత నైతిక ప్రమాణాలను పాటించాల్సిన బాధ్యత ఉందని ప్రభుత్వం అభిప్రాయపడింది.

తీవ్రమైన నేరాల ఆరోపణలతో జైలులో కొనసాగుతున్న వ్యక్తులు ప్రజా పదవుల్లో కొనసాగడం వల్ల పాలనా వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో 30 రోజులకు మించి జైలులో ఉన్న ప్రజాప్రతినిధుల పదవులను రద్దు చేసే నిబంధన ప్రజా ప్రయోజనాలను పరిరక్షించే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నట్లు వెల్లడించింది. ఈ చట్టాన్ని అమలు చేసే సమయంలో రాజకీయ ప్రేరేపిత కేసుల కారణంగా నిర్దోషులు ఇబ్బందులు పడకుండా తగిన భద్రతా నిబంధనలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసం నమోదు చేసే కేసుల ఆధారంగా ప్రజాప్రతినిధుల పదవులు కోల్పోయే పరిస్థితి రాకుండా చట్టంలో స్పష్టమైన రక్షణ కల్పించాలని అభిప్రాయపడింది. అవినీతి సుపరిపాలనకు, ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల విశ్వాసానికి ప్రధాన అడ్డంకిగా మారిందని ప్రభుత్వం పేర్కొంది.

అవినీతి కారణంగా ప్రభుత్వ నిధులు దారి మళ్లడం, అభివృద్ధి ప్రాజెక్టులు ఆలస్యం కావడం, సంక్షేమ పథకాల అమలు దెబ్బతినడం వంటి ప్రతికూల పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని వివరించింది. రాజ్యాంగం నిర్దేశించిన నిబద్ధత, పారద ర్శకత, జవాబుదారీతనం, రూల్ ఆఫ్ లా సూత్రాల ఆధారంగా పరిపాలన కొనసాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ఉన్నత పదవుల్లో అవినీతిని నియంత్రించడమే కాకుండా పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. అజ్ఞాత లేదంటే రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులు రాజ్యాంగ అనిశ్చితికి దారి తీయకుండా జాగ్రత్త వహించాలని ఎపి ప్రభుత్వం పేర్కొంది. విశ్వసనీయ ఆధారాలతో కూడిన ఫిర్యాదులనే పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. దర్యాప్తులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఎపి ప్రభుత్వం పేర్కొంది. దాని వల్ల కోర్టు ప్రొసీడింగ్స్ నిరవధికంగా పెండింగ్‌లో పడకుండా ఉంటాయిని ఎపి ప్రభుత్వం పేర్కొంది. రాజ్యాంగబద్ధ పాలనను పటిష్ఠం చేయాలంటే ఈ ప్రతిపాదనలకు విస్తృత స్థాయిలో మద్దతు లభించడం అవసరమని పార్లమెంటరీ సంయుక్త కమిటీ ముందు తన అభిప్రాయాన్ని వెల్లడించింది.



## గాయని ఎస్.జానకి చిరస్మరణీయురాలు

**గుంటూరు కల్చరల్, జులై13 ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు మద్దు వెంకటస్వామి, వారి బృందం నక్షత్రగాయని ఎస్.జానకిని కోల్పోవడం సనీ రంగానికి ఒక తీరని లోటన్నారు. వారి జ్ఞాపకాలను తలచుకుంటూ 2013 ఫిబ్రవరి 24న గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహించిన ఎస్.జానకీ కార్యక్రమం అత్యంత అద్భుతంగా కిక్కిరిసిన జనంతో జరిగింది. వారు సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్, అనేక మంది కళాకారులను ఘనంగా సత్కరించారు. పుర ప్రముఖులు సంస్థవారు ఎస్.జానకినీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం నిర్వహించిన కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. 11-7-2026న ఎస్.జానకి పరమపదించడం ఒక తీరని లోటుగా భావిస్తూ గుంటూరు జిల్లా సంగీత కళాకారులతో, తమ కుటుంబ సభ్యుల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నట్లు వెంకటస్వామి తెలిపారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారంతో వినియోగదారుల హర్షం

## ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం పట్ల నెల్లూరు, అనంతపురం జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు అబ్దుల్ అజీజ్, హరనాథ్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా నెల్లూరు జిల్లాకు చెందిన వినియోగదారుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో లోవోల్టేజ్ సమస్య ఉందని డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా విన్నవించిన అనతికాలంలోనే సమస్యను పరిష్కరించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా అనంతపురం జిల్లాకు చెందిన వినియోగదారుడు హరనాథ్ బాబు మాట్లాడుతూ తమ విద్యుత్ సర్వీసుకు సంబంధించిన బిల్లింగ్ సమస్యను సిఎండి దృష్టికి తీసుకెళ్లిన రోజే సమస్యను పరిష్కరించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా 53 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపులు వంద శాతానికి చేరుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఆన్లైన్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు వీలుగా విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను దశలవారీగా మూసివేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్డి) కె. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఒ తోట మధుసూదన పాల్గొన్నారు.

## మత్స్యకారులకు కూటమి ప్రభుత్వంతోనే మేలు



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసిపి అధినేత జగన్ రవీంద్ర ప్రశ్నించారు. సోమవారం టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి, ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్య కారుడు చిన్నా అందించిన సమాచారంతో 72గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీమెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించామని వివరించారు. భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళ్తున్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ.3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. ఐదేళ్లలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు.

## ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్లు జైలు



**తిరుపతి, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు ఐదు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో బాటు ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఎడిజె న్యాయమూర్తి జస్టిస్ నరసింహమూర్తి తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో మూడు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించారు. 2017లో భాకరాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు నిందితులను పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. తిరుపతి జిల్లా భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో 01/2017 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో రేణిగుంట మండలానికి చెందిన గునిశెట్టి పుట్టాలయ్య(38), యల్లమందకు చెందిన పెట్లూరి రాజయ్య(30), చిన్నగొట్టిగల్లు మండలవాసి గడ్డంవారి మణికంఠ (27) ముద్దాయిలుగా ఉన్నారు. జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ చీఫ్ ఎల్.సుబ్బరాయుడు పర్యవేక్షణలో అమలు చేస్తున్న "గుడ్ ట్రయల్ మానిటరింగ్" విధానం ద్వారా కేసును సమర్థవంతంగా నడిపించడంతో నేరం రుజువై న్యాయస్థానం తీర్పు వెలువరించింది.



## తిరుచానూరు పద్మావతి అమ్మవారికి వజ్రాలతో కూడిన బంగారు హారం

**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరానికి చెందిన భక్తుడు శ్రీనివాస సోమవారం తిరుచానూరు లోని పద్మావతి అమ్మవారికి సుమారు 56.8 గ్రాముల బరువున్న వజ్రాలతో కూడిన బంగారు హారాన్ని ఆలయ అధికారులకు విరాళంగా సమర్పించారు. ఈ హారం విలువ సుమారు 12.50 లక్షలు రూపాయలు ఉంటుంది. అనంతరం ఆలయ అధికారులు దాతకు వేదాశీర్వచనం అందించి, పద్మావతీ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ దేవరాజులు, సూపరింటెండెంట్ లు సురేష్, రమేష్, మునిచెంగల్ రాయులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఆలయ ఇన్స్పెక్టర్ చలపతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పట్టపగలే మహిళపై కత్తితో దాడి



**తిరుపతి, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నగరంలో సోమవారం మద్యాహ్నం పట్టపగలే ఆటోలో వెళుతున్న ఓ మహిళపై దాడి జరిగింది. తిరుపతి రూరల్ ముత్యాల రెడ్డి పల్లి పంచాయతీ ప్రైమరీ హాస్పిటల్ ఎదురుగా ఈ సంఘటన జరగడంతో స్థానికులు భయంతో వణికిపోయారు. ఎంఆర్‌పల్లికీ సమీపంలోని వైకుంఠపురంలో నివాసముంటున్న హిమబిందు ఆటోలో వస్తుండగా ఓ కారు అడ్డగించింది. కారులో నుండి దిగిన వ్యక్తి ఆటోలో ఉన్న మహిళపై కత్తితో దాడిచేశాడు. మహిళ రెండు చేతులు అడ్డు పెట్టి ఆటో నుండి దిగి కాపాడండి అంటూ హోటల్ లోకి పరుగులుతీసింది. స్థానికులు ఆమెను రక్షించి రుయా ఆస్పత్రికి తరలించారు. హిమబిందు భర్త మహమ్మద్ షరీఫ్ విదేశాలలో ఉండగా ఆమె ఇద్దరు పిల్లలతో వైకుంఠపురం వద్ద నివాసముంటుంది. విషయం తెలుసుకున్న ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నగదు లావాదేవీల విషయంలో జరిగిన గొడవల వల్లే ఈ హత్యాయత్నంకు దారి తీసినట్లు పోలీసులు తెలిపారు.

# తిరుమల సమాచారం





## టిటిడి ట్రస్ట్‌లకు రూ.4.41 కోట్లు విరాళం

**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** హైదరాబాద్ కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ రీటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.4.41 కోట్లు విరాళంగా అందించింది. సోమవారం ఆ సంస్థ చైర్మన్ పొట్టి వేంకటేశ్వర్లు, డైరెక్టర్లు ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీ ్మ కుమారి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరిలకు విరాళం డిడిలను అందజేశారు.

**ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళం:** తిరుపతికి చెందిన శ్వాసకోశ వైద్యుడు డాక్టర్ సింగపాటి సుబ్బారావు ఆయన కుమారుడు సింగపాటి సాయికృష్ణ పేరుపై సోమవారం వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలో చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిని అందజేశారు.

## ఎస్వీ గోశాలకు మగ గుర్రం విరాళం



**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడు మదురైకు చెందిన భక్తుడు వడివేలు ముకుంధన్ టిటిడి ఎస్వీ గోశాలకు ఒక మగ గుర్రాన్ని విరాళంగా అందజేశారు. ఈ గుర్రానికి అవసరమైన శిక్షణ పూర్తి చేసిన అనంతరం, శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి సేవలో వినియోగించనున్నారు. సోమవారం ఉదయం దాత ఈ గుర్రాన్ని టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.వి.ఎన్. శివకుమార్‌కు అప్పగించారు. ఎస్వీ గోశాలలో విరాళం ఇచ్చిన గుర్రంతో కలుపుకుని ఐదు గుర్రాలు ఉన్నట్లు గోశాల డైరెక్టర్ శివకుమార్ తెలిపారు.

## నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డీకాసులవాడికి ఈనెల 17వ తేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వ తేదీ మంగళవారం నేడు ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయం లోపల ఆనంద నిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం శుద్ధిచేస్తారు. 17న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 17వ తేదీ విఐపి బ్రేక్ రద్దుచేశారు. 16న ఎలాంటి సిఫార్సులు స్వీకరించరు. 17వ తేదీ ఆణివార ఆస్థానం సందర్భంగా పుష్పపల్లకిపై మలయప్ప ఊరేగనున్నారు.



## ఆగస్టులో శ్రీవారి పవిత్రోత్సవాలు

### - ఒకే టిక్కెట్‌పై మూడురోజులు భక్తులకు దర్శనాలు

**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పలు రకాల ఉత్సవాలు, కైంకర్యాలు, సేవల వల్ల తెలిసీతెలియక జరిగిన పొరబాట్లను సరిదిద్దుకునేందుకు ఉత్సవ మూర్తులకు నిర్వహించే పవిత్రోత్సవాలు ఈ ఏడాది వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఏటా మూడురోజుల పాటు ఆలయంలోపల కల్యాణోత్సవ మండపంలో (సంపంగి ప్రాకారం) జరిగే ఈ పవిత్రోత్సవాలకు ఏ రోజుకా రోజు టిక్కెట్లు పొందిన గృహస్థ భక్తులను ఈ సేవకు అనుమతినిస్తారు. అయితే ఈ ఏడాది టిటిడి పెద్దలు వినూత్నంగా ఆలోచన చేసి ఏకంగా పవిత్రోత్సవాల టిక్కెట్‌ను ఐదువేల రూపాయలు (రూ.5వేలు) చేశారు. ఈ టిక్కెట్ ఆన్‌లైన్‌లో పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడురోజులు ఆలయంలోనికి చేరుకుని ఏడుకొండలస్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. పవిత్రోత్సవాలకు సంబంధించి సేవా టిక్కెట్లపై ఒకే టికెట్ పొందిన గృహస్థ భక్తులు మూడు రోజులు సేవలో పాల్గొనే అవకాశం కల్పించింది. తిరుమలేశుని ఆలయంలో ఈ ఏడాది ఆగస్టు 23 నుండి 25వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించేలా నిర్ణయించారు. ఆగస్టు 22న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనల, ఉత్సవాల్లో భక్తులువల్లగానీ, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు జరుగు తాయి. వాటివల్ల ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా ఆగమ శాస్త్ర ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సేవలో పాల్గొనాలని భావించే భక్తులకు ఈ నె 21వ తేదీన గురవారం ప్రత్యేకంగా టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేయనుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసే టికెట్ ను ఇద్దరు గృహస్థ భక్తులకు కలిపి 5వేల రూపాయలు చెల్లించి కొనుగోలు చేయవచ్చు. టికెట్లు పొందిన భక్తులు పవిత్రోత్సవాలు జరిగే మూడు రోజులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్ప స్వామికి జరిగే స్నపన తిరుమంజనంలో, చివరి రోజున పూర్ణాహుతిలో పాల్గొనే అవకాశం కల్పించారు. పవిత్రోత్సవాల టిక్కెట్లు పొంది సేవలో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో ఆయా రోజుల్లో ఉదయం 7 గంటలకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాలి. భక్తులు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డును చూపితే ఆలయంలోపలకు అనుమతిస్తారు. ఈ ఏడాది వినూత్నంగా భక్తులకు వరుసగా మూడు రోజులు ఇష్టదైవమ్ తిరుమలేశుని దర్శించుకునే అవకాశం కలగడంతో పెద్దసంఖ్యలో భక్తులు సద్వినియోగం చేసుకుంటారని టిటిడి అంచనా వేస్తోంది.

# వర్షాభావాన్ని ఎదుర్కొనేలా... కారేరీష్టి వరుణయాగం జరిపిస్తారా!?

### - అన్నప్రసాదంలో పప్పు మెనూకు ఆమోదం వస్తుందా! - నేడు టిటిడి బోర్డు సమావేశం

**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో దాదాపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సకాలంలో కురవాల్సిన వర్షాలు కురవక పోవడంతో జనం విలవిల్లాడిపోతున్నారు. సాధారణంగా జులై నెలనుండి వాతావరణంలో మార్పులతో ఉష్ణోగ్రతలు తగ్గి కాస్త వేడినుండి ఉపశమనం కలుగుతుంది. అలాంటిది ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ప్రభావం కూడా ఆశాజనకంగా లేదు. దీంతో జులై రెండవ వారంలో కూడా వర్షాలు చినుకు అనేది లేకపోవడంతో ప్రజలు ఏప్రిల్, మేనెల ఎండలను చవిచూస్తున్నారు. ఓ వైపు సూర్యుని వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా మరోవైపు రాత్రి వేళ ఉష్ణోగ్రతలు కూడా మరీ దారుణంగా ఉన్నాయి. తాగునీటికి కూడా జనం అల్లాడిపోయే పరిస్థితులు రానున్నాయనే ప్రమాద ఘంటికలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో టిటిడి రుత్వికులు, అర్చకులు, వేదపండితులు వర్షాల కోసం కారేరీష్టి వరుణయాగం జరిపించడం పరిపాటి. అలాంటిది ప్రస్తుతం ఉన్న టిటిడి బోర్డుగానీ, టిటిడి ఉన్నతాధికారులు కూడా అలాంటి మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంపై శ్రద్ధ చూపడంలేదు. పైగా ఆగమశాస్త్రపండితుల సలహాలు కూడా తీసుకోవడంలేదంటే పరిస్థితి ఏంటనేది అర్థమవుతుంది. అస్సలు బడ్జెట్‌లో ధార్మిక కార్యక్రమాలకు కేటాయించే నిధులకు గణాంకాలు(లెక్కలు)ఉండవు. మరీ యాగాలు చేపట్టేందుకు టిటిడి ఎందుకు నిర్లక్ష్యంగా ఉందనేది భక్తుల్లోనూ వినిపిస్తున్న వాదనలు. దేశంలో సకాలంలో వర్షాలు కురవాలని, రాష్ట్రం దేశం సుభిక్షంగా ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలో కారీరిష్టి యాగం, వరుణ జపం, పర్జన్య శాంతి హోమం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటి. హిందూ సనాతన ధర్మం ప్రకారం వర్షాల కోసం వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఈ యాగాన్ని అత్యంత పవిత్రంగా చేపడతారు. 32 మందికి పైగా వేద, శ్రౌత, స్మార్త పండితులు అత్యంత నిష్ఠతో ఈ యాగ కార్యక్రమాలను పూర్తి చేస్తారు.



నేడు మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగే బోర్డు సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు. రానున్న సెప్టెంబర్ నెలలో శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటం, ఆ తరువాత అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తిరుమలలో ఏర్పాట్లు, మాఢవీదుల్లో విస్తృత సౌకర్యాలు కల్పించే అంశాలపై కూలంకుషంగా చర్చించే అవకాశం ఉంది. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు రెండవది. అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి బోర్డు పలు విషయాలపై అజెండా రూపొందించింది.. టిటిడిలో ఉద్యోగాల ఖాళీల భర్తీ విషయంగా కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## ఆనందదాయని అవగాహనలో హాస్యవల్లరి



**గుంటూరు కల్చరల్, జులై 13 ప్రభాతవార్త:** హాస్యం ఒక ఆప్తమిత్రుని వంటిదని అది మనల్ని నవ్విస్తుంది, కవ్విస్తుంది, ఆనంద పరవశుల్ని చేస్తుందని అది మన పరిచయాలను పెంచుతుందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న హాస్యప్రియులు పలువరు మాట్లాడుతూ అన్నారు. సంస్థ కార్యాలయంలో 141వ హాస్యవల్లరి కార్యక్రమం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. కార్యక్రమాన్ని కవి, రచయిత బండికల్లు జమదగ్ని ప్రారంభిస్తూ ఆనందానికి సూచిక, ఆహ్లాదానికి సంకేతం నవ్వు అని గతంలో నవ్వు నాలుగు విధాల చేటు అనేవారని ఇప్పుడు నవ్వు నలభై విధాల గ్రేటు అంటున్నారన్నారు. ప్రముఖ హాస్యవిషయాల విశ్లేషకులు ఆర్.వి.వేంకటేశ్వర్లు మాట్లాడుతూ నవ్వులేని జీవితం దుర్భర దారిద్ర్యంతో సమానమన్నారు. రచయిత్రి టి.పద్మావతి, హాస్యప్రియులు సిహెచ్ బాలకృష్ణ, కెఎస్ ప్రసాద్ తదితరులు తమ జోక్స్, కామెడీ స్కిట్స్‌తో అలరించారు. కార్యక్రమంలో నవ్వుల జల్లులు, పిసినారులు వర్ధిల్లాలి, అఖిల మూర్ఖుల దినోత్సవం అనే రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా అందర్నీ కడుపుబ్బ నవ్వించారు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ట్రస్ట్‌లలో ప్రాణదానం ఒకటి. ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు సోమవారం బెంగళూరుకు చెందిన యువ వ్యాపారవేత్త వికేష్ విరాళం అందించాడు. తిరుమలలో టిటిడి చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి విరాళం డిడిని అందజేశారు.

14-7Pg7exHMNWJQE_14-7Pg7exHMNWJQE.qxd 13/Jul/26 11:55 PM Page 1



# ఆమ్లెట్ గొడవ ప్రాణం తీసింది!

## శ్రీకాకుళంలో అత్త వేధింపులతో కోడలు ఆత్మహత్య

**శ్రీకాకుళం, జులై 13 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అత్తా కోడళ్ల మధ్య తలెత్తిన ఓ చిన్న గొడవ చినికి చినికి గాలివానలా మారి, ఓ వివాహిత ప్రాణాలు తీసుకునేంత దారుణానికి దారితీసింది. ఆమ్లెట్ విషయంలో మొదలైన వివాదం, అత్త వేధింపులు, భర్త మద్దతు కరవవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ హృదయ విదారక ఘటన శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేటలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ఆదివారంపేటకు చెందిన కోనాడ నాగరాజు స్థానిక వస్త్ర దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతనికి పొందూరు మండలం బొడ్డేపల్లికి చెందిన షర్మిల (26)తో యేడాది క్రితం వివాహం జరిగింది. వివాహం తర్వాత దంపతులు ఉమ్మడి కుటుంబంతో కలిసి ఆదివారంపేటలోనే నివసిస్తున్నారు. అయితే, పెళ్లయిన నాటి నుంచి అత్త దమయంతికి, కోడలు షర్మిలకు మధ్య తరచూ చిన్న చిన్న విషయాలకే గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో భర్త నాగరాజు జోక్యం చేసుకోకుండా మౌనంగా ఉండేవాడని తెలుస్తోంది. ఈ నెల 8వ తేదీన నాగరాజు పని ముగించుకుని ఇంటికి రాగా, భర్తకు భోజనం వడ్డిస్తూ షర్మిల ఒక ఆమ్లెట్ వేసి పెట్టింది. అయితే, తన చిన్న కొడుకుకు ఆమ్లెట్ ఎందుకు వేయలేదంటూ అత్త దమయంతి కోడలితో గొడవకు దిగింది. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పెద్ద వివాదంగా మారింది. ఆ సమయంలో కూడా నాగరాజు ఏమీ మాట్లాడకపోవడంతో షర్మిల తీవ్రంగా నొచ్చుకుంది. శనివారం కూడా ఇదే విషయమై ఇంట్లో మరోసారి గొడవ జరిగింది. తరచూ అత్త వేధిస్తుండటం, చిన్న విషయానికే గొడవ పడుతుండటం, అన్నింటికన్నా ముఖ్యంగా కట్టుకున్న భర్త తనకు అండగా నిలబడకపోవడంతో షర్మిల తీవ్ర మనస్థాపానికి గురైంది. అందరూ నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయాన్నే షర్మిల విగతజీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేవలం ఆమ్లెట్ కోసం మొదలైన గొడవ ఒకరి ప్రాణాన్ని బలిగొనడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లక్ష్యం

## ఈగల్ చీఫ్ ఎ.కె. రవికృష్ణ



**విశాఖపట్నం, జులై 13 ప్రభాతవార్త:** గ్తంజాయి సాగు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈగల్ విభాగం చేపట్టిన "పల్లె బాటలో ఈగల్" కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చేపట్టారు. అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని కొత్తవలస గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఈగల్ అధికారులు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 20 వరకు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈగల్ చీఫ్ ఏ.కే. రవికృష్ణ తెలిపారు. ఆపరేషన్ చైతన్యం ద్వారా గంజాయి సాగు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. డ్రోన్ సర్వేలు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లతో గంజాయి సాగును గుర్తించి నిర్మూలిస్తున్నామని వివరించారు. గంజాయి నిర్మూలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్న ఆయన, ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అధునాతన సాంకేతికతను వినియోగించి ఈగల్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, రాష్ట్రంలో గంజాయి సాగుతో పాటు వినియోగం కూడా గణనీయంగా తగ్గిందని ఏ.కే. రవికృష్ణ తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు.


# పోలీసుల విచారణలో నోరు విప్పని గమన

## 17న విచారణకు హాజరుకావాలని నోటీసులు

**గన్నవరం(కృష్ణా), జులై 13 ప్రభాతవార్త:** ఉపా కేసులో అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న ప్రశ్న రావణ్‌కు సన్నిహితంగా ఉంటున్న ప్రశ్న ఛానల్ సీఈఓ గమన, ఇంద్రసేనా చౌదరిలు పోలీస్‌ల విచారణలో నోరు విప్పటంలేదు. గన్నవరం పోలీసులు రెండురోజులుగా వీరిద్దరిని విడివిడిగా విచారిస్తున్నా ఫలితం లేకపోవటంతో పోలీసులు సాంకేతిక అంశాల ఆధారంగా విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలుసు _ంది. గన్నవరం ఇన్‌చార్జీ డిఎస్పీ ధరేంద్ర ఆధ్వర్యంలో సిఐ శివప్రసాద్ ఆది, సోమవారాల్లో గమన, ఇంద్రసేనా చౌదరిలను సుదీర్ఘంగా విచారించారు. నక్సల్స్‌తో ఎవిధమైన సంబంధాలు ఉన్నాయి, ఎవరి ప్రోద్బలంతో ప్రభుత్వ వ్యతిరేక వీడియోలు రూపొందిస్తున్నారు. పవన్‌కళ్యాణ్‌ను ఎందుకు దుర్భాషలాడుతున్నారు. మీకు ఆర్థికంగా సహకారం ఎవరిస్తున్నారు తదితర 15 ప్రశ్నలు పోలీసులు సంధించారు. పోలీసులు అడుగుతున్న ప్రశ్నలకు వీరిద్దరూ మౌనమే సమాధానంగా మారింది. ప్రశ్న కార్యాలయానికి ఉచితంగా గది ఎందుకు ఇచ్చారన్న ప్రశ్నకు భవనం ఖాళీగా ఉంటుందని, తమ బంధువు గమన అడగటంతో ఉచింతగా ఇచ్చానని ఇంద్రసేన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అంతకు మించి ఏ ప్రశ్నకూ సమాధానాలు ఇవ్వలేదు. గత రెండురోజులుగా ఉదయం నుండి సాయంత్రం వరకు విచారణ జరిపినా ఫలితం లేకపోవటంతో పోలీసులు సాంకేతిక అంశాల ఆధారంగా కేసు విచారణ జరపాలని నిర్ణయించారు. దీంతో వీరిద్దరినీ ఈనెల 17న మరోమారు విచారణకు హాజరుకావాలని నోటిసు ఇచ్చి సోమవారం సాయంత్రం పంపించి వేసారు. ఇదిలా ఉండగా రావణ్ ఫోన్‌లో డేటా రికవరీ ద్వారా వచ్చిన వీడియోలలో భాధితుల వివరాలు సేకరించే పనిలో పోలీసులు

# ఉలవపాళ్లలో చోరీ కలకలం

## - రూ.2 లక్షల నగదు, రెండు సవర్ల బంగారం, రెండు ట్రాక్టర్లలో డీజిల్ అపహరణ



**దగదర్తి (నెల్లూరు), జులై 13 ప్రభాతవార్త:** దగదర్తి మండలంలోని ఉలవపాళ్ల ఎస్టీ కాలనీలో ఆదివారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.2లక్షల నగదు, రెండు సవర్ల బంగారాన్ని అపహరించడంతో పాటు బయట నిలిపి ఉంచిన రెండు ట్రాక్టర్లలోని డీజిల్‌ను కూడా దొంగిలించారు. బాధితుడు చల్లా నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరులో కూరగాయలు, పండ్ల వ్యాపారం చేస్తూ వ్యవసాయ పనుల కోసం రెండు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ట్రాక్టర్ నెలవారీ వాయిదా చెల్లించేందుకు ఆదివారం సాయంత్రం సుమారు రూ.2లక్షల నగదును ఇంట్లోని బీరువాలో ఉంచి నెల్లూరుకు వెళ్లారు. రాత్రి సుమారు 12గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చిన నాగేశ్వరరావు ముందుగా బయట నిలిపిన ట్రాక్టర్లలో డీజిల్ దొంగిలించబడినట్లు గుర్తించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉండటంతో పాటు అందులో దాచిన రూ.2లక్షల నగదు, రెండు సవర్ల బంగారం కూడా చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై బాధితుడు దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


# 2వ దశ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జాబ్ కేలండర్ తయారీ సన్నద్ధతపై సిఎస్ సమావేశం



**సచివాలయం, జులై 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండోదశ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జాబ్ క్యాలెండర్ తయారీ సన్నద్ధతపై సోమవారం ఏపి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధ్యక్షతన కార్యదర్శులు, శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా రెండవ దశ జాబ్ క్యాలెండర్‌కు సంబంధించి భర్తీ చేయాల్సిన పోస్టుల నోటిఫికేషన్, కంప్లీషన్ ఆఫ్ ఈ-హెచ్ఆర్ఎం, లోకల్ కేడర్ ఆర్గనైజేషన్‌కు అనుగుణంగా నోటిఫికేషన్, నూతన లోకల్ కేడర్లలో పోస్టుల కేటాయింపు నోటిఫికేషన్ అన్ని కేడర్లలో ప్రాధాన్యత కేటగిరిలకు సంబంధించి సీనియారిటీ జాబితా ప్రిపరేషన్, ఎలాట్‌మెంట్ ఆఫ్ పెర్సన్స్ ఏపిపిఎస్సీ ఇతర రిక్రూటింగ్ ఏజేన్సీలకు ఇండెంట్స్ పంపడం తదితర అంశాలపై సమీక్షించారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన అన్ని అంశాల్లో ఉద్యోగులతో పూర్తి స్నేహపూర్వకంగా మర్యాద పూర్వకంగా వ్యవహరించి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సర్వీసెస్ మరియు హెచ్ఆర్ఎం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ మాట్లాడుతూ రెండవ దశ జాబ్ కేలండర్‌కు సంబందించి భర్తీ చేయాల్సిన పోస్టుల నోటిఫికేషన్, కంప్లీషన్ ఆఫ్ ఈహెచ్ఆర్ఎం, లోకల్ కేడర్ ఆర్గనైజేషన్‌కు అనుగుణంగా నోటిపికేషన్ నూతన లోకల్ కేడర్లలో పోస్టుల కేటాయింపు నోటిఫికేషన్ తదితర అంశాలకు సంబంధించిన టైమ్‌లైన్‌ను వివరించారు. నిర్దేశిత టైమ్‌లైన్ ప్రకారం ఉద్యోగుల కేటాయింపు తదితర చర్యలు పూర్తి చేయాలని, జీవోలను వెంటనే జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. స్పెషల్ సిఎస్‌లు బి.రాజశేఖర్, కృష్ణబాబు, జి.జయలక్ష్మీ, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు

# స.హ. చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి

## • రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవిబాబు



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 13 ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్ధవంతంగా అమలు చేసి, దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారాన్ని అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవి బాబు సూచించారు. సోమవారం నెల్లూరు పట్టణంలోని చెముడుగుంట జెడ్పీ హైస్కూల్, పంచాయతీ కార్యాలయం, విక్రమ సింహపురి యూనివర్సిటీ, విద్యుత్ భవన్, డీఈఓ కార్యాలయం, జిల్లా పరిషద్, డిపివో, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా కోర్టు, జిల్లా రిజిస్ట్రార్, డియంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, డిఎస్పీ, కలెక్టరేట్, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) అమలుపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో చట్టం అమలుకు సంబంధించి అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. సమాచార హక్కు దరఖాస్తుల నమోదు, పరిష్కారానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే కీలకమైన చట్టమని పేర్కొన్నారు. చట్టం కింద అందిన దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించి, దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందించడం ప్రతి ప్రజా సమాచార అధికారి బాధ్యత అని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పీలేట్ అధికారి వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డు ప్రదర్శించాలని సూచించారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని, చట్టంలోని నిబంధనల మేరకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని కార్యాలయ నోటీస్ బోర్డులు, వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసి, లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ రవి బాబు స్పష్టం చేశారు.

# ప్రభుత్వంపై తిరుగుబాటు కాదు, కార్యకర్తల ఆవేదన వ్యక్తం చేసా

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



**గన్నవరం, జులై 13 ప్రభాతవార్త:** రెండురోజుల క్రితం పిఎసిఎస్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాను చేసిన వాఖ్యలు ప్రభుత్వానికి, టిడిపికి వ్యతిరేకంగా కాదని టిడిపి నాయకులు, కార్యకర్తల ఆవేదనను తాను బహిరంగ వేదికపై వ్యక్తపరిచానని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ వివరించారు. సోమవారం సాయంత్రం ఆయన విజయవాడలోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో టిడిపి వ్యతిరేకులకు కాంట్రాక్టులు ఇవ్వటంపై కార్యకర్తల ఆవేదనను తాను వ్యక్తపరిస్తే కొన్ని యూట్యూబ్ ఛానళ్ళు, నీలిమీడియా దానిని చిలువలు పలువలుగా చిత్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. విమానాశ్రయం టెండర్ వ్యవహారంలో తాను ఏవ్యక్తికైనా టెండర్ ఇప్పించేందుకు ప్రయత్నించినట్లుగాని సిఫార్సు చేసినట్లుగాని నిరూపిస్తే మరుక్షణం పదవికి రాజీనామా చేస్తానని తనపై ఆరోపణలు చేసేవారు నిరూపించాలని సవాల్ చేసారు. విమానాశ్రయ ఎడ్వయిజరీ కమిటీ వైస్‌చైర్మన్ హోదాలో తాను ఎడ్వయిజరీ కమిటీ సమావేశానికి హాజరయ్యానని మిగిలిన పనులకు టెండర్ ఇవ్వటం, వ్యయం పెరగటంపై ఆసమావేశంలో చర్చకు వచ్చినట్లు చెప్పారు. ఇదే అంశంలో బందరు, విజయవాడ పార్లమెంటు సభ్యులు సైతం దీనిపై ప్రశ్నలు వేసారని గుర్తుచేసారు.

ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికే తీసుకువెళతానని స్పష్టం చేసారు. ప్రత్యర్దులతో సంబందాలు ఉన్నవారికి కాంట్రాక్టులు దక్కుతున్నాయని గన్నవరంలో ఐదేళ్ళపాటు పార్టీకోసం కష్టపడి కేసులు ఎదుర్కొని జైలుకు వెళ్ళిన కార్యకర్తలకు ఆవేదన ఉందని, వారంతా తమ ఆవేదనను తన దృష్టికి తెస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. విజయాడయిరీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపి బాద్యులపై చర్యలు తీసుకోవాలని తాను అసెంబ్లీలోనే ప్రస్తావించిన సంగతిని ఈసందర్భంగా యార్లగడ్డ గుర్తుచేసారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బయటకు రాని వ్యక్తులు ఇప్పుడు టిడిపి నాయకులమంటూ తిరగటం తీవ్ర అభ్యంతరకరమన్నారు.

# తిరుపతిలో తెలుగుతమ్ముళ్ల ఆక్రోశం

## మీడియా ప్రతినిధులపై దాడి



**తిరుచానూరు, జులై 13 ప్రభాతవార్త:** తిరుపతికి సమీపంలోని తిరుచానూరు మార్గంలోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన అన్నమయ్యజిల్లా తంబళ్ళపల్లి, పుంగనూరు నియోజక వర్గాల సమన్వయ సమావేశం రచ్చరచ్చగా మారింది. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జిలను నిర్ణయించేందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హోటల్‌లో సమావేశం జరుగుతున్న సమయంలో మీడియా కెమెరామెన్‌లు లోపలకు వెళ్ళేందుకుచూడగా కొందరు పుంగనూరుకు చెందిన తెలుగుతమ్ముళ్ళు అడ్డుకుని పిడిగుద్దులుతో దాడిచేశారు. టిడిపి శ్రేణుల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఇలా జరగడంతో మీడియా నివ్వెరపోయారు. ఈ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఘర్షణలు శృతిమించి మీడియా వారిపై కూడా అమానుషంగా దాడి చేయడం జరిగినది. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన తెదేపా పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవ పడుతున్న క్రమంలో ఆ దృశ్యాలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై తెలుగు తమ్ముడు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దాడి చేయడమే కాకుండా వాళ్ళ దగ్గర ఉన్న కెమెరాలు మొబైల్ ఫోన్లు లాక్కునే ప్రయత్నం చేసి బీభత్సం సృష్టించారు. వెంటనే స్పందించిన మీడియా ప్రెస్ క్లబ్ వారు సంఘటన స్థలానికి చేరుకొని పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. వెంటనే రాష్ట్ర మంత్రులు జనార్ధన్, మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, సాప్ చైర్మన్ రవి నాయుడు మీడియా మిత్రులను పరామర్శించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడే విధుల్లో ఉన్న డిఎస్పీకి మీడియా ప్రతినిధులు మురళి, బాలచంద్ర, జగన్ తదితర మీడియా నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు స్పందించి వెంటనే వారిపై తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# సారూ... మా పొట్ట కొట్టొద్దు!

## • ఆసుపత్రి వద్ద ఆక్రమణలు తొలగింపు • బాధితుల అడ్డగింపుతో ఉద్రిక్తత




**అనంతపురం క్రైమ్, జులై 13 ప్రభాతవార్త:** రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి మాది. సారూ మా పొట్ట కొట్టకండి.. కొన్నేళ్లుగా తాత్కాలిక అవాసాలు ఏర్పాటు చేసుకొని టీ కొట్టులు, టిఫిన్ సెంటర్లు పెట్టుకొని బతుకుతున్నాం.. మాకు ఇదే జీవనదారం.. రోజంతా కష్టపడి వచ్చిన సంపాదనతోనే పూట గడుస్తుంది.. దయచేసి మా టీ కొట్టులు టిఫిన్ సెంటర్లు తొలగించకండి అంటూ బాధితులు మునిసిపల్ అధికారులు పోలీసులకు విన్నవించుకున్నారు. అయినా ప్రజల సౌకర్యార్థం మేరకు తప్పని పరిస్థితి అంటూ పోలీసుల సాయంతో మునిసిపల్ అధికారులు రోడ్డు ఆక్రమణలపై కన్నెర్ర చేశారు. ఇదంతా నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ జిల్లా సర్వజన ఆసుపత్రి ఎదుట సోమవారం చోటుచేసుకుంది. సోమవారం ఉన్నపలంగా మునిసిపల్ అధికారులు రోడ్డుకిరు వైపులా వున్న ఆక్రమణలను జెసిబి సాయంతో వాటిని తొలగించేందుకు ఉపక్రమించారు. అయితే స్థానిక టూ టౌన్ పోలీసుల బందోబస్త్ మధ్య వాటిని తొలగించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. ప్రజల ఫిర్యాదు మేరకే చర్యలు తీసుకున్నాం.. మునిసిపల్ కమిషనర్ జస్వంత్ రావు ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు అందడంతో ఈ చర్య చేపట్టాము. ఆసుపత్రి ముందు ఉన్న ఆక్రమణల కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, అలాగే ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, ప్రజల భద్రత, సౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండేలా ఈరోజు ఆక్రమణలను తొలగించడం జరిగిందన్నారు. ప్రజల భద్రత, సౌకర్యం, ట్రాఫిక్ సౌలభ్యం ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

# మత్స్యకారుల సేవలో కీలక నిర్ణయం

## 5,910 మంది లబ్ధిదారులకు రూ.11.82 కోట్లు మంజూరు

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 సంవత్సరానికి "మత్స్యకారుల సేవలో" కార్యక్రమం కింద సముద్ర వేట నిషేధ కాల భృతి విడుదలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో)ను సోమవారం విడుదల చేసింది. ఈ పథకం కింద మొదటి విడతలో 1,28,388 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.256.776 కోట్లు విడుదల చేయగా, రెండో విడతలో సాంకేతిక, ఇతర కారణాల వలన మిగిలిన 5,910 మంది లబ్ధిదారులకు రూ.11.82 కోట్లు మంజూరు చేసింది. మొత్తంగా 1,34,298 మంది మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందనుంది. సముద్ర వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ భృతిని ప్రభుత్వం అందిస్తోంది. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వారి జీవనోపాధి భద్రత కోసం తీసుకున్న కీలక నిర్ణయంగా ఈ జీవో నిలుస్తుందని అధికారులు తెలిపారు.

# మహిళల నాయకత్వ అభివృద్ధిపై మంత్రి లోకేష్‌కు స్పష్టమైన దూరదృష్టి

## - మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళల నాయకత్వ అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్ కు స్పష్టమైన దూరదృష్టి ఉందని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. సోమవారం అమరావతి కరకట్ట వద్దనున్న ముఖ్యమంత్రి నివాసములో మంత్రి నారా లోకేష్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చట్టసభల్లో 33శాతం మహిళా రిజర్వేషన్ల అమలు నేపథ్యంలో మహిళల నాయకత్వ వికాసం, సమాజంలో మహిళలకు లభించాల్సిన మద్దతు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. మహిళల గౌరవాన్ని కించపరిచే సోషల్ మీడియా వ్యాఖ్యల విషయంలో సొంత పార్టీకి చెందిన వారిపైనా రాజీ పడకుండా కఠినంగా వ్యవహరించాలనే మంత్రి లోకేష్ సంకల్పం అభినందనీయమని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. మాటల్లో, చేతల్లో, సైగల్లో ఎలాంటి రూపంలోనైనా మహిళలను అవమానించే చర్యలను సహించబోమని రాష్ట్ర నాయకుడిగా నారా లోకేష్ ఇచ్చిన పిలుపు మహిళల స్థితిగతుల్లో సానుకూల మార్పునకు దోహదపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

# స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పేరిట మోసం

## రూ.21.7 లక్షలకు టోకరా

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త:** స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరిట విజయవాడ, సింగ్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి లక్షలాది రూపాయలు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విజయవాడ అజిత్ సింగ్ నగర్, డాబాకొట్ల సెంటర్సమీపంలో నివసిస్తున్న 46ఏళ్ళ వయస్సున్న సయ్యద్ సలీం అనే వ్యక్తికి ఫోను ద్వారా పరిచయమైన ఒక వ్యక్తి ఫిడెలిటీ ఇంటర్నేషనల్ అనే సంస్థకు చెందినదిగా పేర్కొంటూ ఒక వాట్సాప్ గ్రూపులో చేర్పించారు. ఆ గ్రూప్ సభ్యులు అడ్మినిస్ట్రేటర్లు, పెట్టుబడి సలహాదారులుగా నటిస్తూ తాము నిజమైన ఆర్థిక నిపుణులుగా పరిచయం చేసుకున్నారు. స్టాక్ మార్కెట్, ఐ.పి.ఓ. పెట్టుబడుల ద్వారా అధిక రాబడిని ఆశచూపించారు. రోజూ వివిధ వ్యక్తులకు ఈ పెట్టుబడుల ద్వారా లక్షలాది రూపాయలు లాభాలు వస్తున్నట్లు వాట్సప్ గ్రూపు మెసేజ్ ల ద్వారా నమ్మించారు. ఇది నిజమని నమ్మిన సలీం తను కూడా వారు సూచించిన బ్యాంకు ఖాతాలకు ఫోను వ్యాలెట్ ద్వారాపలుమార్లుగా మొత్తం రూ.21లక్షల 70వేలు చెల్లించారు. తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి వివరాలు రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి ప్రశ్నించడంతో అసలు బండారం బయటపడింది. ఇంకా డబ్బు జమ చేస్తే తిరిగి వస్తుందంటూ బూటకపు మాటలు చెబుతూ ఉండటంతో బాధితుడు విజయవాడ పోలీసులను ఆశ్రయించాడు. విజయవాడ, అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎరువుల కొరతలేదు: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్



**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి కావాల్సిన పరిమాణంలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా స్పష్టం చేసారు. జిల్లాలో ఎరువుల కొరత ఉందంటూ వదంతులు సృష్టించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపిఏఐయంఎస్ యాప్ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను పారదర్శకంగా అందస్తున్నట్లు చెప్పారు. రైతు తన భూమి విస్తీర్ణానికి సంబందించిన అంతమేరకు సరిపడా ఎరువులు అందస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులను ఒకేసారి కాకుండా మూడుదఫాలుగా అందిస్తామన్నారు. ఎరువుల సరఫరాలో ఇబ్బందుల ఎదురైతే 9154970454 హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో జిల్లావ్యవసాయఅధికారి విజయకుమారి, ఉద్యానశాఖాధికారి బాలాజీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నేటితో సర్‌కు లాస్ట్:** సర్ కార్యక్రమం మంగళవారంతో ముగుస్తుందని ఓటర్లు తమ వద్ద ఉన్న ఎన్యూమరేషన్ ఫారాలను తక్షణమే బిఎల్‌ఓలకు అందచేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా సూచించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 17,13,445 ఓటర్లకు గానూ 16,35,148 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ చేసినట్లు చెప్పారు.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

## - మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్

**కావలి (నెల్లూరు), జులై 13 ప్రభాతవార్త:** దేశంలో పిఎం నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రబత్వం ఏపిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. స్థానిక జర్నలిస్టుక్లబ్‌లో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు, ప్రాంతీయ రాజకీయాలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. గత 12 ఏళ్ళుగా పిఎం పరిపాలనలో ప్రజలకు చేకూరిన లబ్ది ఏమి లేదని విమర్శించారు. ఆయన రామాలయ నిర్మాణం కోసం దేశ వ్యాప్తంగా ప్రతి ఇల్లు, గ్రామం కోటీశ్వరుల నుంచి వేల కోట్ల రుపాయల చందాలు వసూలు చేశారన్నారు. అయితే ఆ నిధుల్లో 75శాతం మేర అవినీతి జరిగిందని యూపి ప్రజలే చెప్పుకోవడం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై సిబిఐ విచారణకు ఆదేశించిన దీనిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ నిధులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్‌పార్టీ తరపున ఆయన డిమాడ్ చేశారు.

# 15న ఐటిఐ కాలేజీలో జనరల్‌పూల్ కౌన్సెలింగ్

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త:** విజయవాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 15వతేదీ జనరల్‌పూల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్‌టీఆర్‌జిల్లా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ యం.కనకారావు సోమవారం ఒక్రపకటనలో తెలిపారు. ఐటిఐ కోర్సుల్లో చేరేందుకు ధఖాస్తు చేసుకుని ఇప్పటి వరకు సీటు రాని అభ్యర్దులు, గత కౌన్సిలింగ్‌కు హాజరుకాని అభ్యర్దులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

14-07pg10fLORSPTBV_14-07pg10fLORSPTBV.qxd 14/Jul/26 12:00 AM Page 1






# సెమీస్‌లో సూపర్ పవర్స్ సమరం

ప్రపంచాన్ని ఊపేస్తున్న సాకర్ వరల్డ్‌కప్ చివరి స్టేజ్‌కు చేరుకుంది. ఇపుడు ఫుట్‌బాల్ ప్రపంచం చూపంతా సెమీస్‌పైనే.. నాలుగు దిగ్గజాల మధ్య పోరు ఆసక్తి రేపుతోంది. డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో పాటు రన్నరప్ ఫ్రాన్స్, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, ఇంగ్లాండ్ జట్లు సెమీస్‌కు వచ్చాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత విజయవంతమైన, బలమైన జట్లుగా పేరుగాంచిన ఈ నాలుగు దేశాలు ఒకే టోర్నీలో చివరి నాలుగులో నిలవడం అభిమానుల్లో ఉత్కంఠను పెంచింది.

(వార్త క్రీడా విభాగం)

ఫిఫా ప్రపంచకప్‌లో ఈసారి గ్రూప్ దశలో 48 జట్లు పోటీపడ్డాయి. రౌండ్ ఆఫ్ 32, ప్రిక్వార్టర్స్, క్వార్టర్ ఫైనల్స్‌లో వడపోత తర్వాత నాలుగు జట్లు మిగిలాయి. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో అర్జెంటీనా దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టగా, 2022 ఫిఫా రన్నరప్ ఫ్రాన్స్ కూడా వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీస్‌కు దూసుకొచ్చింది. ఇక 16 ఏళ్ల తర్వాత స్పెయిన్ (2010 విజేత) సెమీస్‌లో అడుగుపెడితే, అటు మాజీ చాంపియన్ ఇంగ్లాండ్ కూడా తన దూకుడైన ఆటతీరుతో సెమీస్‌లో అడుగుపెట్టింది. ఇప్పటి దాకా తమకు ఎదురైన ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ వచ్చిన ఈ నాలుగు జట్లు నువ్వా నేనా అన్న రీతిలో సెమీస్‌లో తలపడనున్నాయి.

**ఫ్రాన్స్ వర్సెస్ స్పెయిన్**

మొదటి సెమీఫైనల్లో ఫ్రాన్స్-స్పెయిన్ తలపడనున్నాయి. యువ స్టార్ లామిన్ యమాల్ నాయకత్వంలో దూసుకెళ్తున్న స్పెయిన్, కిలియన్ ఎంబాపె నేతృత్వంలోని ఫ్రాన్స్‌కు గట్టి సవాల్ విసరనుంది. రెండు జట్లూ దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థులను ఓడిస్తూ సెమీస్‌కు చేరుకున్నాయి. ఎంబాపె అన్నీ తానై ఫ్రాన్స్‌ను నడిపిస్తున్నాడు. ఈసారి ఫిఫాలో ఆడిన 6 మ్యాచ్‌ల్లో 8 గోల్స్, మూడు అసిస్ట్‌లతో గోల్డెన్ బూట్ రేసులో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. ఎంబాపె తర్వాత ఒస్మోన్ డెంబ్లీ కూడా ఫ్రాన్స్‌కు బలమైన ఆటగాడు. ఫార్వార్డ్ ప్లేయర్ అయిన డెంబ్లీ ఆరు మ్యాచ్‌ల్లో ఐదు గోల్స్, రెండుఅసిస్ట్‌లతో గోల్డెన్ బూట్ రేసులో ఉన్నాడు. ఇక స్పెయిన్ తరఫున కెప్టెన్ రొడ్రితో పాటు యామినే లమాల్ కీలక ఆటగాళ్లుగా ఉన్నారు. వీరిద్దరితో పాటు మైకెల్ ఒయర్‌జబాల్ (ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు గోల్స్), గోల్ కీపర్ ఉనైయి సిమోన్‌లు కూడా తమదైన ఆటతో ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

**అర్జెంటీనా వర్సెస్ ఇంగ్లాండ్**

మరో సెమీఫైనల్లో ఇంగ్లాండ్-అర్జెంటీనా మధ్య భారీ పోరు జరగనుంది. కెప్టెన్ లియోనెల్ మెస్సీకి ఇది అత్యంత కీలక మ్యాచ్‌గా మారగా, హ్యారీ కేన్ సారథ్యంలో ఇంగ్లాండ్ తమ తొలి ప్రపంచకప్ లక్ష్యాన్ని సాధించాలని పట్టుదలగా ఉంది. ఈ మ్యాచ్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను ఆకట్టుకునే అవకాశం ఉంది.

ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ హ్యారీకేన్ ఈసారి ఎలాగైనా ఫిఫా ప్రపంచకప్ సాధించాలనే పట్టుదలతో ఉన్నాడు.ఆరు మ్యాచ్‌ల్లో ఆరు గోల్స్‌తో పాటు ఒక అసిస్ట్ చేసి ఆ జట్టు తరఫున గోల్డెన్ బూట్ రేసులో ఉన్నాడు. హ్యారీకేన్‌కు తోడుగా జూడ్ బెల్లింగ్‌హమ్ కూడా కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. బెల్లింగ్‌హమ్ కూడా ఆరు గోల్స్ చేసి హ్యారీకేన్‌తో సమానంగా ఉన్నాడు. ఇక డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాకు కర్త, కర్మ, క్రియ.. లియోనల్ మెస్సీ. మెస్సీ ఆరు మ్యాచ్‌ల్లో 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో రెండో స్థానంలో ఉన్నాడు. మెస్సీతో పాటు ఎమిలో మార్టినేజ్, జులియన్ అల్వారెజ్, అలెక్సిస్ మాక్ అలిస్టర్‌లు అర్జెంటీనా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఇరు సెమీఫైనల్ విజేతలు జూలై 19న జరిగే ఫైనల్లో తలపడ తాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌కు కొత్త ఛాంపియన్ ఎవరో తేలే ముందు జరిగే ఈ రెండు సెమీస్ ఫైట్స్ అభిమానులకు అసలైన ఫుట్‌బాల్ పండుగగా నిలవనున్నాయి. గత ఫిఫా ప్రపంచకప్ లాగే ఈసారి ఫైనల్లో అర్జెంటీనా, ఫ్రాన్స్ పోరును చూస్తామా లేక స్పెయిన్, ఇంగ్లండ్ ఆట చూస్తామా అనేది మరో రెండు రోజుల్లో తేలిపోనుంది. మొత్తానికి సెమీస్‌లో ఫుట్‌బాల్ దిగ్గజాల సమరం సర్వత్రా ఆసక్తి రేపుతోది.




# భారత్ బాక్సర్ల పంచ్‌కు 15 మెడల్స్

**జకార్తా, జులై 13:** ఇండోనేషియా రాజధాని జకార్తాలో జరుగుతున్న ఆసియా అండర్-19, అండర్-23 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు పవర్ పంచ్‌లతో విరుచుకుపడుతు న్నారు. అద్భుత ప్రదర్శనతో 15మెడల్స్ ఖాయం చేశారు. అండర్-23 పురుషులు,మహిళల విభాగాల్లో మొత్తం ఎనిమిది మంది బాక్సర్లు ఫైనల్‌కు చేరుకున్నారు. మరో ఏడుగురు సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు ఖాయం చేసుకున్నారు.

మహిళల అండర్-23 విభాగంలో నిషా (54 కేజీలు) దక్షిణ కొరియాకు చెందిన హ్యేజూ లీపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. నికితా చంద్ (60 కేజీలు) జపాన్‌కు చెందిన సారీ కొకుపును ఓడించగా.. కాజల్ (65 కేజీలు) కిర్గిజ్ స్తాన్‌కు చెందిన గుల్జినా మెల్స్‌వెక్‌పై ఏకపక్ష విజ యం సాధించింది. ముస్కాన్ (75 కేజీలు) ఉజ్బె కిస్థాన్‌కు చెందిన టోయిరోవా ఓయ్షాపై 5-0 తేడాతో గెలవగా, ప్రియాంక (80 కేజీలు) కజకిస్థాన్‌కు చెందిన పనార్ సెయిట్‌ఖాంకిజీపై 5-0 స్కోరుతోనే విజయం సాధించింది.

ఇక పురుషుల అండర్-23 విభాగంలో విశ్వనాథ్ సురేశ్ (50 కేజీలు) ఫిలిప్పీన్స్ ప్రత్యర్థిని 5-0తో చిత్తు చేశాడు. గంగా(55 కేజీలు) జపాన్ బాక్సర్‌పై 3-2 స్ప్లిట్ డెసిషన్‌తో గెలిచి ఫైనల్‌కు చేరాడు. వంశజ్ (65 కేజీలు) కిర్గిజ్‌స్తాన్ ప్రత్యర్థిపై 4-1 తేడాతో విజయం సాధించి బంగారు పతక పోరుకు అర్హత సాధించాడు.

మహిళల అండర్-23 విభాగంలో తను (51 కేజీలు), ప్రాచి (57 కేజీలు), శివాని (70 కేజీలు), నైనా (80 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో హితేష్ (70 కేజీలు), నీరజ్ (75 కేజీలు), ఇషాన్ కటారియా (90 కేజీలు) సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకా

## భారత్, ఇంగ్లాండ్ తొలి వన్డే

### నేటి మధ్యాహ్నం 3.30 గంటలకు

**బర్మింగ్‌హామ్, జులై 13:** టీ20 సిరీస్ ఓడిన టీమిండియా... ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధమైంది. నేడు ఇరు జట్ల మధ్య తొలి వన్డే బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనుంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.30గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో సత్తా చాటాలని లక్ష్యంగా పెట్టుకుంది.

స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై భారీ అంచనాలు ఉన్నాయి. వీరిద్దరితో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేరిక భారత్ బ్యాటింగ్‌ను పటిష్టం చేసింది. టాప్ ఆర్డర్ బలంగా మారింది. జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్ వంటి పేసర్లు భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు. జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులో చేరడం భారత బౌలింగ్‌ను పటిష్టం చేయనుంది. గాయంతో హర్షిత్ రాణా సిరీస్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం లభించింది.

ఇంగ్లండ్ జట్టులో జో రూట్ పునరాగమనం చేయనున్నాడు. బెన్ డకెట్, జేకబ్ బెతెల్ ఆరంభంలో వేగంగా పరుగులు సాధించగలరు. టీ20 సిరీస్‌లో పరుగుల వరద పారించిన కెప్టెన్ హారీ బ్రూక్స్, జోస్ బట్లర్ జోడీ మధ్య ఓవర్లలో జట్టుకు కీలకం కానుంది. ఎడ్జ్‌బాస్టన్ పిచ్ సాధారణంగా తొలి ఓవర్లలో పేసర్లకు కొంత సహకరిస్తుంది. కొత్త బంతిని సమర్థంగా ఎదుర్కొన్న జట్టుకు భారీ స్కోరు చేసే అవకాశం ఉంటుంది.




# భారత్ అమ్మాయిల చారిత్రక టెస్ట్ విజయం

**లండన్, జులై 13:** లార్డ్స్ టెస్ట్‌లో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. చారిత్రక టెస్ట్‌లో 270 పరుగులతో ఇంగ్లాండ్‌పై ఘనవిజయం అందుకున్నారు. మూడో రోజే విజయం ఖాయమైనా... నాలుగో రోజు తొలి సెషన్‌లో మిగతా నాలుగు వికెట్లు కూల్చి టీమిండియా గెలుపును ఖాతాలో వేసుకుంది.

ఓవర్‌నైట్ స్కోరు ఆరు వికెట్లకు 130 పరుగులతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్‌ను లంచ్ లోపే భారత బౌలర్లు కుప్పకూల్చారు. 52 పరుగులకు మరో రెండు పరుగులు జోడించిన అమీ జోన్స్(80 బంతుల్లో 54)ను స్నేహ రాణా అవుట్ చేసి నాలుగో రోజు వికెట్ల పతనానికి నాంది పలికింది. ఆతర్వాత ఇస్సీ వాంగ్(1), లూరెన్ బెల్(0)లను వెంటవెంటనే దీప్తి శర్మ అవుట్ చేసింది. మరో ఎండ్‌లో సోఫీ ఎస్సెల్‌స్టోన్(66 బంతుల్లో 50రన్స్) ధాటిగా ఆడుతూ కాసేపు భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. చివరికి అర్ధసెంచరీ చేసిన ఎస్సెల్‌స్టోన్‌ను స్నేహ రాణా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 186 పరుగుల వద్ద ముగిసింది. చివరి నాలుగు వికెట్లు 56 పరుగులకే పడిపోయాయి.

అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 రన్స్ చేయగా, ఇంగ్లాండ్ 170 పరుగులకు ఆలౌటైంది. భారత్ రెండో ఇన్నింగ్స్‌ను 341/7 వద్ద డిక్లేర్ చేసింది. 115 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని 457 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ముందు ఉంచింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. భారత బౌలర్లలో స్నేహ రాణా 4, సయాలీ 2, క్రాంతి గౌడ్ 2, దీప్తి శర్మ 2 వికెట్లు చొప్పున తీశారు. క్రాంతి గౌడ్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... మొత్తం ఏడు వికెట్ల ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. తొలి టెస్టు మ్యాచ్‌లో యస్తికా భాటియా (113) సెంచరీ సాధించింది. ఓపెనర్ స్మృతి మం ధాన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలతో మెరిసింది. లార్డ్స్‌లో భారత మహిళా జట్టు తొలిసారి టెస్టు ఆడటంతో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ హాజరయ్యారు.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 285**(మంధాన 83, హర్మన్‌ప్రీత్ 58, దీప్తి శర్మ 57, సోఫీ 3/68); **రెండో ఇన్నింగ్స్: 341/7డిక్లేర్డ్** (మంధాన 70, యాస్తికా113, రిచాఘోష్ 50 నాటౌట్); **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 170**(అమీజోన్స్ 52, బ్రంట్ 44, క్రాంతి5/37, సయాలీ 2/40, స్నేరాణా 2/41); **రెండో ఇన్నింగ్స్ 186**(అమీ జోన్స్ 54, సోఫీ 50,స్నేరాణా 4/42, క్రాంతి 2/54).




# ఐటీ షేర్లలో జోష్

## స్వల్ప లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జులై 13:** తొలి త్రైమాసిక ఫలితాల సీజన్ నేపథ్యంలో కంపెనీలకు సంబంధించిన వార్తలపైనే ఇన్వెస్టర్ల ఫోకస్ నిలవడంతో సోమవారం దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి.ప్రారంభంలో నష్టాల్లో ట్రేడైన సూచీలు చివరికి కోలుకుని స్వల్పంగా పెరిగాయి. ఐటీ షేర్ల లో బలమైన కొనుగోళ్లు మార్కెట్లకు ప్రధాన మద్దతుగా నిలిచాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3.59 శాతం ఎగసిపడగా, టీసీఎస్ 5.51 శాతం లాభపడటం ఈ రంగానికి ఊతమిచ్చింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు కూడా పెరిగాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.


బీఎస్ఈ సెన్సెక్స్ 47.04 పాయింట్లు పెరిగి 77,616.40 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 4.10 పాయింట్లు లాభపడి 24,211 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.90, భారతి ఎయిర్‌టెల్ 0.87, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.83 ప్రధానంగా సూచీలపై ఒత్తిడి తెచ్చిన షేర్లుగా నిలిచాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.02 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,335 షేర్లు లాభపడగా, 2,068 షేర్లు నష్టపోయాయి. 201 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే బలహీనపడింది. రూపాయి విలువ గత ముగింపు 95.3800తో పోలిస్తే 95.6700 వద్ద ట్రేడైంది.ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5,2026నాటి పసిడి సెటిల్‌మెంట్‌ధర 0.94 శాతం తగ్గి రూ.1,42,133 వద్దకు చేరింది.కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 2.33 డాలర్లు పెరిగి 78.34 డాలర్లకు చేరింది.

ఐటీ షేర్లలో భారీ ర్యాలీనిఫ్టీ ఐటీ సూచీ 3.59 శాతం పెరిగి 29,015.85 వద్ద ముగిసింది.వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో ఈ సూచీ మొత్తం 5.62 శాతం లాభపడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 5.51, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 5.15, ఇన్ఫోసిస్ 3.24 , టెక్ మహీంద్రా 3.24, ఎంఫాసిస్ 3.01, కోఫోర్జ్ 2.67,పర్సిస్టెంట్ సిస్టమ్స్ 2.63,విప్రో 1.68, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 0.68 చొప్పున లాభపడ్డాయి. ఎల్‌టీఎం షేరు కూడా 2.25 శాతం పెరిగింది.కంపెనీల వారీగాఎన్ఎండీసీ షేరు 0.80 శాతం తగ్గింది.ఫినో పేమెంట్స్ బ్యాంక్ షేరు 19.64 శాతం ఎగసింది. జస్ట్ డయల్ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. ఎల్అండ్‌టీ ఫైనాన్స్ షేరు 1.07 శాతం పెరిగింది. 2026 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 28.72 శాతం పెరిగి రూ.902.47 కోట్లకు చేరగా, మొత్తం కార్యకలాపాల ఆదాయం 22.38 శాతం వృద్ధితో రూ.5,212.92 కోట్లుగా నమోదైంది.స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ 1.35 శాతం లాభపడింది.

63 మూన్స్ టెక్నాలజీస్ 7.81 శాతం ఎగసింది.అవాంటెల్ 1.42 శాతం పెరిగితే బజాజ్ కన్స్యూమర్ కేర్ 1.53 శాతం తగ్గింది. ఇండస్ టవర్స్ 0.71 శాతం లాభపడింది.ఐపీఓ అప్‌డేట్‌సాయంత్రం 4:27 గంటల నాటికి లేజర్ పవర్ ఇన్‌ఫ్రా ఐపీఓకు భారీ స్పందన లభించింది. కంపెనీ ఆఫర్ చేసిన 2.55 కోట్ల షేర్లకుగాను 99.17 కోట్ల షేర్లకు బిడ్లు అందాయి. దీంతో ఈ ఇష్యూ 38.76 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఒక్కో షేరు ధర బ్యాండ్‌ను రూ.203-214గా నిర్ణయించారు.


## ఒక్కనెలలో భారత్ ఎగుమతులు

# 40.41 బిలియన్ డాలర్లు



**న్యూఢిల్లీ, జులై 13:**భారత్ ఎగుమతులు జూన్ నెలలో వార్షిక ప్రాతిపదికన 15.5 శాతం పెరిగి 40.41 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ముడి చమురు, ఎలక్ట్రానిక్ వస్తువులు, యంత్రాలు, విలువైన ఖనిజాల దిగుమతులు గణనీయంగా పెరగడంతో దేశ వాణిజ్య లోటు 30.43 బిలియన్ డాలర్లకు పెరిగింది.వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాణిజ్య గణాంకాలను వెల్లడిస్తూ, జూన్ నెలలో దిగుమతులు సుమారు 31శాతం పెరిగి 70.84 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని దీంతో వాణిజ్య లోటు 30.43 బిలియన్ డాలర్లుగా నమోదైందన్నారు. పశ్చిమాసియా దేశాలకు భారత్ ఎగుమతులు కూడా జూన్ నెలలో 7.29 శాతం పెరిగి సుమారు 5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వస్తు,సేవల కలిపిన మొత్తం ఎగుమతులు 11.37శాతం వృద్ధితో 232.73 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతఏడాది ఇదే కాలంలో ఈ విలువ 208.98 బిలియన్ డాలర్లుగా ఉంది.తొలి త్రైమాసికంలో ఎగుమతులు 15.92శాతం పెరిగి 129.32 బిలియన్ డాలర్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో అవి 111.57 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. నాన్‌పెట్రోలియం ఎగుమతులు కూడా బలమైన వృద్ధిని నమోదు చేశాయి. ఏప్రిల్‌జూన్ కాలంలో ఇవి 12.44 శాతం పెరిగి 106.30 బిలియన్ డాలర్లకు చేరగా, గత ఏడాది ఇదే కాలంలో 94.54 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు జూన్‌లో20.74శాతం పెరిగి 11.48బిలియన్ డాలర్లకు చేరాయి.గత ఏడాది ఇదే నెలలో ఇవి 9.51 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.ఎలక్ట్రానిక్ వస్తు వుల ఎగుమతులు 18.93శాతం పెరిగి 4.93బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# హెచ్‌సిఎల్ టెక్ నికరలాభం రూ.4624 కోట్లు




**న్యూఢిల్లీ,జులై 13:** దేశంలోని ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను సోమవారం ప్రకటించింది.ఈ త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల నిష్క్రమణ రేటు 12.5 శాతం నుంచి 12.7శాతానికి పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 12.8 శాతంతో పోలిస్తే ఇది స్వల్పంగా తగ్గింది. తొలి త్రైమాసికంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,292 మందికి తగ్గి 2.24 లక్షలకు చేరుకుంది. కంపెనీ 1,056 మంది కొత్త ఉద్యోగులను నియమించుకుంది. మూలధన వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడంపైనే సంస్థ దృష్టి కేంద్రీకరించినట్లు యాజమాన్యం తెలిపింది.ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే, కంపెనీ స్టాండ్‌అలోన్ నికర లాభం 3 శాతం పెరిగి రూ.4,624 కోట్లకు చేరుకుంది. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 1.8 శాతం వృద్ధితో రూ.34,579 కోట్లుగా నమోదైంది. కంపెనీ నికర లాభం రూ.4,529 కోట్లు, ఆదాయం రూ.34,326 కోట్లుగా ఉండొచ్చని భావించగా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వాటిని మించి ఫలితాలను నమోదు చేసింది.వడ్డీ, పన్నులకు ముందు లాభం కూడా 3.8 శాతం పెరిగి రూ.5,831 కోట్లకు చేరుకుంది. గత త్రైమాసికంలో ఇది రూ.5,620 కోట్లుగా నమోదైంది.రూ.12 మధ్యంతర డివిడెండ్‌షేర్‌హోల్డర్లకు శుభవార్తగా కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.12 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు సంబంధించి జూలై 17, 2026ను రికార్డ్ తేదీగా నిర్ణయించింది. అర్హులైన వాటాదారులకు డివిడెండ్ మొత్తాన్ని జూలై 27, 2026న చెల్లించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించింది. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి కంపెనీ షేర్ ధర 4.91 శాతం పెరిగి రూ.1,221.20 వద్ద ముగిసింది.

కార్మిక రాజ్య బీమా సంస్థ
Employees' State Insurance Corporation

"కార్మికులందరికి ఉదారమైన మరియు సమగ్ర సామాజిక భద్రత వ్యవస్థను అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది."
నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

దేశవ్యాప్తంగా
శ్రమ జీవుల ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేయటం

ప్రారంభోత్సవం
నూతన ఓపిడి బ్లాక్, ESIC ఆస్పత్రి, సనత్‌నగర్, తెలంగాణ
మరియు
వర్చువల్ గా ప్రారంభోత్సవాలు

100 పడకల ESIC ఆసుపత్రి, శ్రీ పెరుంబుదూర్, తమిళనాడు
100 పడకల ESIS ఆసుపత్రి, రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్
200 పడకలకు విస్తరించబడిన ESIC ఆసుపత్రి, బెల్టోల, గువాహటి, అస్సాం
ESI దవాఖానా మరియు బ్రాంచి కార్యాలయం, కోట, రాజస్థాన్
ESI దవాఖానా, భవానిమండి, రాజస్థాన్
ESI దవాఖానా మరియు బ్రాంచి కార్యాలయం, సురేంద్రనగర్, గుజరాత్

డా. మన్సుఖ్ మాండవియా
కార్మిక మరియు ఉపాధి మరియు యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రివర్యులు, భారత ప్రభుత్వం
చేతుల మీదుగా

మంగళవారం, జులై 14, 2026 I ESIC ఆస్పత్రి, సనత్‌నగర్, తెలంగాణ

పథకం లాభాలు
• దాదాపు 53 లక్షల లబ్ధిదారులకు లాభం
• గరిష్ఠ పరిమితి లేకుండ నగదురహిత వైద్య సదుపాయం
• ఇంటి సమీపంలోనే అధునాతన వైద్య పరికరాలతో నాణ్యమైన ఆరోగ్య సేవలు
• ESI దవాఖానాలు మరియు బ్రాంచి కార్యాలయాలలో ఒకే గొడుగు కింద నగదు లాభాలు మరియు ప్రాథమిక ఆరోగ్య సేవలు

మరింత సమాచారం కోసం సందర్శించండి: https://www.esic.gov.in/
లేదా ఫోన్ చేయవలసిన టొల్-ఫ్రీ నంబర్ 1800-11-2526
కార్యక్రమం ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్కాన్ క్యూఆర్ కోడ్

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14